




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 68 | బుధవారం | 26-08-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00




బిహార్‌లో ఉద్రిక్తం

విద్యార్థులు, పోలీసులకు మధ్య ఘర్షణ

07

## పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి
- కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై పిసిసి చీఫ్‌కు నివేదిక అందించిన క్రమశిక్షణ కమిటీ
- హైకమాండ్ ఆదేశాల మేరకే తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టీకరణ



ప్రజాపక్షం /హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ అత్యంత ప్రధానమని దానిని ఎవరూ ఉల్లంఘించినా చర్యలు తప్పవని ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి అన్నారు. పార్టీ గౌరవం క్రమశిక్షణపైనే ఆధారపడి ఉంటుందని, పార్టీపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక సంఘం చైర్మన్ జి.చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన నివేదికను క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్‌మోహన్‌లు మంగళవారం టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్‌కు అందజేశారు.అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన

తరువాయి 8లో

## మూసీ ఫేజ్-2కు త్వరగా టెండర్లు



- ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్, అసైన్డ్ భూముల సేకరణకు స్పష్టమైన విధివిధానాలు
- న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్త వహించాలి
- మూసీ రివర్‌ఫ్రంట్‌లో చేపట్టే ప్రాజెక్టులకు అతి తక్కువ వడ్డీకి రుణసదుపాయాలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలి
- కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలి
- మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

### భూసేకరణ వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కోసం అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణకు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్పష్టమైన విధానం రూపొందించాలని సిఎం చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ముఖ్యమంత్రి ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ఫేజ్2 కు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని సిఎం ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని అన్నారు. ఇందులో న్యాయపరమైన ఎలాంటి చిక్కులు రాకుండా

తరువాయి 8లో

## ఏడాదిలోగా దేవాదుల పూర్తి



- యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- ఫాస్ట్ ట్రాక్ విధానంలో భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- రెండు దశాబ్దాల క్రితం చేపట్టిన ప్రాజెక్టు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అసంపూర్తిగా మిగిలిపోయిందని మండిపాటు
- 38 టిఎంసిల గోదావరి జలాలు ఎత్తిపోసి 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని వచ్చే ఏడాదిలో పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ప్రాజెక్టును ఫాస్ట్‌ట్రాక్‌పై పెట్టి భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని జల సౌధలో దేవాదుల ప్రాజెక్టుపై మంగళవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన విస్తృతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ 'సీతక్క', ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపి పి. బలరాం నాయక్, సీనియర్ శాసనసభ్యుడు కడియం శ్రీహరి, దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గోదావరి జలాలను ఎత్తిపోసి తెలంగాణలోని విశాలమైన ప్రాంతానికి సాగునీటి భరోసా కల్పించాలన్న

తరువాయి 8లో

## కులగణనలో ప్రశ్నలు తప్పుదోవ పట్టిస్తున్నాయ్

- తెలంగాణ, బిహార్ పద్ధతిని పరిగణనలోకి తీసుకోవాలి
- ప్రస్తుత విధానాన్ని అంగీకరించబోం
- కులగణన ప్రశ్నావళిని పూర్తిగా రద్దు చేయాలి
- ప్రధాని మోదీకి ప్రతిపక్షనేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ లేఖ



**న్యూఢిల్లీ :** దేశంలో చేపడుతున్న కులగణన విధానంపై కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. కులగణన కోసం ప్రస్తుతం రూపొందించిన ప్రశ్నావళిని పూర్తిగా రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న విధానాన్ని తాము అంగీకరించడం లేదని స్పష్టం చేశారు. కులగణనలో ఓపెన్ ఎండెడ్ ప్రశ్నల విధానం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. తెలంగాణ, బిహార్‌లలో నిర్వహించిన కుల సర్వేల తరహాలో చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు గాంధీ ఈనెల 20న రాసిన లేఖపై గురించి మంగళవారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విలేకరులకు వివరించారు. కుల గణన విషయంలో ప్రభుత్వం చేస్తున్న

తరువాయి 8లో

## ఎన్‌డిఎస్‌ఎ, సిడబ్ల్యూపిఆర్ఎస్ నివేదికలే సమాధానం

- కాళేశ్వరంపై కాంగ్రెస్ చేసిందంతా దుష్ప్రచారమే
- బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనేత టి. హరీశ్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుష్ప్రచారానికి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) అఫిడవిట్, కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ (సిడబ్ల్యూపిఆర్ఎస్) నివేదికలు తగిన సమాధానంగా నిలిచాయని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనేత టి. హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టు మొత్తం కుప్పకూలిందని, నీళ్లు ఎత్తిపోయడం సాధ్యం కాదని ఇన్నాళ్లూ కాంగ్రెస్ చేసిన ప్రచారం ఒక్కొక్కటిగా వమ్మవుతోందన్నారు. అవసరాన్ని బట్టి

తరువాయి 8లో

## రాజకీయ కారణాలతో పర్యటనను అడ్డుకున్నారనడం పూర్తిగా అర్థరహితం

- అమెరికా పర్యటనపై రేవంత్‌రెడ్డి స్పష్టతనివ్వాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అమెరికా పర్యటనపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజకీయ కారణాలతోనే అమెరికా పర్యటనను అడ్డుకుందంటూ సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమని కొట్టిపారేశారు. దేశ

తరువాయి 8లో



సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంవి భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచిన సిపిఎం నేత సారంపల్లి మల్లారెడ్డి భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు.

03

## తెలంగాణకు మరో ఏడుగురు ఐపిఎస్‌లు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ పోలీస్ శాఖకు మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రానికి చెందిన ఏడుగురు నాన్‌కేడర్ పోలీసు అధికారులకు ఐపిఎస్ హోదా లభించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. యూపీఎస్సీ ఆమోదించిన 2025 సెలెక్ట్ లిస్ట్ ఆధారంగా ఈ ఎంపిక జరిగింది. ఐపిఎస్‌గా ఎంపికైన వారిలో పులిగిల్ల రవీందర్, బి. శ్రీ బాలాదేవి, వి. అరవింద బాబు, బి. రాజా మహేంద్ర నాయక్, బి. సాయి శ్రీ, ఐ. పూజ, పి. కరుణాకర్ ఉన్నారు. కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌లో మొత్తం 9 మంది అధికారుల పేర్లు ఉండగా, వారిలో కొందరి విషయంలో శాఖాపరమైన/ క్రిమినల్ వ్యవహారాలు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొంది. తాజాగా ఎంపికైన ఏడుగురికి ఐపిఎస్ హోదా దక్కడంతో తెలంగాణ పోలీస్ శాఖలో వారి స్థాయి మరింత పెరగనుంది.






## పునరుద్ధరణ పనులు పూర్తయ్యేదాకా మేడిగడ్డను వినియోగించొద్దు



- హైకోర్టుకు తెలిపిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ
- పియర్లు కుంగడానికి డిజైన్, నిర్మాణ నాణ్యత, నిర్వహణ, ఆపరేషన్‌లో లోపాలేనని కోర్టుకు అఫిడవిట్ దాఖలు

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీకి పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు దానిని తిరిగి ఆపరేట్ చేయరాదని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) హైకోర్టుకు తెలిపింది. మేడిగడ్డలో పియర్లు కుంగిపోవడానికి ప్రణాళిక, డిజైన్, నిర్మాణ నాణ్యత, నిర్వహణ, ఆపరేషన్‌లోని లోపాలు కారణమయ్యాయని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. మేడిగడ్డతో నిర్మాణపరంగా సారూప్యత ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా అత్యవసరంగా పరిశీలించాలని 2023లో ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫారసు చేసిందని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు మాజీ సీడబ్ల్యూసీ చైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో 2024లో మరో కమిటీని ఏర్పాటు చేసి మూడు బ్యారేజీలపై సమగ్ర

తరువాయి 12లో



## నకిలీ డాక్టర్ల గుట్టురట్టు

- అర్హత లేకుండా చలామణి అవుతున్న ఆరుగురు అరెస్ట్
- నకిలీ ఎంబిబిఎస్, బిహెచ్‌ఎంఎస్ సర్టిఫికెట్లు, మందులు, వైద్య పరికరాలు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజలకు వైద్యం చేస్తున్న ఆరుగురు నకిలీ వైద్యులను హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (సికింద్రాబాద్ జోన్) పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి నకిలీ ఎంబిబిఎస్, బిహెచ్‌ఎంఎస్ సర్టిఫికెట్లు, ఇంజెక్షన్లు, మందులు, వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. డిసిపి వైభవ్ గైక్వాడ రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారంతో రాంగోపాల్‌పేట్, చిలకలగూడ, ఓయూ సిటీ, దోమల్‌గూడ పోలీసులతో కలిసి పలు క్లినిక్‌లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు

తరువాయి 12లో

# కృష్ణా జలాలపై సమర్థ వాదన

పలుమార్లు వాయిదా పడిన తరువాత ఎట్టకేలకు కృష్ణా నదీ జలాల నిర్వహణ బోర్డు(కెఆర్ఎంబి) సమావేశం సోమవారం నాడు హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో కెఆర్ఎంబి సభ్య కార్యదర్శి ఎదుట తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇరిగేషన్ ఇంజినీర్ ఇన్ ఛీఫ్‌ఇలు తమ తమ వాదనలు వినిపించారు. ఎల్ నినో ప్రభావంతో కరువు ఛాయలు అలుముకుంటున్న వేళ ప్రతి చుక్క నీరు ప్రధానమే అయింది. గత మాసం చివర్లో ఎగువ రాష్ట్రాలలో కురిసిన వర్షాలు అడుగంటుకుపోయిన జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు ఊరటనిచ్చాయి. కర్నాటకలో ఆలమట్టి, నారాయణపూర్ నిండుకుండలా మారి, కొద్ది కొద్దిగా వదలడంతో తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాలు పరుగులు తీసాయి. అయినప్పటికీ, ఉభయ రాష్ట్రాలకు ప్రధాన నీటి వనరులైన శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌లు పూర్థి స్థాయి సామర్థ్యాన్ని సంతరించుకోలేదు. ప్రస్తుతం నిలువ ఉన్న నీటిని వచ్చే ఏడాది ఖరీఫ్ వరకు తాగు నీటి అవసరాలకు వాడుకోవాలని సమావేశంలో సూత్రప్రాయంగా ఏకీభావానికి వచ్చారు. అయితే, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేయకపోతుండటంతో ఈ సమస్యంతా వచ్చింది. ఫలితంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలోని 6.30 లక్షలకు పైగా ఎకరాల స్థిర ఆయకట్టు ఖరీఫ్‌లో నీటి కటకటను ఎదుర్కొంటున్నది. చాలా కాలం తరువాత కాలువ కింద రైతాంగం నీరు రాక బోర్లపై సాగుకు ప్రయత్నాలు చేసుకుంటోంది. ఇప్పటికే పలు చోట్ల నీటిని విడుదల చేయాలంటూ రైతాంగం ఆందోళనకు కూడా దిగింది.

శ్రీశైలం ప్రాజెక్టుల ఉన్న నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సాగు అవసరాలకు సైతం రోజుకు 8వేల క్యూసెక్కుల చొప్పున తరలించికుపోతున్న విషయం ఆ రాష్ట్ర వాదనలలోనే అర్థమవుతున్నది. ఎందుకంటే, ఆ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన మొత్తం కృష్ణా జలాల వాటా నుంచి మినహాయించుకోవాలని సమావేశంలో వాదించినట్లు వార్తలు వచ్చాయి. అంతే కాకుండా 2015లో నీరు లభ్యత ఉన్న దశలో తాత్కాలికంగా అంగీకరించిన 66 : 33 నిష్పత్తిన తమకు నీరు ఇవ్వాలని పట్టుపట్టినట్లు తెలిసింది. దీనిని తెలంగాణ తరఫున ఇరిగేషన్ ఇంజినీర్‌ల బృందం సమర్థవంతంగా త్రోసి పుచ్చింది. ఉభయ రాష్ట్రాలలో కృష్ణా నది పరీవాహక ప్రాంతం ఆధారంగా తమకు 70 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 30 శాతం నీరు రావాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. శ్రీశైలం కుడి కాలువ నుంచి చెన్నై తాగునీటి అవసరాలకు 15 , ఎపికి 17 టిఎంసిల అంగీకృత వాటాను మాత్రమే తీసుకెళ్ళాలని పేర్కొంది. అయినప్పటికీ, కరువు ఛాయలను దృష్టిలో పెట్టుకొని అందుబాటులో ఉన్న నీటిని చెరి సగం పంచుకునే విశాల దృక్పథంతో సమంజస ప్రతిపాదన చేసింది. ఇందుకు ప్రాతిపదికగా శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల పరిధిలో తెలంగాణలో 2 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో 76 లక్షల మంది ఉన్నట్లుగా ఉటంకించింది. కెఆర్ఎంబి సమావేశంలో అంగీకారం కుదరక అక్టోబర్ 4కు భేటీ వాయిదా పడింది.

నిజానికి ఉభయ రాష్ట్రాల మధ్య ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో మొదటి నుంచి ఎక్కువగా లబ్ధి పొందుతున్నది ఆంధ్రప్రదేశేనని లెక్కలు చెబుతున్నవి. ఈ రెండు ప్రాజెక్టులలో ఎడమ కాలువ ద్వారా తెలంగాణకు, కుడి కాలువ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీటి సరఫరా జరుగుతున్నది. శ్రీశైలం కుడి కాలువ ఎప్పుడో పూర్తి అయి, కృష్ణా నది బేసిన్‌లో లేని పెన్నా బేసిన్‌లోని ఉమ్మడి నెల్లూరు , అలాగే చిత్తూరు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాలకు బాహాటంగా నీటి తరలింపు జరుగుతున్నది. మరోవైపు శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం ఇప్పటికీ పూర్తి కాలేదు. అలాగే కృష్ణా నది ప్రవహించే ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు వరప్రదాయినీ అయినటువంటి పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతులు ఆలస్యం అవుతున్నవి. ఒక దశలో పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటిని జూరాల నుంచి తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వ్యాఖ్యానించడం.. ప్రాజెక్టుకు ఆటంకాలు, కేంద్రం అనుమతుల జాప్యానికి అడ్డం పడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తీవ్ర అభ్యంతరాల కారణంగా అనుమతులు ముందుకు పడడం లేదు.ఆంధ్రప్రదేశ్ నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఫ్లోరైడ్ పీడిత నల్లగొండకు, వలసల పాలమూరుకు దశాబ్దాల అన్యాయం కొనసాగుతోంది. ఎస్ఎల్‌బిసి పూర్తయ్యేలోగా, నాగార్జున సాగర్ రిజర్వాయర్ వెనుక నుంచి ఎఎంఆర్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా నీరు తోడుకునేందుకు వీలు కల్పించబడింది. అందులో నుంచే హైదరాబాద్ మహానగరానికి సైతం కృష్ణా జలాలు వస్తాయి. ఇప్పుడు శ్రీశైలం నుంచి దిగువకు నీరు వదలకపోతే, హైదరాబాద్ వాసులు నీటి కటకట ఎదుర్కొనే ప్రమాదం నెలకొంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని, హ్రస్వదృష్టితో కాకుండా సుహృద్భావంతో ఉభయ రాష్ట్రాల మధ్య కరువు కాలంలో వచ్చే సమావేశంలోనైనా నీటి పంపిణీ ఖరారవ్వాలి. అలాగే భవిష్యత్తులో కూడా ఇబ్బందులు రాకుండా కృష్ణా జలాల్లో నీటి వాటాపై సామరస్య పరిష్కారం ఎంత త్వరగా చేసుకోగలిగితే ఉభయులకూ అంతమంచిది.



## 2029లో జమిలీ ఎన్నికలు రావు

2029లో జమిలీ ఎన్నికలు సాధ్యమవుతాయని జెపిసి ఛైర్మన్ చేసినట్లు వచ్చిన వార్తను నేను చదివాను. దురదృష్టవశాత్తు, ఆయన అభిప్రాయం తప్పే కాదు, బిల్లులో రాసిన దానికి విరుద్ధంగా ఉంది. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందినా (అది జరగడం దాదాపు అసంభవం), 'అపాయింటెడ్ డే' కేవలం 'సార్వత్రిక ఎన్నికల తర్వాత' మాత్రమే అని బిల్లులో ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలు 2029లో జరుగుతాయి. కాబట్టి 2029లో ఏకకాల ఎన్నికలు సాధ్యం కావు.

– పి.చిదంబరం, కేంద్ర మాజీ హోం మంత్రి



# దేశంలో తీరు మారుతున్న పేదరికం

ఒకప్పుడు తినడానికి తిండి లేని వాడు, కట్టుకోవడానికి బట్ట లేని వాడు, తలదాచుకోవడానికి గూడు లేని వాడిని పేదలు అని, అటువంటి వారిని పేదరికంలో ఉన్నారు అని సంబోధించే వారు. అందుకే కూడు, గుడ్డ, నీడ అన్న పదాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్న నేటి పరిస్థితులలో పేదరికం తీరు మారింది. ఇంకా రోటీ, కపడ, మకాన్ అన్న మాటలు బాధిస్తాయి తప్ప ఊరటనివ్వకపోవచ్చు. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితులు, పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం తర్వాత ప్రజలకు దక్కాల్సినవి దక్కకపోవడం, అందాల్సినవి అందకపోవడం ప్రభుత్వపరంగా జరగాల్సినవి జరగకపోవడం, దక్కాల్సి న హక్కులు దక్కకపోవడం, 80 సంవత్సరాల స్వతంత్ర భారతంలో కష్టపడి అన్ని అర్హతలు సంపాదించుకున్న తర్వాత అందుకు తగిన ప్రతిఫలం దక్కకపోవడం కూడా పేదరికమే. వీరికి కూడు, గుడ్డ, నీడ అందుబాటులో ఉన్నా వీరు అనుభవిస్తున్నది పేదరికమే. చదువుకు తగిన ఉపాధి దొరకకపోవడం, ఇతరులపై ఆధారపడటం, తన కోసం రూపాయి ఖర్చు చేయలేకపోవడం ప్రస్తుత పరిస్థితులలో పేదరికం కాక మరేమిటి. దశాబ్దాల క్రితం మనిషికి తిండి, గుడ్డ, ఉండటానికి ఓ నివాసం మాత్రమే అవసరం. ఈ మూడింటిని తీర్చేందుకు పాలకుల వైపు నుంచి ప్రయత్నం జరిగింది. ఆ మూడింటి కోసమే ప్రజాపోరాటాలు నడిచాయి. ప్రజా ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. ఇప్పుడు 21వ శతాబ్దంలో ఇంకా ఆ మూడు ప్రజలకు కనీస అవసరాలు కాదన్న వాస్తవాన్ని పాలకులు గుర్తించాలి. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ప్రజలకు అవసరమైంది ముఖ్యంగా నిత్యావసరమైంది అందుబాటులో లేకపోవడం పేదరికమే. ఉదాహరణకు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకు లు అందించే వారు. వాటిలో కొన్నింటిని అందించడం మానేశారు. ఎందుకు, నిలుపుదల చేసిన వస్తువులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్న భావనతో, మరి లేని వాటిని అందించడం లేదు ఎందు కు అన్న ప్రశ్న వినపడుతుంది. హామీ ఇచ్చి మరి చౌక దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నారు. ఇది ప్రజల డిమాండ్ కాదు కానీ అధికారంలోకి రావడానికో, ప్రజలకు మరిన్ని మెరుగైన సేవల ను అందించాలనో ఈ పథకాన్ని తీసుకు వచ్చారు. మిగిలిన వాటి పట్ల ఎందుకు ఈ వైఖరి కనబర్చడం లేదన్నది పాలకులు సమాధా నం చెప్పాల్సి ఉంది. దారిద్ర్యరేఖకు దిగువన బతుకుతున్న వారి సంఖ్య తగ్గింది కాబట్టి పేదరికం తగ్గింది అన్న ప్రచారంలో అర్థం లేదు. ఇప్పటికీ కనీస అవసరాలను తీర్చుకోలేని ప్రజల సంఖ్య గణనీయంగా ఉంది. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయంటున్న పాలకు లు ఏ కుటుంబాలు తమ కనీస అవసరాలకు తగినవిధంగా సంపాదించుకుంటున్నారు, ఆ అవకాశాలు సమాజంలో ఉన్నాయా అన్న దానిపైన విశ్లేషణకు సిద్ధం కావాలి. ఒకప్పుడు అక్షరజ్ఞానానికి నోచుకోని వారి శాతం గణనీయంగా ఉండేది. ఇప్పుడు ఆ శాతం తగ్గింది కానీ వారికి ఇప్పటికీ చదువుకోవడానికి సంపూర్ణ అవకాశా లు ఉన్నాయా, మెరుగైన విద్యను అందిస్తున్నారా అంటే లేదనే సమాధానమే వస్తుంది. మెరుగైన విద్యను అభ్యసించకపోవడం కూడా పేదరికమే కదా. వ్యవసాయం ప్రధాన వృత్తిగా కలిగిన వారికి నేడు దారిద్ర్యం లేకపోవచ్చు. తిండి, బట్ట, ఇంటికి ఇబ్బంది లేకపోవచ్చు. కానీ పది ఎకరాలు సాగు చేస్తున్న రైతు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఫీజులు చెల్లించే స్థితిలో ఉన్నాడా, సరైన వైద్య పొందగలుగుతున్నాడా, కనీస అవసరాలను తీర్చుకోగలుగుతున్నా డా అంటే ఉన్న భూమిలో ఎంతో కొంత అమ్మితేనే తన అవసరం తీరుతుంది. ఆస్తిని అమ్మి కనీస అవసరాలు తీర్చుకోవడం పేదరికమే. పెరిగిన ధరల నేపథ్యంలో నెల జీతగాళ్లు అరకొర బతుకులనే సాగిస్తున్నారు. ఒక్క రోజు చేయి విధిలిస్తే నెలంతా సర్దుకుపోయి బతకాల్సిన పరిస్థితి. ఒక నెలలో పిల్లల ఫీజు చెల్లిస్తే మిగిలిన అవసరాలను వాయిదా వేసుకోవడమే. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికు ల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. అసంఘటిత రంగ కార్మికులు ఆకలితో చచ్చిపోక పోవచ్చు కానీ నిత్యం చచ్చి బతుకుతున్నారు. ఏ అవసరం తీర్చుకోలేని ప్రత్యేక పరిస్థితి. మానవ జీవన విధానంలో అనేక మార్పులు వచ్చాయి. ఆ మార్పులతో పాటు కనీస అవసరాల జాబితా మారింది. కడుపు నింపుకోవడానికి చూడు.. కలర్ టివి వంక, కాదు అని కొందరు చేసే తర్కం ఇప్పుడు పేద, మధ్యతరగతి ప్రజలు అంగీకరించే స్థితిలో లేరు. కలర్ టివి కాకపోయినా ఏదో ఒక టివి మాకు కావాలిగా అన్న ప్రశ్న సహేతుకమే అనిపిస్తుంది. మిగిలిన సగటు నిత్యావసరాలైన వైద్యం, రవాణా కనీస సౌకర్యాల విషయంలో అవి పొందలేని పేదలు అవి పొందాలన్న డిమాండ్ సమ్మతమైనదే. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు కండ్ల ముందే కొందరు కోటీశ్వరులుగా మారిపోవడం, అష్టైశ్వర్యాలు అనుభవించడం మరో ఆలోచనకు దారితీస్తుంది. ఎల్లకాలం రోటీ, కపడా, మకాన్ అంటూ పేదరికాన్ని వాటి చుట్టూనే తిప్పి పాలన సాగించడం సరైంది కాదు. ఈ ఆర్థిక అంతరాలకు కొందరు అష్టైశ్వరాలు అనుభవిస్తుండగా తాము కనీస అవసరాలను తీర్చుకోలేని శ్రమజీవులుగా, వేతన జీవులుగా, ఉపాధి పొందలేని నిరుద్యోగులుగా జీవితాలు గడిపేయాలన్న ప్రశ్న నుంచి ఆవేదన, ఆవేదనలో నుంచి ఆవేశం పుట్టకముందే పాలకుల ఆలోచన మారాలి. మారిన కనీస అవసరాలను తీర్చగలిగే పాలన వైపు దృష్టిసారించాలి.

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# కులం కాదు... మనిషే కేంద్రంగా సమానత్వం, సామాజిక న్యాయం

**మాలోతు సాగర్**

కుల వ్యవస్థను కేవలం కుల వివక్షను వ్యతిరేకించడం ద్వారా మాత్రమే నిర్మూలించలేం; కులానికి పునాదిగా ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను కూడా అంతం చేయాలి. భారతదేశ సమాజాన్ని శతాబ్దాలుగా వెంటాడుతున్న అత్యంత తీవ్రమైన సామాజిక సమస్యల్లో కుల వ్యవస్థ ఒకటి. ఆధునిక భారతదేశం రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, శాస్త్రసాంకేతిక అభివృద్ధి, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వంటి అనేక మార్పులను చూసినా కులం మాత్రం తన రూపాలను మార్చుకుంటూ కొనసాగుతోంది. గ్రామాల్లో భూమి, నీరు, దేవాలయాలు, సామాజిక సంబంధాలు, వివాహాలు వంటి అంశాల్లో కుల ప్రభావం కనిపిస్తుంటే, పట్టణాల్లో ఉద్యోగాలు, విద్య, నివాస ప్రాంతాలు, వివాహ మార్కెట్, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో కూడా కులం తన ప్రభావాన్ని కొనసాగిస్తోంది. కుల వ్యవస్థ కేవలం ఒక సామాజిక గుర్తింపు కాదు. అది శ్రమ విభజనను పుట్టుక ఆధారంగా శాశ్వతం చేసిన వ్యవస్థ. ఒక మనిషి ఏ కుటుంబంలో పుట్టాడో దాని ఆధారంగా అతని సామాజిక స్థానం, వృత్తి, గౌరవం, అవకాశాలు నిర్ణయించబడే పరిస్థితి ఏర్పడింది. అందుకే కుల నిర్మూలన అనేది కేవలం ఒక కులాన్ని మరొక కులం పట్ల సహనంతో ఉండమని చెప్పే విషయం కాదు. పుట్టుక ఆధారంగా మనుషులను ఉన్నత–నీచస్థాయిలుగా విభజించే మొత్తం సామాజిక వ్యవస్థను ప్రశ్నించడం. కుల వ్యవస్థ చారిత్రక మూలాలు భారతీయ సమాజంలో కుల వ్యవస్థ యొక్క అత్యంత ప్రమాదకరమైన లక్షణం పుట్టుక ఆధారంగా సామాజిక స్థానం నిర్ణయించడం. ఒక వ్యక్తి ప్రతిభ, సామర్థ్యం, శ్రమతో తన స్థానం మార్చుకునే అవకాశాన్ని ఈ వ్యవస్థ పరిమితం చేసింది. ఒక వర్గం శ్రమను పవిత్రమైనదిగా, మరో వర్గం శ్రమను అపవిత్రమైనదిగా ప్రకటించడం ద్వారా శ్రమజీవుల మధ్య అసమానతలను పెంచింది. ప్రత్యేకించి మానవ మలమూత్రాలను చేతితో తొలగించడం, చనిపోయిన జంతువులను తొలగించడం, తోలు పనులు, కొన్ని రకాల పారిశుధ్య పనులు వంటి వృత్తులను నిర్దిష్ట కులాలకు కట్టిపెట్టడం కుల వ్యవస్థలోని అమానవీయతకు ఉదాహరణ. అంటరానితనం – కుల వ్యవస్థలో అత్యంత క్రూరమైన రూపం. ఒక మనిషి మరొక మనిషిని తాకితే అపవిత్రత కలుగుతుందని భావించడం శాస్త్రీయతకు, మానవత్వానికి విరుద్ధం. అంటరానితనం ఒక వ్యక్తిపై జరిగే అవమానం మాత్రమే కాదు; అది ఒక సమాజాన్ని సామాజికంగా వెలివేసే వ్యవస్థ. నీటి వనరులకు ప్రవేశం, దేవాలయ ప్రవేశం, విద్య, నివాసం, సామాజిక సంబంధాలు వంటి ప్రాథమిక హక్కుల నుంచి ప్రజలను దూరం చేసిన చరిత్ర భారతదేశంలో ఉంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగం అంటరానితనాన్ని చట్టవిరుద్ధం చేసింది. అయినప్పటికీ సామాజిక ఆచారాలు, కుల ఆధిపత్యం, ఆర్థికంగా ఆధారపడటం వంటి కారణాలతో దాని అవశేషాలు ఇంకా పూర్తిగా అంతరించలేదు. కుల వ్యవస్థను శాస్త్రీయంగా, రాజకీయంగా అత్యంత తీవ్రంగా ప్రశ్నించిన భారతీయ మేధావుల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అగ్రగణ్యుడు. అంబేద్కర్ దృష్టిలో కులం అనేది కేవలం ఆర్థిక అసమానత కాదు. అది మనుషుల మధ్య సామాజిక విభజనను శాశ్వతం చేసే వ్యవస్థ. అందుకే రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సరిపోదని, సామాజిక ప్రజాస్వామ్యం కూడా అవసరమని ఆయన స్పష్టం చేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రజాస్వామ్య సమాజానికి పునాదులు కావాలని అంబేద్కర్ భావించారు. కుల నిర్మూలనకు విద్య, సంఘటితం కావడం, హక్కుల కోసం పోరాడడం ముఖ్యమని ఆయన చూపించారు. కులాన్ని కేవలం వ్యక్తిగత ద్వేషంతో నిర్మూలించలేం; దాని సామాజిక పునాదులను మార్చాల్సి ఉంటుంది. చారిత్రకంగా భూమి యాజమాన్యం, వృత్తులు, వనరుల ప్రాప్యత, విద్య, అధికార వ్యవస్థల్లో అవకాశాలు సమానంగా పంపిణీ కాలేదు. భూమిలేని కూలీలు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, పట్టణ పేదలు, గుడిసెవాసులు వంటి వర్గాల్లో అణగారిన కులాల ప్రజల ప్రాతినిధ్యం ఎక్కువగా కనిపించడం యాదృచ్ఛికం కాదు. అందువల్ల కుల నిర్మూలనకు ఆర్థిక ప్రజాస్వామ్యం కూడా అవసరం.

కులం – వర్గం: రెండింటి సంబంధాన్ని అర్థం చేసుకోవాలి. భారతదేశంలో కులం మరియు వర్గం ఒకే విషయం కాదు. అయితే అవి పరస్పరం ప్రభావితం చేసుకుంటాయి. కుల ఆధిపత్యం ఆర్థిక అవకాశాలపై ప్రభావం చూపుతుంది. అదే సమయంలో ఆర్థిక శక్తి కుల ఆధిపత్యాన్ని బలపరచగలదు. అందుకే కుల నిర్మూలన కోసం పోరాడే ఉద్యమం కుల వివక్షను మాత్రమే కాకుండా ఆర్థిక దోపిడీని కూడా ప్రశ్నించాలి. అదే సమయంలో వర్గపోరాటం పేరుతో కుల సమస్యను పక్కన పెట్టడం కూడా తప్పు. కుల వివక్షకు వ్యతిరేక పోరాటం, ఆర్థిక దోపిడీకి వ్యతిరేక పోరాటం పరస్పర విరుద్ధమైనవి కావు; భారతీయ వాస్తవికతలో అవి పరస్పరం అనుసంధానమైన పోరాటాలు. విద్య సామాజిక మార్పుకు అత్యంత శక్తివంతమైన సాధనం. కానీ విద్య అందరికీ సమానంగా అందుబాటులో లేకపోతే అది అసమానతలను తగ్గించకుండా పెంచుతుంది. పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య, ఉచిత ఉన్నత విద్య, వసతి, స్కాలర్‌షిప్‌లు, డిజిటల్ వనరులు అందుబాటులో ఉండాలి. కుల వివక్షకు వ్యతిరేకంగా విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

**రిజర్వేషన్లు ఎందుకు అవసరం?**

రిజర్వేషన్లు కుల వ్యవస్థను శాశ్వతం చేయడానికి కాదు; చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలను కల్పించడానికి రూపొందించబడిన సామాజిక న్యాయ విధానం. శతాబ్దాలుగా విద్య, ఉద్యోగాలు, అధికార వ్యవస్థల్లో అవకాశాల నుంచి దూరంగా ఉంచబడిన సమాజాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు అవసరం. అందరికీ ఒకే పోటీ అనే వాదన వినడానికి సమానత్వంగా కనిపించినా, ప్రారంభ స్థితులు అసమానంగా ఉన్నప్పుడు అది వాస్తవ సమానత్వాన్ని ఇవ్వదు. పరుగుపందెంలో ఒకరిని ప్రారంభ రేఖ వద్ద నిలబెట్టి, మరొకరిని చాలా వెనుక నిలబెట్టి, చివరికి ఇద్దరికీ ఒకే నియమాలు అని చెప్పడం నిజమైన సమానత్వం కాదు. వివాహ సంబంధాలను కులం నియంత్రించడం ద్వారా కులం తనను తాను తరతరాలకు పునరుత్పత్తి చేసుకుంటుంది. అందువల్ల అంతర్‌కుల వివాహాలను ప్రోత్సహించడం సామాజిక సమానత్వానికి ఒక ముఖ్యమైన అడుగు. ప్రేమను, వివాహాన్ని కుల గౌరవం పేరుతో నియంత్రించే ధోరణిని సమాజం తిరస్కరించాలి. కుల రాజకీయాలు – ఓటు బ్యాంకుల రాజకీయాలకు ముగింపు అవసరం ప్రజాస్వామ్యంలో కుల గుర్తింపులు రాజకీయాల్లో ప్రభావం చూపడం వాస్తవం. కానీ రాజకీయ పార్టీలు ప్రజల సామాజిక సమస్యలను పరిష్కరించకుండా కేవలం కుల సమీకరణాలను ఎన్నికల లాభాల కోసం ఉపయోగించడం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. కుల ఆధారిత ద్వేషం, ఒక కులాన్ని మరొక కులానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టడం, ఎన్నికల సమయంలో కుల భావోద్వేగాలను వినియోగించడం సమాజాన్ని మరింత విభజిస్తుంది. రాజకీయాల కేంద్రబిందువు ఉపాధి, విద్య, భూమి, గృహం, ఆరోగ్యం, సామాజిక భద్రత, సమాన హక్కులు కావాలి.

**కుల వ్యవస్థలో మహిళలపై నియంత్రణ**

కుల శుద్ధత పేరుతో మహిళల వివాహం, ప్రేమ, శరీరం, దుస్తులు, సంచారం వంటి విషయాలను నియంత్రించే ధోరణి అనేక ప్రాంతాల్లో కనిపిస్తుంది. కుల నిర్మూలన అంటే మహిళా విముక్తితో కూడా అనుసంధానమైన పోరాటం. అందువల్ల మహిళలకు విద్య, ఉపాధి, ఆస్తి హక్కు, రాజకీయ ప్రాతినిధ్యం, స్వేచ్ఛాయుత వివాహ హక్కు, భద్రత కల్పించాలి. కుల నిర్మూలనకు చట్టం మాత్రమే సరిపోదు. రాజ్యాంగం సమానత్వానికి హామీ ఇచ్చింది. అంటరానితనాన్ని నిషేధించింది. వివక్షకు వ్యతిరేకంగా చట్టపరమైన రక్షణలు ఉన్నాయి. అయితే చట్టం ఉండటం ఒక విషయం; అది సమర్థంగా అమలవడం మరో విషయం. కుల ఆధారిత దాడులు, సామాజిక బహిష్కరణ, వివక్ష, హింస వంటి ఘటనలపై వేగవంతమైన న్యాయం అందాలి. బాధితులకు న్యాయ సహాయం, పునరావాసం, రక్షణ కల్పించాలి. అదే సమయంలో పోలీసు, న్యాయవ్యవస్థ, విద్యావ్యవస్థ, ప్రభుత్వ యంత్రాంగంలో సామాజిక న్యాయంపై అవగాహన పెంచాలి. గ్రామీణ భారతదేశంలో కుల ఆధిపత్యాన్ని బలపరిచే ప్రధాన అంశాల్లో భూమి యాజమాన్యం ఒకటి. భూమిలేని కుటుంబం స్థానిక ఆధిపత్య వర్గాలపై ఆర్థికంగా ఆధారపడే పరిస్థితి ఉంటే, చట్టపరమైన సమానత్వం ఉన్నప్పటికీ సామాజిక సమానత్వం సాధించడం కష్టం. అందువల్ల భూసంస్కరణలు, భూమిలేని పేదలకు భూమి, సాగునీరు, ఉత్పత్తి వనరులు, రైతు కూలీలకు హక్కులు, కనీస వేతనాల అమలు వంటి అంశాలు కుల నిర్మూలన పోరాటంతో అనుసంధానించాలి. కులం కేవలం గ్రామాల్లోనే ఉందని భావించడం తప్పు. పట్టణాల్లో ఉద్యోగ నియామకాలు, అద్దె ఇళ్లు, వివాహ సంబంధాలు, సామాజిక నెట్‌వర్క్‌లు, వృత్తి అవకాశాలు వంటి రంగాల్లో కూడా కుల ప్రభావం కనిపిస్తుంది. ఆధునిక సాంకేతికత వచ్చినంత మాత్రాన సామాజిక సంబంధాలు స్వయంగా సమానంగా మారవు. సామాజిక నిర్మాణాన్ని మార్చే చైతన్యపూర్వక చర్యలు అవసరం.

**కుల నిర్మూలన కోసం ఏం చేయాలి?**

కుల వ్యవస్థను నిజంగా నిర్మూలించాలంటే కొన్ని స్పష్టమైన చర్యలు అవసరం: కుల వివక్షకు వ్యతిరేకంగా చట్టాలను కఠినంగా అమలు చేయాలి. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందరికీ అందించాలి. రిజర్వేషన్లను సమర్థంగా అమలు చేయాలి. భూమిలేని పేదలకు భూమి, గృహం, ఉపాధి కల్పించాలి. కులాంతర వివాహాలను ప్రోత్సహించి, వాటికి ప్రభుత్వ రక్షణ కల్పించాలి. కుల ఆధారిత హింసకు వేగవంతమైన న్యాయవ్యవస్థ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో వివక్షను నిరోధించే వ్యవస్థలను బలోపేతం చేయాలి. మానవ మలమూత్రాల చేతిపనిని పూర్తిగా నిర్మూలించాలి. మహిళలపై కుల–పితృస్వామ్య నియంత్రణను వ్యతిరేకించాలి. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ, మానవతా, సమానత్వ విలువలను బోధించాలి. కుల ఆధారిత ద్వేష రాజకీయాలను ప్రజాస్వామ్య శక్తులు తిరస్కరించాలి. కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, పేదలు ఐక్యంగా సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలి. కుల ఆధారంగా మనుషులను విభజించే వ్యవస్థనే అంతం చేయడ ం.

భారతదేశం రాజకీయంగా స్వతంత్ర దేశంగా మారి దశాబ్దాలు గడిచాయి. కానీ సామాజికంగా సంపూర్ణ విముక్తి ఇంకా సాధించాల్సి ఉంది. కుల వ్యవస్థను కేవలం చట్టంతో నిర్మూలించలేం. కేవలం నినాదాలతో కూడా నిర్మూలించలేం. ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలి. సామాజిక సంబంధాల్లో మార్పు రావాలి. విద్య, భూమి, ఉపాధి, ఆస్తి, రాజకీయ అధికారంలో సమానత్వం రావాలి. కుల వివక్షను ఎదుర్కొంటున్న ప్రజల పోరాటాలకు ప్రజాస్వామ్య, ప్రగతిశీల, కార్మిక, రైతు, విద్యార్థి, మహిళా ఉద్యమాలు అండగా నిలవాలి. అంబేద్కర్ ప్రతిపాదించిన సామాజిక ప్రజాస్వామ్యం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం విలువలను ప్రజా ఉద్యమాలతో అనుసంధానించాలి. మార్క్సిస్టు దృక్పథంలో చూస్తే, కుల నిర్మూలన మరియు ఆర్థిక దోపిడీ నిర్మూలన పరస్పర సంబంధం కలిగిన లక్ష్యాలు. కుల ఆధిపత్యాన్ని ప్రశ్నించకుండా నిజమైన ప్రజాస్వామ్య సమాజం నిర్మించలేం. అలాగే ఆర్థిక అసమానతలను తొలగించకుండా కుల వివక్షకు సంబంధించిన అనేక భౌతిక పునాదులను బలహీనపరచలేం. అందుకే మన లక్ష్యం స్పష్టంగా ఉండాలి: కులం లేని సమాజం, వివక్ష లేని సమాజం, దోపిడీ లేని సమాజం, ప్రతి మనిషికి సమాన గౌరవం, సమాన అవకాశాలు కలిగిన సమాజం. కుల నిర్మూలన కేవలం ఒక సామాజిక సంస్కరణ కాదు — అది భారత ప్రజాస్వామ్యాన్ని సంపూర్ణం చేసే చారిత్రక అవసరం. కులం కాదు మనిషే ముఖ్యం — పుట్టుక కాదు, మానవత్వమే మనిషి విలువ.

**సామాజిక వేత్త,** 7013805411

# 'బద్లావ్ జరూరీ హై' ర్యాలీకి విరాళాల కోసం డి.రాజా విజ్ఞప్తి

**ఆర్ఎస్ఎస్ – బిజెపి వినాశకర పరిపాలన కింద దేశం అనేక సంక్షోభాలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, భారత కమ్యూనిస్టు పార్టీ 2026 ఆగస్టు నుంచి 15వ తేదీవరకు దేశవ్యాప్త రాజకీయ ప్రచారాందోళనను విజయవంతంగా నిర్వహించింది. పాదయాత్రలు దేశం నాలుగు చెరుగులా జరిగాయి. ఈ ఆందోళన కార్యక్రమం 2026 సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో పెద్ద ఎత్తున ''బద్లావ్ జరూరీ హై'' ర్యాలీతో పరిసమాప్తమవుతుంది.**

*స్నేహితులారా, కామ్రేడ్స్, సహోదర పౌరులారా!*

భారతదేశం నాలుగు రోడ్ల కూడలిలో ఉంది.ఆదాయాలు పడిపోతుండగా ధరలు పెరుగుతున్నాయి. యువత ఉద్యోగాల కోసం పోరాటం చేస్తోంది. విద్యార్థులు ప్రశ్నాపత్రాల లీకేజీ సమస్య ఎదుర్కొంటున్నారు. విద్యావ్యవస్థ సంక్షోభంలో ఉంది. రైతులు తమ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్టబద్ధ హామీ కోసం ఆందోళన కొనసాగిస్తున్నారు. కార్మికులు భద్రమైన ఉద్యోగం, హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వ విద్య, ప్రజారోగ్యం బలహీనపడుతున్నాయి., అసమానతలు పెరుగుతున్నాయి.

ఈ సంక్షోభాల వెనుక ఆర్ఎస్ఎస్ – బిజెపి రాజకీయాలున్నాయి. 12సంవత్సరాల మోదీ – షా పరిపాలన అదానీల వంటి బడా కార్పొరేట్‌లకు సేవచేసింది. సామాన్య ప్రజలు భారం భరిస్తున్నారు. ప్రజల దృష్టిని వారి దైనందిన వాస్తవ సమస్యలైన ఉద్యోగాలు, ఉపాధులు, విద్య, ఆరోగ్యం, సామాజిక న్యాయం వంటి వాటి నుంచి మరల్చేందుకై హిందు–ముస్లిం, కుల విభజనలను ఉద్దేశపూర్వకంగా ఉపయోగిస్తున్నారు.

అయితే భయం బద్దలవుతున్నది

మోదీ–షా ప్రభుత్వాన్ని సవాలు చేయగలమని విద్యార్థుల ఉద్యమం చాటి చెప్పింది. ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం డిమాండ్ చేస్తూ ముందుకు వచ్చిన యువకులకు బారికేడ్లు, లాఠీలు, బాష్పవాయువు, అమానుషమైన అణచివేత ఎదురైనాయి. అయినా వారు వెనుకడుగు వేయలేదు. మోదీ పాలన అజేయం అనే భ్రమను వారు పంటాపంచలు చేశారు.

నేడు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మహిళలు, యువత, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, ఉద్యోగులు, చిరువ్యాపారులు, వృత్తిపరులు, పెన్షనర్లు తమ పోరాటాలను కలిసికట్టుగా చేస్తున్నారు.

అందువల్లనే భారత కమ్యూనిస్టు పార్టీ బద్లావ్ జరూరీ హై (మార్పు అవసరం) అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ, పని ప్రదేశానికి, విద్యాలయాల్లోకి, గ్రామాలు, బస్తీలలోకి తీసుకెళ్లింది. మార్పు కేవలం ఆకాంక్షపూరితం కాదు, అవసరం కూడా.

ఆ సందేశం ఢిల్లీ చేరకుండా చూడటానికి బిజెపి గట్టిగా ప్రయత్నం చేస్తోంది.

బద్లావ్ జరూరీ హై ర్యాలీకై ఢిల్లీ రావటానికి మన కేరళ, తమిళనాడు కామ్రేడ్స్ బుక్ చేసుకున్న ప్రత్యేక రైళ్లను – డబ్బు చెల్లించినప్పటికీ – నిరంకుశంగా రద్దు చేశారు. బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు అర్ధరాత్రి మన కామ్రేడ్స్ తలుపులు తట్టుతూ పత్రాలు అడుగుతున్నారు, వేధించటానికి ప్రయత్నిస్తూ వారి మనోధైర్యం దెబ్బతీసేందుకు చూస్తున్నారు.

ఎర్రజెండా నీడలో ప్రజలు సమీకృతం కావ టం బిజెపికి ఇష్టం లేదు కనుక మన ర్యాలీ సన్నాహాలకు వారు ఆటంకాలు కల్పిస్తున్నారు.

అయితే మన సంకల్పం చెక్కుచెదరనిది.

కమ్యూనిస్టులు ఎన్నడూ నియంతృత్వానికి భయపడలేదు. మేము తలవంచం.

సెప్టెంబర్ 1న మేము ఉద్యోగాలు, ఎంఎస్‌పి, కార్మిక హక్కులు, మహిళా రిజర్వేషన్, అందుబాటులో విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ (ఫెడరలిజం) డిమాండ్ చేస్తున్న గొంతుకలను కలగలిపి రాంలీలా మైదాన్‌కు తీసుకువస్తాం.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, చరిత్ర సృష్టికర్తలు వారేనని ఢిల్లీ ర్యాలీ చాటిచెబుతుంది.

సిపిఐ ఎల్లప్పుడూ సామాన్య ప్రజలకోసమే నిలబడింది. మాకు బడా కార్పొరేట్‌లు నిధులివ్వవు. ఎన్నికల బాండ్లను మేము సూత్రబద్ధంగా తిరస్కరించాం. కార్మికులు, రైతులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, పౌరులే మా బలం. న్యాయంలో, ప్రజాస్వామ్యంలో, మెరుగైన భారతదేశంలో విశ్వాసమున్నఆ సామాన్య ప్రజలే మాకు నిధులు సమకూర్చేది.

బద్లావ్ జరూరీ హై ప్రచారాందోళనకు తోడ్పాటు ఇవ్వాల్సిందిగా ఈ రోజున మేము మిమ్ములను కోరుతున్నాం.

ప్రతి ఒక చందా – అది పెద్దదైనా, చిన్నదైనా – మేము మరింతమంది ప్రజలను చేరుకోవటానికీ, ప్రచారాందోళనను బలోపేతం చేయటానికీ, నిర్భీతిగా ప్రజల గొంతు ఎత్తటానికీ మాకు సహాయపడుతుంది.

క్యుఆర్ కోడ్ స్కాన్ చేయండి, విరాళం పంపండి. మీ విరాళం చందాకన్నా ఎక్కువ. అది ఉద్యమానికి తోడ్పాటు, అది మార్పు కోసం అండ.

మిత్రులారా! వారు మన రైళ్లు ఆపటానికి ప్రయత్నించగలరు. వారు మన తలుపులు తట్టగలరు. వారు మనల్ని బెదిరించగలరు.

అయితే వారు ప్రజల గొంతును, బిజెపి పాలన నుంచి దేశానికి విముక్తి కలిగించటం ద్వారా మార్పు చెందుతున్న చరిత్రలో వారి పాత్రను ఆపలేరు.

బద్లావ్ జరూరీ హై!
మార్పు అవసరం !
మనం కలసికట్టుగా మార్పు తీసుకువద్దాం!!!

**డి.రాజా**
**సిపిఐ ప్రధాన కార్యదర్శి**

**(క్యూఆర్ కోడ్)**
**బ్యాంక్ ఖాతా వివరాలు**

Communist Party of India
Central Bank of India
Current A/c No.:
1033004545
IFSC : CBIN0280306
Branch : Press Area,
New Delhi

# మల్లారెడ్డికి అంతిమ వీడ్కోలు

**భౌతికకాయానికి నివాళులు అర్పించిన సిపిఐ, సిపిఐ(ఎం) నాయకులు, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అనునిత్యం రైతుల హక్కుల కోసం నినదించిన ఉద్యమ నేత, విరామమెరుగని అవిశ్రాంత రైతాంగ పోరాట యోధుడు సారంపల్లి మల్లారెడ్డి అన్ని వామపక్షాలు, ప్రజా సంఘాల నేతలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కొనియాడారు. హైదరాబాద్‌లోని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో మల్లారెడ్డి భౌతికకాయాన్ని వారు సందర్శించి ఘనంగా నివాళ్లు అర్పించారు. మల్లారెడ్డిని చివరి సారిగా చూసేందుకు వామపక్ష పార్టీల శ్రేణులు రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు భారీగా తరలి వచ్చి నివాళులు అర్పించారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ సీనియర్ నాయకులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధా న కార్యదర్శి పశ్య పద్మ, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకురాలు దేవభక్తుని సంధ్య, డి.జి.నరేంద్ర ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.అనిల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రెహమాన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీమాన్, సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు, సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, అబ్బాస్, నాగయ్య, చుక్క రాములు, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సిపిఐ(ఎం) వివిధ జిల్లాల కార్యదర్శులు, ప్రజాసంఘాల నేతలు మల్లారెడ్డి భౌతికకాయంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డితో తమకు ఉన్న ఉద్యమ అనుబంధాన్ని పలువురు నేతలు గుర్తు చేసుకున్నారు. ప్రజల సందర్శనార్థం మల్లారెడ్డి భౌతికకాయాన్ని పార్టీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు ఉంచారు. అనంతరం అక్కడి నుంచి ఆయన భౌతికకాయం అంతిమయాత్ర సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి వరకు జరిగింది. అక్కడ వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం మల్లారెడ్డి భౌతికకాయాన్ని గాంధీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ కు అప్పగించారు. శ్రామిక, రైతు వర్గాల హ క్కుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించడమే సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు, రైతు సంఘం అగ్రనేత మల్లారెడ్డికి నిజమైన నివాళి అని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మల్లారెడ్డి మరణం పార్టీకి, రాష్ట్ర రైతు ఉద్యమానికి తీరని లోటు అని పేర్కొన్నారు. మల్లారెడ్డి వయస్సులో పెద్దవారైనా, అందరితో తండ్రిలా ఆప్యాయంగా, స్నేహితుడిలా కలిసిమెలిసి మాట్లాడే స్వభావం కలిగిన వారన్నారు.

### కమ్యూనిస్టు దిగ్గజ నేత సారంపల్లి మల్లారెడ్డి : మహేశ్ కుమార్ గౌడ్

కమ్యూనిస్టు దిగ్గజ నేత సారంపల్లి మల్లారెడ్డి మరణం కేవలం కమ్యూనిస్టులకే కాదు, యావత్తు రైతు లోకానికి, తెలంగాణ ప్రజానికానికి తీరని నష్టంమని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మల్లారెడ్డి నిజాయితీగా, నిస్వార్థంగా, నిజమైన కమ్యూనిస్టువాదిగా దీర్ఘకాలం కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడమే కాకుండా, ప్రతిక్షణం, ప్రతి నిమిషం ఆయన గుండె రైతుల కోసం పరితపించేదని కొనియాడారు. మల్లా రెడ్డి లాంటి మహానుభావుల జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన అడుగుజాడల్లో నడవడం అత్యంత క్లిష్టం, కష్టమైనప్పటికీ కమ్యూనిస్టు, కాంగ్రెస్‌వాదులు ఆయన బాటలో నడిచే ప్రయత్నం చేద్దామని, అదే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. 88 ఏళ్ల వయసులో కూడా నిర్విరామంగా ప్రజల కోసమే జీవించి న మహోన్నత వ్యక్తి మల్లా రెడ్డి అని, ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల్లో ఇలాంటి అతికొద్ది మంది నాయకులలో ఆయన ఒకరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం, కాంగ్రెస్ పార్టీ తరుపున మల్లారెడ్డికి ఘనంగా నివాళ్లు అర్పిస్తున్నామని తెలిపారు.

# వన మహోత్సవంలో 86 శాతం లక్ష్యం పూర్తి

**పంచాయతీరాజ్ శాఖ సమీక్షలో మంత్రి సీతక్క**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు, ఉపాధి హామీలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 6.18కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.32 కోట్లకు పైగా (86 శాతం) మొక్కలు నాటినట్లు మంత్రి వెల్లడించారు. నాటిన ప్రతి మొక్క కూ రక్షణ కంచెలు ఏర్పాటు చేసి 100 శాతం మనుగడ సాధించేలా చూడాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఇప్ప, తునికి, అడవి మామిడి వంటి స్థానిక దేశీయ జాతుల మొ క్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామంలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో మంజూరైన 8,924 ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే గ్రౌండింగ్ చేయాలని, భూగర్భ జలాల రీచార్జ్ కోసం చెక్ డ్యామ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ నుంచి అందించే నూతన చేయూత పెన్షన్‌ల అర్హతపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరపాలని, పాఠశాల విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టుపనిలో మహిళా సంఘాలు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

### పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : మంత్రి కొండా సురేఖ



పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటలని, నాటిన ప్రతి మొక్కను రక్షించాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని, ప్రతి ఇంటా మొక్కలు నాటి పెంచడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. వరంగల్ పట్టణంలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా ఫారెస్ట్ అధికారి నిఖిత, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకా శ్‌లు పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి, వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వనమహోత్సవ కార్యక్రమం కొం త ఆలస్యమైందన్నారు. ఒక్క రోజులోనే 10 శాతం మొక్క లు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడానికి సరైన వృక్ష సంపద లేకపోవడం కూడా ఒక ప్రధాన కారణమన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో 25 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, ఇప్పటివరకు సుమారు 13 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్‌డిఒ సుమ, జెడ్‌పి సిఇఒ రామ్ రెడ్డి, తహసీల్దార్ ఇక్బాల్, వివిధ శాఖల అధికారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంసిఆర్ టిమ్స్‌లో త్వరలోనే సర్జరీలు ప్రారంభం

**మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన.. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం నిర్ణయం**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసిఆర్ టిమ్స్)ను అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ సేవలు, వైద్య పరిశోధనలకు నిలయంగా మారుస్తామని వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. డాక్టర్ ఎంసిఆర్ టిమ్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మొదటి సమావేశం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన టిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో మంగళవారం జరిగింది. ప్రస్తుతం ఆసుపత్రికి ప్రతిరోజూ సగటున 600 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. ఐసియులు, ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్ పరికరాల స్టెరిలైజేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, అది పూర్తికాగానే ఆసుపత్రిలో సర్జరీలను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని వెల్లడించారు. టిమ్స్‌లో సిబ్బంది నియామకానికి నిమ్స్ (నిమ్స్) సర్వీస్ రూల్స్‌ను, అలాగే సేవల రుసుముల్లో ఏకరూపత కోసం నిమ్స్ టారిఫ్‌లనే అమలు చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రోగుల సౌకర్యార్థం మల్టీ లెవల్ కార్ పార్కిం గ్, అదనపు టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణంతో పాటు, భవిష్యత్తులో ప్రారంభించబోయే పిజి వైద్య కళాశాల విద్యార్థుల కోసం హాస్టళ్ల నిర్మాణ ప్రతిపాదనలకు ఈసి పచ్చజెండా ఊపింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారి కార్యాలయము
(భూసేకరణ)
జోగులాంబ గద్వాల జిల్లా.

**ఫారం -VII**

**రూఢి ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)**

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము - 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25 (1) ననుసరించి)

**జిల్లా కలెక్టర్, జోగులాంబ గద్వాల ప్రొసీడింగ్ నెం. G/66/2026, G/66/2/2026** — **తేదీ: 31.7.2026**

**ప్రత్యేక ఉపకలెక్టర్ (భూ.సే) జే.ఎల్.ఐ.పి, లేఖ నెం. A1/212/2013, A1/88/2021** — **తేదీ: 27.7.2026**

**జిల్లా రాజపత్రం నెం38/2026,** — **తేదీ: 31.7.2006**

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జోగులాంబ గద్వాల జిల్లా 1) ఆయిజ మండలము మేడికొండ గ్రామము (ప్యాకేజీ నెం. 107), 2) గట్టు మండలము ఇందువాసి గ్రామముల ఇందువాసీ గ్రామముల (ప్యాకేజీ నెం.107) విస్తీర్ణము **ఎ.3.44 సెం.లు** ప్రజాప్రయోజనం నిమిత్తము అనగా జవహర్ (నెట్టెంపాడు) ఎత్తిపోతులు పథకము యొక్క D6/15R Canal, 2)TE-DY8 Main Canal నిర్మాణ నిమిత్తము, అవసరమై ఉన్నదని భావించనైనది.
కావున జోగులాంబ గద్వాల జిల్లా 1) ఆయిజ మండలము మేడికొండ గ్రామము, 2)గట్టు మండలము ఇందువాసి గ్రామముల విస్తీర్ణము **ఎ.3.44 సెం.లు** గల భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్ట్ నిర్మాణమునకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

**షెడ్యూలు**

**1) ఎ1/212/2013**
గ్రామము:మేడికొండ మండలము:ఆయిజ జిల్లా:జోగులాంబ గద్వాల

ప్యాకేజి నెం. 107-D6/15R Canal

| క్ర.సం. | సర్వే నెం. | భూమి వర్గం (పట్టా / ఇనాం / ప్రభుత్వ) | భూమి రకం (మెట్ట / తరి) | భూసేకరణ చేయు విస్తీర్ణము ఎ.సెం.లు | పేరు / చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు) | చెట్లు రకం / సంఖ్య, కట్టడం రకం/ విస్తీర్ణం చ.గజాల లో |
|---|---|---|---|---|---|---|
| 1 | 736 | పట్టా | మెట్ట | 0.84 | 1)తిమ్మడు S/o కర్రెన్న 2)హుస్సేన్ S/o బజారీ 3)స్వామి S/o ఆంజనేయులు **అనుభవదారులు:-** 1) బతుక్క S/o పెద్ద బుడ్డన్న 2) తిమ్మప్ప S/o యమ్మన్న | - |
| 2 | 744 | పట్టా | మెట్ట | 1.31 | 1) దేవాలయ భూమి (ఎండోమెంట్) **అనుభవదారులు:-** 1) గొల్ల పూజారి | - |
| 3 | 761 | పట్టా | మెట్ట | 0.24 | 1) ఉషేని S/O ఉషేని 2)బోయ శంకరమ్మ W/o క్యాసారం 3)అనిల్ (MG) లక్ష్మి W/o పెద్ద ఉపేని 4) బోయ భీమన్న S/o గోవిందు 5)బి.ఆంజనేయులు S/o గోవిందు 6)బి.ఆంజనేయులు S/o చిన్న ఉశ్రేణి 7)హనుమంతు S/o బోయ చిన్న ఊషేని 8)ముద్దు రామన్న S/o క్యాసారం 9)బోయ దుల్లన్న S/o హనుమంతు 10)బి.దినేష్ S/o బి. దుల్లన్న 11)బోయ కేశమ్మ W/o సొట్టచెయ్యి హుసేని 12)బోయ పద్మమ్మ W/o బోయ హనుమంతు 13) బోయ హనుమంతు S/o కర్రెన్న **అనుభవదారులు:-** 1) హుసేని S/o చిన్న గుండన్న 2)దివంగత పెద్ద గుండన్న 3)ముద్ద రామన్న | - |
| | | విస్తీర్ణము | | : 2.39 | | |

**2) ఎ1/88/2021**
గ్రామము:ఇందువాసి మండలము:గట్టు జిల్లా:జోగులాంబ గద్వాల

ప్యాకేజి నెం. 107-TE-DY8 Main Canal

| క్ర.సం. | సర్వే నెం. | భూమి వర్గం (పట్టా / ఇనాం / ప్రభుత్వ) | భూమి రకం (మెట్ట / తరి) | భూసేకరణ చేయు విస్తీర్ణము ఎ.సెం.లు | పేరు / చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు) | చెట్లు రకం / సంఖ్య, కట్టడం రకం/ విస్తీర్ణం చ.గజాల లో |
|---|---|---|---|---|---|---|
| 1 | 420 | పట్టా | మెట్ట | 0.05 | 1)బలిజ ఈశ్వరమ్మ W/o పెద్ద ఈశ్వరప్ప 2) శివమ్మ W/o బి. బసవరాజప్ప 3)వెంకటేష్ S/o చెన్నప్ప 4)బి.సింధు S/o బోయ వెంకటేష్ 5)చిన్న బస్సయ్య S/o చెన్నప్ప **అనుభవదారులు:-** 1) చిన్న బసయ్య S/o చెన్నప్ప | - |
| 2 | 424 | పట్టా | మెట్ట | 0.91 | 1) రామన్న S/o చిన్న నర్సప్ప 2) రోజైన్ S/O నర్సప్ప **అనుభవదారులు:-** 1)హరిజన జార్జ్ | - |
| 3 | 430 | పట్టా | మెట్ట | 0.04 | 1) బసన్న S/o పెద్ద నర్సన్న 2) నర్సమ్మ W/o వీరన్న 3)చింతబిచ్చ బోయ నాగమ్మ W/o సిద్దయ్య 4)కె. నాగన్న S/o పెద్ద తిమ్మప్ప 5)బోయ నర్సింహులు S/o పెద్ద తిమ్మప్ప 6) నర్సింహులు S/o చిన్న తిమ్మప్ప 7) నాగరాజు S/o చిన్న తిమ్మప్ప 8)కర్రెన్న S/o బోయ సందయ్య 9) గోవిందమ్మ W/o పెద్ద తిమ్మప్ప 10)అనుమంతమ్మ W/o రామన్న 11)లక్ష్మి W/o బసప్ప 12)లక్ష్మి W/o చిన్న తిమ్మప్ప **అనుభవదారులు:-** 1)నర్సింహులు S/o పెద్ద తిమ్మప్ప | - |
| 4 | 458 | పట్టా | మెట్ట | 0.05 | 1) నెక్కి నర్సమ్మ W/o దుల్లయ్య 2) బొజ్జన్న S/o తిమ్మప్ప 3)బోయ హనుమంతు S/o తిమ్మప్ప 4)పెద్ద నర్సింహులు S/o బొజ్జయ్య 5)చిన్న నర్సింహులు S/o బొజ్జయ్య **అనుభవదారులు:-** 1) ఇంజన్న S/o గుంతకల తిమ్మప్ప | - |
| | | విస్తీర్ణము | | 1.05 | | |
| | | మొత్తం విస్తీర్ణము | | Ac. Gts. 3.44 | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.
ఇట్టి భూసేకరణ వలన ఎవ్వరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావాసం మరియు పునరూపాధి కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.
భూసేకరణ తలపెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ ప్రత్యేక ఉపకలెక్టర్, జవహార్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, గద్వాల గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, గద్వాల.
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జోగులాంబ గద్వాల జిల్లా
సం/- కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా

DIPR RO NO. 759/LA/PP/Advt/Pub/2026-27

# హైదరాబాద్ క్యూఆర్ పరిధిలో.. వేగంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర పరిధిలోని నిరుపేదల సొం తింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిర మ్మ టవర్స్' నిర్మాణ ప్రక్రియను వే గవంతం చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సచివాలయంలో హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో రూ.807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని, వచ్చిన 60,720 దరఖాస్తుల్లో క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం 40,900 మందిని అర్హులుగా తే ల్చామన్నారు. అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలో ఈ నెల 27 నుంచి 30 వరకు పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు తెలిపారు. లక్కీ డ్రాలో ఎంపిక కాని వారికి వారు చెల్లించిన రూ.10,000 ఇఎండి మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లోకి జమ చేస్తామని స్పష్టం చేశారు. దీనికి అదనంగా ఎల్.బి.నగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట ని యోజకవర్గాల్లో కొత్తగా మరో1,920 ఇళ్ల నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని, అర్హులు సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ.5లక్షల సబ్సిడి అందిస్తుందని, అన్ డివైడెడ్ షేర్ కింద రూ.60 లక్షల నుంచి కోటి రూపాయల విలువైన భూమిపై ఉచితంగా హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు.

### పారదర్శకత లేకుంటే వెబ్‌సైట్ ఎందుకు మూసేశారు?

గత ప్రభుత్వంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి, బండారం బయటపడటంతోనే హరీశ్ రావు తన కంపెనీ వెబ్‌సైట్‌ను మూసివేశారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి టి.హరీశ్ రావుపై మంత్రి పొంగులేటి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఆ సుపత్రులతో పాల వ్యాపారం నిర్వహించారని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆస్తులు కూడబెట్టారని పొం గులేటి దుయ్యబట్టారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఏసమస్య వచ్చినా జవాబుదారీతనంతో పరిష్కరిస్తుం టే, ప్రజలను భయాందోళనకు గురిచేసి, రాజకీయం చేయడం బిఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని విమర్శించారు.

# ఎరువుల ధరలు కేంద్రం క్రమబద్ధీకరించాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎరువుల ధరల వ్యత్యాసంతో యూరియా వైపు రైతుల మొగ్గు చూపుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను క్రమబద్ధీకరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. అధిక యూరియా వాడడం వల్లపంటలకు అవసరమైన పోషకాలు సమతుల్యంగా అందక నేల ఆరోగ్యం, పంటల నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో యూరియా వినియోగం 2015–16లో 14 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2025–26 నాటికి 20.70 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఎన్‌పికె వినియోగ నిష్పత్తి 12.6:4.8:1గా ఉండగా, సిఫారసు చేసిన నిష్పత్తి 4:2:1 మాత్రమేనన్నారు. 45 కిలోల యూరియా బస్తా రూ.240–266కే లభిస్తుండగా, 50 కిలోల డిఎపి రూ.1,350, 19:9:19 కాంప్లెక్స్ ఎరువుల బస్తా రూ.1,750గా ఉందని వివరించారు. మొక్కజొన్నలో సిఫారసు చేసిన మూడు బస్తాల యూరియాకు బదులుగా ఐదు నుంచి పది బస్తాల వరకు వినియోగిస్తున్నారని, పత్తిలో నైట్రోజన్ వినియోగం 10–15 శాతం అధికంగా ఉండగా, పొటాష్ వినియోగం 30 శాతం తక్కువగా ఉందని తెలిపారు. అధిక, అసమతుల్య ఎరువుల వినియోగంతో నేలలో జింక్, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాల లోపాలు, నైట్రోజన్ లీచింగ్, నేల–నీటి కాలుష్యం, చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. యూరియా, డిఎపి, కాంప్లెక్స్ ఎరువుల ధరల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించి, రైతులు సమతుల్యంగా ఎరువులు వినియోగించేలా కేంద్రం ధరల విధానాన్ని రేషనలైజ్ చేయాలని తుమ్మల కోరారు. ఈ విషయంపై కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా తగిన చర్యలు కనిపించడం లేదన్నారు. రైతులు శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులు వినియోగించాలని, పశువుల ఎరువు, పచ్చిరొట్ట, వర్మీకంపోస్ట్, బయోఫెర్టిలైజర్స్‌తో పాటు నానో యూరియా, నానో డిఎపిని సిఫారసు మేరకు వినియోగించాలని మంత్రి సూచించారు. యూరియా అధిక వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు రైతు నేస్తం కార్యక్రమం ద్వారా నిరంతరం అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన రైతునేస్తం 104వ భాగంలో ఎరువుల వినియోగం, నానో యూరియాపై శాస్త్రవేత్తలు సూచనలు అందించారు.

## 7 సన్నరకాల వరి సాగు వివరాలను నమోదు చేసుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖరీఫ్‌లో 7 సన్న రకాల వరి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ప్రకటించిన నేపథ్యంలో పంట, విత్తనాల వివరాలను నమోదు చేసుకోవాలని రైతులకు అధికారులు సూచించారు. రైతునేస్తం 104వ భాగంలో మంగళవారం రైతులకు తాజా వ్యవసాయ సమాచారం అందించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల బుకింగ్ కోసం అమలు చేస్తున్న ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే విధానాన్ని రైతులకు వివరించారు. ప్రస్తుతం 22 జిల్లాల్లో యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతుండగా, మిగిలిన జిల్లాల్లో ఆగస్టు 27 నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణం, వర్షపాతం, భూగర్భ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితిపై శాస్త్రవేత్తలు వివరించారు.

# సిపిఐ(ఎం) సీనియర్ నాయకురాలు సుమతి మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ(ఎం) జాతీయ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు సతీమణి సిపిఐ(ఎం) సీనియర్ నాయకురాలు సుమతి మహబూబ్‌నగర్‌లోని సుశ్రుత హాస్పిటల్‌లో మంగళవారం ఉదయం మరణించారు. కాగా వారి పార్థివదేహాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమతి తన భర్త మధు ఎంచుకున్న కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల్లో తన వంతు పాత్ర నిర్వహించిందని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్యదర్శి బి పరమేశ్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.పద్మావతి, పి.సురేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జి.సత్యనారాయణ, చాంద్ పాషా రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

### సుమతి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు: డాక్టర్ కె.నారాయణ

సిపిఐ(ఎం) జాతీయ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు మధు సతీమణి సుమతి మృతి పట్ల సిపిఐ సెంట్రల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుమతి మృతి వామపక్ష ఉద్యమానికి, మధు కుటుంబానికి తీరని లోటని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వామపక్ష ఉద్యమంలో మధు చేస్తున్న కృషికి సుమతి అం దించిన సహకారం, ప్రోత్సాహం ఎంతో విలువైనవని నారాయణ అన్నారు. హైదరాబాద్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లో సుమతి కొంతకాలం ఉన్న విషయాన్ని గుర్తు చేసుకున్న ఆయన తీవ్ర అనారోగ్యంతో సుమతి మృతి చెందారన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. మధు కుటుంబ సభ్యులకు, పార్టీ నేతలకు నారాయణ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొని మధు ప్రజా ఉద్యమాల్లో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: ఉప్పల్ సర్కిల్-9**

| NIT No & Date | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| TENDER NOTICE NIT No. 19/EEC-9/ UPL/MMC/ 2026-27, Dated: 24.08. 2026 | ఎంఎంసి పరిధిలోని ఉప్పల్ సర్కిల్-9, వార్డు నం. 28లో గణేష్ నిమజ్జనం-2026 దృష్ట్యా 'నల్ల చెరువు' వద్ద ఉన్న చిన్న కొలను వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేయడం, అలాగే డీవాటరింగ్ పంప్ సెట్లు మరియు కూలీలను ఏర్పాటు చేయడం వంటి 6 పనుల కోసం... (ఈ పనులు SC వర్గానికి చెందిన వ్యక్తులు మరియు సంఘాలకు కేటాయించబడ్డాయి). ............ ఎంఎంసి పరిధిలోని ఉప్పల్ సర్కిల్-9, రామాంతపూర్, వార్డు నం. 26లో 2026 సంవత్సరానికి గాను, రామాంతపూర్‌లోని నీటి కొలను వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లు కల్పించడం. | రూ. 26.90 లక్షలు | 29.08.2026 మ.03.00 గం.ల వరకు | శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-9, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https: //www.Tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ సర్కిల్-9, ఎంఎంసి
DIPR R.O. No. : 8633-PP/CL/ADVT/2026-27, Date: 25-08-2026

**అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయం**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

NIT No.E/Aspt/235/2026 — **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ & కొటేషన్ నోటీసు** — తేది: 25.08.2026

**1)** పనుల సంఖ్య: 04, **2)** పని మొత్తం విలువ: రూ. 27.00 లక్షలు, **3)** బిడ్ పత్రాల డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం: 25-08-2026 సాయంత్రం 05:00 గంటలకు, **4)** బిడ్ సమర్పణకు చివరి తేదీ & సమయం: 03-09-2026 సాయంత్రం 05:00 గంటలకు. ఏవైనా సందేహాలు ఉంటే 6302933528 మరియు 9030613631 నంబర్లను సంప్రదించండి. మరిన్ని వివరాలను 'ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అనగా **www.eprocurement.gov.in** లో చూడవచ్చు.

**అశ్వారావుపేట మున్సిపాలిటీ ఈ క్రింది అంశాలకు సంబంధించి కొటేషన్లను ఆహ్వానిస్తోంది:**
(i) కార్యాలయ వినియోగం కోసం కంప్యూటర్లు మరియు ప్రింటర్లు, (ii) పారిశుధ్య వాహనాల మరమ్మతులు మరియు విడిభాగాలు, (iii) పారిశుధ్య సామాగ్రి.

షెడ్యూల్ జారీకి చివరి తేదీ : **31-08-2026 మధ్యాహ్నం 01:00 గంటల వరకు**
కొటేషన్ సమర్పణకు చివరి తేదీ : **31-08-2026 మధ్యాహ్నం 01:30 గంటల వరకు**

సీల్డ్ కవర్లను కమిషనర్ ఛాంబర్‌లో సమర్పించాలి.
ఇతర వివరాల కోసం పని వేళల్లో అశ్వారావుపేట మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగాన్ని సంప్రదించండి.
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్లు: కమిషనర్ (6302933528), మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ (9030613631).
సం/- కమిషనర్, అశ్వారావుపేట మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 8670-PP/CL/ADVT/2026-27, Date: 25-08-2026

# గణేష్ ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యుల సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్‌రెడ్డి**




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పకడ్బందీగా పనిచేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించారు. సెప్టెంబర్ 14 నుంచి 25వ తేదీ వరకు 12 రోజుల పాటు జరగనున్న గణేష్ ఉత్సవాలకు సంబంధించి గత ఏడాది ఏర్పాట్లు, ఎదురైన సమస్యలు, ఈ ఏడాది చేపట్టాల్సిన భద్రతా, మౌలిక వసతుల ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో పోలీస్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, హైడ్రా, ఆర్అండ్‌బి, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, జలమండలి, ఆర్టీసీ, టూరిజం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన తేదీ వంటి వివరాలను నిర్వాహకులు ముందుగానే స్థానిక పోలీసులకు తెలియజేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రదేశాల్లో విగ్రహాలు, మండపాలు ఏర్పాటు చేయరాదని తెలిపారు. ప్రతి గణేష్ మండపం వద్ద నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండడంతో పాటు, అవసరమైన సిసి కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం జరిగే మార్గాలను ముందుగానే పరిశీలించి, ఆయా మార్గాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేసి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడతామని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిస్థితులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటారని చెప్పారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ఇంద్రేశం, ఇస్నాపూర్‌తో పాటు జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల్లో గత ఏడాది గణేష్ ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవ రెడ్డి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి అన్నపూర్ణ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ్ సమితి సభ్యులు మహిపాల్‌రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ్ సమితి అధ్యక్షులు రాఘవరెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ్ సమితి సెక్రటరీ శశిధర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు రామరాజు, రమేష్, భాస్కర్, జీవన్, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే వారిపై కేసులు తగదు

**సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య**

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి నిర్బంధిస్తే తిరుబాటు తప్పదని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య హెచ్చరించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల అక్రమ అరెస్టును భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అక్రమ కేసులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులకు అండగా సిపిఐ ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు.

## ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వద్దు



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** నేటి సమాజంలో ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్ పరిధిలోని విజయ గార్డెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్ మరియు చిల్డ్రన్స్ పార్క్‌ను ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే ద్రేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, తూర్పటి. చిరంజీవి, శిల్పరెడ్డి, పోచంపల్లి రాజేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు రాంచంద్రరెడ్డి, మల్లారెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెల్లెట్‌గన్‌తో కాల్పులు చేయించిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్ కాల్పులు చేయించిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం తుక్కుగూడలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీకి షాద్‌నగర్ నుండి యువజన కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశ రాజదాని డిల్లీలో విద్యార్థులు న్యాయమైన డిమాండ్లపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపించిన ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి సంతోష్ గౌడ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రాష్టంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ దాదాపు 15 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్,రామచందర్ రావు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్‌తో కలిసి బిఎన్.రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. ఆయన వెంట విష్ణువర్ధన్ రావు, శ్రీధర్ రావు, రఘురాంనేత, రవిశంకర్, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, శంకరయ్య గౌడ్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

## వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే సహించం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** పార్టీ కోసం 16ఏళ్లుగా పనిచేస్తున్నామని, పార్టీ అధిష్టానం గుర్తించి అవకాశం కల్పిస్తే వ్యక్తిగతంగా విమర్శలు చేస్తూ, కులం పేరుతో దుషించడం హేయమైన చర్య అని సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం సాహెబ్‌నగర్ డివిజన్‌లోని భవాని ఎన్‌క్లేవ్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విద్యారెడ్డి వ్యక్తిగతంగా విమర్శలు చేస్తూ, గిరిజన కుటుంబానికి చెందిన తన కుటుంబ సభ్యులను అవమానించేలా మాట్లాడం పద్ధతి కాదని, నియోజకవర్గంలో గత 16 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ, ఎల్‌బి నగర్ ఏస్టీ సెల్ చైర్మన్‌గా 2021లో అవకాశం పార్టీ కల్పించిందని ఆయన పేర్కొన్నారు.

## మధుయాష్కీపై విద్యారెడ్డి ఆరోపణలు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్ నాయక్ గతంలో బ్రోతల్ కేసులో పట్టుబడినారని, అలాంటి వారికి పార్టీ డివిజన్ అధ్యక్షులు ఇవ్వడం వెనుక మధుయాష్కీ గౌడ్ హస్తం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కొత్త విద్యారెడ్డి ఆరోపించారు. మంగళవారం సాహెబ్ నగర్ డివిజన్‌లోని సౌభాగ్య నగర్ కాలనీలో మిడియా సమావేశం నిర్వహించారు. సమాజంలో మహిళాలు బయటకు చెప్పుకునేలా లేదని, అతని తక్షణమే పార్టీ పదవి నుంచి తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు. పార్టీ కోసం పనిచేసిన వారిని పదవులు ఇవ్వకుండా, కావాలనే మధుయాష్కీ గౌడ్ ఇలాంటి వారికి అవకాశం కల్పించడం సమంజసం కాదన్నారు.

## ప్రతి రోగికి సకాలంలో వైద్యసేవలు

**డిఎంహెచ్ఒ డాక్టర్ డి.స్వర్ణ కుమారి**

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రతి రోగికి సకాలంలో వైద్య సేవలు, సీజనల్ వ్యాధుల దృశ్య వైద్యాధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డిఎంఅండ్‌హెచ్ఒ)డాక్టర్ డి.స్వర్ణ కుమారి సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా హాఫీజ్‌పేట్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హాజరు, ఒపి సేవలు, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పరిశుభ్రత తదితర అంశాలను డిఎంహెచ్ఒ పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రతి రోగికి సకాలంలో వైద్య సేవలు, అవసరమైన మందులు, ఆరోగ్య సలహాలు అందించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిఎంహెచ్ఒ ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో అర్బన్ హెల్త్ సెంటర్ల పాత్ర కీలకమని,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ఆరోగ్య శాఖ ప్రధాన లక్ష్యమని డాక్టర్ స్వర్ణ కుమారి పేర్కొన్నారు.

## నీట్ పిజి 2026 పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

**కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**






**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఈ నెల 30న నిర్వహించనున్న నీట్ పిజి 2026 పరీక్షను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. నీట్ పిజి పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టితో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎసిపిలు ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్)ఆధ్వర్యంలో ఆగస్టు 30న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒకే షిఫ్ట్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్ష సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల కోసం ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రానికి సమీపంలోని సైబర్ పోలీస్ స్టేషన్‌తో సమన్వయం చేసుకొని అప్రమత్తంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. పరీక్షకు సంబంధించిన అంశాలపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాల నివారణ

**మహేశ్వరం జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.నారాయణ రెడ్డి**



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజల భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాల నివారణ సాధ్యమవుతుందని, మాదకద్రవ్యాల నివారణ చర్యలు ప్రతి ఇల్లు, పాఠశాలల నుంచే శ్రీకారం చుట్టాలని మహేశ్వరం జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) కె.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో నషా ముక్త భారత్ అభియాన్‌పై పిఐబి నిర్వహించిన వార్తా మీడియా వర్క్ షాప్ ను ఈగల్ ఫోర్స్ పోలీస్ సూపరింటెండెంట్ రావుల గిరిధర్, పిఐబి,హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, మహేశ్వరం ఎంపిడిఒ ఎస్.శారదమ్మతో కలిసి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ డ్రగ్స్ భూతాన్ని ఎదుర్కొనేందుకు చట్టపరమైన ఆంక్షలు మాత్రమే సరిపోవు.. ప్రజలందరి భాగస్వామ్యంతోనే దాన్ని సమర్థంగా కట్టడి చేయగలం" అన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, సహచరులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సకాలంలో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా డ్రగ్స్ ముప్పును సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను కాపాడుకోవడాన్ని శాంతిభద్రతల అంశంగా మాత్రమే చూడలేమన్నారు. వారి ఆరోగ్యాన్నీ, నైపుణ్యాన్నీ,సామర్థ్యాన్నీ పెంపొందించడంలోనూ ఇది అత్యావశ్యకమన్నారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు.. నేడు దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా మారాయని నారాయణ వ్యాఖ్యానించారు. మాదకద్రవ్య రహిత భారత్ నిర్మాణం దిశగా ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోలీసు సూపరింటెండెంట్ రావుల గిరిధర్ మాట్లాడుతూ జనవరి నుంచి తెలంగాణలో దాదాపు 8 వేల కేజీల గంజాయిని ఈగల్ ఫోర్స్ సీజ్ చేసిందని ఆయన తెలిపారు. దాదాపు 22 రకాల శిక్షణ కార్యక్రమాల ద్వారా 30 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికీ, ఇతర శాఖల అధికారులకూ శిక్షణ ఇచ్చినట్టు పేర్కొన్నారు. పిఐబి,హైదరాబాద్ మీడియా,కమ్యూనికేషన్ అధికారి వర్గంటి గాయత్రి కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం,పరిసర ప్రాంతాలకు చెందిన దాదాపు 60 మంది మీడియా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన ఎమ్మెల్యే శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో భాగంగా భూసేకరణ పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. భూ సేకరణ పనుల్లో వేగం పెంచి ప్రతిష్టాత్మకంగా పనులు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. పాలమూరు..రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చివరి లిఫ్ట్ ఇరిగేషన్ అయిన లక్ష్మీ దేవిపల్లి పల్లి రిజర్వాయర్ పనులు త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. భూసేకరణ పనులు పూర్తి చేసిన వెంటనే రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంటుందని వివరించారు. భూసేకరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరయ్యాయని, పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కొల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం అంధించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ప్రతి విద్యార్థీ మొక్క నాటి సంరక్షించాలి

**ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, హెడ్ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ వినయ్ కుమార్**



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రతి విద్యార్థి తన పుట్టినరోజు సందర్భంగా కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్,హెడ్ఆఫ్‌ఫారెస్ట్ ఫోర్స్ (పిసిసిఎఫ్) వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. వన మహోత్సవం సందర్భంగా మంగళవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ గురుకుల బిసి గురుకుల విద్యాలయ సంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసిఎఫ్ వినయ్ కుమార్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా సెప్టెంబర్ నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 25న రాష్ట్రవ్యాప్తంగా లక్ష మొక్కలు నాటడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందులో భాగంగా మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ గురుకుల బిసి గురుకుల విద్యాలయ సంస్థ ప్రాంగణంలో 2,200 మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డాక్టర్ ప్రియాంక వర్గీస్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రరెడ్డి, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశీష్ సింగ్ లతో పాటు పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ :** పర్యావరణ పరిరక్షణకు; కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, డాక్టర్ సంధ్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్‌లు మొక్కలు నాటి నీళ్ళు పోశారు. కార్యక్రమంలో చించోడు సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, డాక్టర్ సంద్యారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి జయపాల్‌రెడ్డి, వార్డు సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


**కొందుర్గు:** మొక్కల పెంపకమే కాలుష్య నియంత్రణకు మూలమని కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీరామ్, సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, నాయకులు కృష్ణారెడ్డి, రాములుగౌడ్, వార్డు సభ్యుడు బుజ్జిగారి సువర్ణ నర్సింహులు, మద్ది శ్రీకాంత్, ఎంపిఒ నర్సింగ్ రావు, ఉపాధ్యాయులు గోపినాథ్ పాల్గొన్నారు




**యాచారం :** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ఒక మొక్కనాటాలని మండల అభివృద్ధి అధికారి రాధరాణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా 24 గ్రామాల్లో 4715 మొక్కలును నాటామన్నారు. అయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఇబ్రహింపట్నం :** గ్రామాల్లో పచ్చదనం పెంపుకోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహింపట్నం మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ భావితరాల భవిష్యత్ కోసం ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని బతికించాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడి శేషకుమార్, పాంటేషన్ మేనేజర్ సంధ్య, ఎంపిడిఒ, ఎంపిఒ, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.










## లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు మంజూరు

### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఆర్థికాభివృద్ధే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేయటంలో బ్యాంకులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డిఎల్ఆర్సీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు సరళీకృత విధానాలను అవలంబించాల



న్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ స్వయం ఉపాధి గ్రూప్ సభ్యులకు అందించే రుణాలు సకాలంలో బ్యాంకులు మంజూరు చేయటం ద్వారా ఆర్థికాభివృకి దోహదపడాలని సూచించారు. బ్యాంకుల వద్ద లబ్దిదారులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, ఇతర బలహీన వర్గాలకు వివిధ రుణ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించాలన్నారు, పిఎం విశ్వకర్మ, పిఎం ఈజిపి, పిఎంఎఫ్ఎంఇ, ఎంఎస్ఎంఇ, ఆర్ఎఎంపి, ముద్ర లాంటి ప్రభుత్వ పథకాల ద్వారా యువత, మహిళలు, స్వయం ఉపాధి పొందే వారికి రుణాలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.



## జర్నలిస్టులకు రెయిన్ కోట్లు పంపిణీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా ప్రెస్ క్లబ్ మదర్ కమిటీ జర్నలిస్లులకు బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు శరత్‌చంద్ర మంగళవారం రెయిన్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్లుల సంక్షేమానికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జ్యోతిర్మయాచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సురేష్, సీనియర్ జర్నలిస్టులు కె. సత్యనారాయణ, కెసి మోహన్, సహదేవచారి, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కూకట్‌పల్లి మండల విద్యాధికారి రవీందర్ రాజు అన్నారు. మంగళవారం యూత్ ఫర్ సేవా, ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఎంఇఒ రవీందర్ రాజు ఆధ్వర్యంలో సుమారు 400 మంది విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. యూత్ ఫర్ సేవా వంటి సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పేద విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందించే సహకారం తో ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి ఉత్తమ విద్యా వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా ప్రతినిధులు, సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గురుకుల్ సమస్యలపై రంగంలోకి మల్లారెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** గురుకుల్ కళాశాలలో అధ్యాపకుల కొరత, కళాశాలను ప్రభుత్వం సాధీనం చేసుకునే అంశంపై మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి దృష్టి సారించారు. రెండు రోజుల క్రితం గురుకులంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మల్లారెడ్డిని కలిశారు. అధ్యాపకుల కొరత కళాశాల భవిష్యత్తు ప్రభుత్వ ఆధీనంలోని తీసుకునే అంశాలపై చర్చించారు. అనంతరం మల్లారెడ్డి ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి అధ్యాపకుల కొరతను పరిష్కరించాలని కోరారు. త్వరలో అధ్యాపకులను పంపిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. గురుకుల్ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకుఈనెల 7న అపాయింట్‌మెంట్ తీసుకున్నట్లు మల్లారెడ్డి తెలిపారు. కళాశాలకు సంబంధించిన పత్రాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి తపాలా ద్వారా పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్ గౌడ్, వేకల నర్సింగ్‌రావు, నగేష్‌కుమార్ గుప్తా, సదానందం, ఎండి.సిరాజ్ పాల్గొన్నారు.

## 33శాతం కోటా తక్షణమే అమలు చేయాల్సిందే

### భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** దేశ జనాభాల్లో సగ భాగంగా ఉన్న మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేసారు. మంగళవారం హైమవతి అధ్యక్షతన జరిగిన మేడ్చల్ జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి వందన్ అభియాన్ పేరిట తెచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదించినప్పటికీ పునర్విభజన వంకతో ఈ బిల్లును అమలు చేయటాన్ని 2029కి వాయిదా వేయటాన్ని తీవ్రంగా ఖండిస్తూ తక్షణమే అమలు చేయాల్సిందేనన్నారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల దోపిడీ, వివక్షత, పీడనలకు కారణం ఫాసిస్టు సామ్రాజ్యవాద పితృస్వామ్య వ్యవస్థ కారణమన్నారు. ఆధిపత్య దోపిడీ పాలక వర్గాలను కూల్చటంతోనే మహిళల విముక్తి ముడిపడి ఉందన్నారు. ఆధునిక సమాజంలో మహిళలపై అత్యాచారాలు, అపహరణలు, వరకట్న వేధింపులు, హత్యలు రోజురోజుకు పెరిగి పోవటం పట్ల ఆవేదన వ్యక్తం చేసారు. బలమైన మహిళా సమాఖ్య నిర్మాణమే లక్ష్యంగా గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహిస్తూ జిల్లా మహసభలను పూర్తి చేసుకొని రాష్ట్ర మహాసభలకు సన్నద్ధం కావాలని పిలుపిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుండి ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ ఇబ్బందులకు గురవుతుందని గణాంకాల ద్వారా తెలుస్తోందన్నారు.

ఈ సమావేశంలో నూతన కమిటి గౌరవ అధ్యక్షురాలిగా హైమవతి, ఉపాధ్యక్షురాలిగా ప్రమీల, సిందూర, మహాలక్ష్మి, లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మాధవి, సహాయ కార్యదర్శులుగా చంద్రమ్మ, యాకమ్మ, పద్మ, కోశాధికారిగా లత ఎన్నికయ్యారు.

## హెచ్ఎండిఎ ప్రీమియం భూముల ఇ-వేలాలకు భారీ స్పందన

### ప్రీ-బిడ్ సమావేశానికి ప్రముఖ డెవలపర్లు, పెట్టుబడిదారుల హాజరు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హెచ్ఎండిఎ నిర్వహించనున్న ప్రీమియం భూముల ఈవేలాలకు ముందు నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు, పెట్టుబడిదారులు, భావి బిడ్డర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని టిహబ్‌లో జరిగిన ఈ సమావేశం హెచ్ఎండిఎ భూములపై మార్కెట్‌లో ఉన్న విశేష ఆసక్తిని ప్రతిబింబించింది. సమావేశంలో హెచ్ఎండిఎ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఎ.రవీందర్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ అప్పారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధన్మోహన్ సింగ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవీందర్, కె. అభిలాష్, తహసీల్దార్ వై.టి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ డి. శ్రీకాంత్ రెడ్డి, కెపిఎంజీ భాగస్వామి అఖిలేష్ అవినాష్, డైరెక్టర్ జీవన్ పండిట్‌తో పాటు హెచ్ఎండిఎ, ఎంఎస్‌టిసి, కెపిఎంజి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూముల అభివృద్ధి ప్రమాణాలు, వేలం నిబంధనలు, ప్లాట్ల వివరాలపై బిడ్డర్లు అడిగిన సందేహాలకు హెచ్ఎండిఎ అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఆన్‌లైన్ బిడ్డింగ్ విధానాన్ని ఎంఎస్‌టిసి ప్రతినిధులు వివరించారు. ముఖ్యంగా నియోపోలిస్, గోల్డెన్ మైల్ ప్రాంతాల్లోని భూములకు ఉన్న వ్యూహాత్మక స్థానం, అద్భుతమైన రవాణా సౌకర్యాలు, పెట్టుబడి అవకాశాలను అధికారులు వివరించారు. హెచ్ఎండిఎ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సరూర్‌నగర్ లేఔట్‌లోని 4,356 చదరపు గజాల భూమికి ఈవేలం సెప్టెంబర్ 7న నిర్వహించనుండగా, నమోదు చేసుకునేందుకు చివరి తేదీ సెప్టెంబర్ 5, అలాగే నియోపోలిస్ లేఔట్‌లోని 4.59 ఎకరాలు, గోల్డెన్ మైల్ లేఔట్‌లోని 0.70 ఎకరాల భూములకు సెప్టెంబర్ 9న ఈవేలం నిర్వహించనుండగా, నమోదు గడువు సెప్టెంబర్ 6 వరకు ఉంటుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు, పెట్టుబడిదారులు, పరిశ్రమ ప్రతినిధులు భారీగా ఆసక్తి చూపడం వల్ల ఈవేలాల్లో పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉందని హెచ్ఎండిఎ అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7416835522 టోల్ ఫ్రీ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ ప్రీబిడ్ సమావేశానికి ఆరో రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్, ఫెయిర్ మౌంట్, సత్వా, వంశీరామ్, ట్రైలైట్, గౌరా సంస్థలతో పాటు మరో 20 మంది భావి బిడ్డర్లు హాజరయ్యారు.

## వినాయక ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

### జోనల్ కమిషనర్ రాధికా గుప్తా





**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఎంఎంసి ఉప్పల్ జోన్ పరిధిలో వినాయక ఉత్సవాలతో పాటు నిమజ్జనం కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో ప్రణాళికతో పని చేయాలని జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఆదేశించారు. మంగళవారం గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన నిమజ్జన కేంద్రాల్లో క్రేన్లు, కంట్రోల్ రూంలు, ఫైర్ ఇంజన్లు, డిఆర్ఎఫ్ బృందాలు, వైద్య సదుపాయాలు, గజ ఈతగాళ్లు, పడవలు, లైఫ్ సేవింగ్ పరికరాలు సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు మార్గాల్లో అవసరమైన రోడ్డు మరమ్మత్తులు, విద్యుత్, తాగు నీరు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు గణేష్ యాక్షన్ బృందాలను ఏర్పాటు చేసి రేయింబవళ్లు మూడు షిఫ్టుల్లో పని చేసేలా చూడాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణేష విగ్రహాలను ఉచితంగా ప్రతి ఒక్క కుటుంబానికి అందేలా చూడాలన్నారు.

## అనుమతులు లేని నిర్మాణాలపై ఉక్కు పాదం

### దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట మణికరణ్




**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేని నిర్మాణాలపై ఉక్కు పాదం మోపారు. దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట మణికరణ్ సర్కిల్ పరిధిలోని దొమ్మరపోచంపల్లి సర్వే నెంబర్ 168లో అనుమతులు లేకుండా కేవలం 100 గజాల స్థలంలో చేపట్టిన జి+4 అక్రమ నిర్మాణాన్ని మంగళవారం అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మని కరణ్ మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే ఏ నిర్మాణాన్ని కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అనుమతులు ఒకలా తీసుకొని, అదనం గా అనధికారిక నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు.

ఇలాంటి అనధికార నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటూ డీమాలిషన్లు కొనసాగిస్తామని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**మొక్కలు నాటిన డిప్యూటీ కమిషనర్**

వనమహోత్సవం సందర్భంగా బౌరంపేట్ స్నేక్ పార్క్ రోడ్ వద్ద శిఖర స్కూల్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట మణి కరణ్ , దుండిగల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, మొక్కల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా, ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్నితగ్గించి, వాటికి ప్రత్యామ్నాయం గా జ్యూట్ బ్యాగులను వినియోగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణహిత జీవన విధానాన్ని ప్రోత్సహిస్తూ జ్యూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించారు. ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ, పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన పరిసరాల ను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనిఅధికారులు సూచించారు.



## ప్రజల భూములను నిషేధిస్తే.. వారు నిన్ను నిషేధిస్తారు

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ 22ఏ బాధితుల సమావేశంలో హెచ్చరించిన మాజీ మంత్రి హరీష్ రావు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రజల భూములను 22ఏ పేరిట నిషేదిత జాబితాలో వేస్తే ప్రజలు నిన్ను నిషేదిస్తాపని బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్‌నగర్‌లో ఎంజే గార్డెన్స్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 22ఏ బాధితుల సమస్యలపై బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణలో 22ఏ సమస్య కేవలం రిజిస్ట్రేషన్ సమస్య కాదని, వేలాదిమంది భూ యజమానుల భవిష్యత్తుకు సంబంధించిన సమస్య అని తెలిపారు. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసి చట్టబద్ధమైన పత్రాలు, పట్టాలు కలిగి ఉండి, పన్నులు చెల్లిస్తున్న ప్రజల భూములను ఒక్కసారిగా 22ఏ జాబితాలో చేర్చడం వల్ల తమ భూములను అమ్ముకోలేక, రిజిస్ట్రేషన్ చేసుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుటుంబం తన భూమిని అమ్మి పిల్లల చదువుకు గాని, కూతురి వివాహం కోసం గాని, వ్యాపార నిమిత్తంగాని, అనారోగ్య సమయంలో వైద్య ఖర్చులు భరించేందుకు గాని, ఇల్లు నిర్మాణం కోసం గాని ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజల భూములను నిషేధిస్తే ప్రజలు నిన్ను నిషేధిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎవ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రజాసంఘాలపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలి

### సిపిఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి, కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్షావలి

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** ప్రజాస్వామికంగా ఆదివాసీ, ప్రజాసంఘాలు, మేధావులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేసి రాజకీయ ఖైదీలుగా జైల్లో మగ్గుతున్న వారిని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, సిపిఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. జవహర్ నగర్ అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్షావలి ఆధ్వర్యంలో రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని కోరుతూ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మంగళవారం వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్షావలి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలతో రాజ్యాంగం కల్పించిన ప్రజా సంక్షేమాన్ని, దేశ అభివృద్ధిని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏళ్ళ తరబడి జైల్లో విచారణలు, బెయిళ్లు లేకుండా ఏళ్ళ తరబడి ఉంటున్న వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుని విడుదల చేయాలన్నారు. రాజకీయ ఖైదీల విడుదలకై ఈ నెల 29న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేషా, సావిత్రి, సునీత, చంద్రమౌళి, మోనార్, తదితరులు పాల్గొన్నారు.



## నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక చర్యలు : కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా కేంద్రంలో వనమహోత్సవంలో భాగంగా జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా, రత్నాకర్ జహోర, విశాల్ బట్టు, డిఎఫ్ఒ కలిసి జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మొక్కలు నాటేందుకు అనువైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజలు, స్థానిక సంస్థల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. వాటికి క్రమం తప్పకుండా నీరు అందించడం, ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం, మొక్కల పెరుగుదలను పర్యవేక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. వనమహోత్సవం కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు విస్తృతంగా, చేపట్టాలని తెలిపారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం ట్రీ గ్రార్డులు ఏర్పాటు చేయడం, మొక్కల పెరుగుదలను పర్యవేక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిర్ణీత సమయంతో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో అటవీ శాఖ అధికారులు రత్నాకర్ చౌహరి, అటవీ సురక్షణాధికారి, డైరెక్టర్ జనరల్, విశాల్ బత్తులు జిల్లా అటవీఅధికారి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి సాగుకు ఎకరాకు 8వేలు సబ్సిడీ

### ఉద్యానవన జిల్లా అధికారి సత్తార్

**ప్రజాపక్షం/వికారాబాద్:**జిల్లాలో ఉల్లి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎకరాలకు రూ.8000ల సబ్సిడీ అందిస్తుదని, ఉల్లి నిల్వ నిర్మాణానికి రూ.1లక్ష సహాయం అందించడం జరుగుతుందని,జిల్లా పట్టు,ఉద్యానవన అధికారి సత్తార్ తెలిపారు. ఉల్లి సాగు సబ్సిడీ ,రైతులు దరఖాస్తు చేసుకోవాడనికి అవసరమైన పత్రాలు 1.పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ బ్యాంక్‌ఖాతా వివరాలు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 29.08.2026 వరకు ఉందని తెలిపారు. గత సంవత్సరం సబ్సిడి తీసుకున్న రైతులకు ప్రస్తుతం వర్తించదని అన్నారు.

## భవనంపై నుండి పడి తాపీ మేస్త్రీ మృతి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ప్రమాదవశాత్తు భవనం ఐదవ అంతస్తుపై పనిచేస్తున్న మల్లాపూర్ నెహ్రూనగర్‌లో నివసించే తాపీ మేస్త్రీ అర్వుల బప్పన్న (50) మృతి చెందిన ఉదంతం నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మంగళవారం ఉదయం ఎప్పటి లాగే హెచ్ఎంటి నగర్‌కు వెళ్లి భవనంపైన పని చేస్తుండగా ప్రమాద వశాత్తు కిందపడి గాయాలకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని పోలీసులు తెలిపారు.



## వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

### నిందితుడి అరెస్ట్.. 4.50 లక్షల ఆభరణం స్వాధీనం

**ప్రజాపక్షం/మెదక్ :** వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కెళ్లిన చోరీ కేసును మెదక్ టౌన్ పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి చోరీకి గురైన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మెదక్ పట్టణ సిఐ మహేష్ తెలిపారు. చోరీకి సంబంధించిన వివరాలను మంగళవారం సిఐ మహేష్ వెల్లడించారు. సాయి నగర్ కాలనీకి చెంది న బాలెశెట్టి సులోచన (68) ఈ నెల 22/23వ తేదీ అర్ధరాత్రి ఇంట్లో ఒంటరిగా ఉండగా, గుర్తుతెలియని వ్యక్తి తలుపు కొట్టి లోపలికి ప్రవేశించాడు. ఆమె మెడలోని సుమారు నాలుగు తులాల రెండు వరుసల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లేందుకు ప్రయత్నించగా, సులోచన గట్టిగా పట్టుకోవడంతో గొలుసు తెగిపోయింది. కొంత బంగారం ఆమె చేతిలో మిగలగా, మిగిలిన ఆభరణంతో నిందితుడు పరారయ్యాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. సోమవారం దయారా విధిలో వాహన తనిఖీల సందర్బంగా అనుమానాస్పదంగా కనిపించిన హవేలీ ఘనపూర్ మండలం తోగిట గ్రామానికి చెందిన చాకలి మొగులయ్య (34) ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి సుమారు రూ. 4.50 లక్షల విలువైన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సిఐ స్పష్టం చేశారు. వృద్ధురాలిపై జరిగిన చోరీ కేసును వేగంగా ఛేదించిన మెదక్ టౌన్ సిఐ మహేష్, పోలీసు సిబ్బంది మల్లేశం, నర్సింలు, సాయిబాబా, పోలీసు ఉన్నతాధికారులు, పట్టణ ప్రజలు అభినందించారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి.. లక్ష్మీబాయి పేరు పెట్టాలి: వినయ్ కిషోర్



**ప్రజాపక్షం/సైదాబాద్:** స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళలను ముందుండి నడిపించి, ఎన్నోసార్లు జైలు జీవితం గడిపిన స్వాతంత్ర్య సమరయోధురాలు సంగం లక్ష్మీ బాయి పేరును సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి పెట్టాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ కిషోర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మాలక్‌పేట్ ఫైర్‌స్టేషన్ నుంచి సంతోష్‌నగర్ చౌరస్తా వరకు నిర్మించిన స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీ బాయి పేరు పెట్టడం సముచితమని ఆయన అన్నారు. మాతృభూమి విముక్తి కోసం పోరాడిన సంగం లక్ష్మీ బాయి.. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆమె త్యాగాలను గుర్తించి సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీ బాయి పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు జూబ్లీహిల్స్ బిజెపి నేతలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, కాలేజీ విద్యార్థులు దీక్షకి మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, ఉపాధ్యక్షులు గంగరాజు, సీనియర్ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, బదుగు సతీష్, పులి రామ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పవర్ ఉద్యోగులకు సన్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** పవర్ ఎగ్జిబిషన్ విజయవంతం అయ్యేలా కృషి చేసిన ఎస్‌పిడిసిఎల్ అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు, సిబ్బందిని సంస్థ ఎండి జితేష్ పాటిల్ ఘనంగా సన్మానించారు. ఈ మేరకు మింట్‌కంపౌండ్‌లోని ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయంలో సిఎండి జితేష్ పాటిల్ ప్రత్యేకంగా వారిని సన్మానించి జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రదర్శన ఏర్పాట్లు, సందర్శకుల మార్గదర్శనం, సాంకేతిక స్టాల్స్ నిర్వహణ, భద్రతా చర్యలు, సాంస్కృతిక కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు విద్యుత్ రంగంపై అవగాహన కల్పించడం వంటి అంశాల్లో ఉద్యోగులు అంకితభావంతో పనిచేశారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ) వి.శివాజీ, డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్.నరసింహులు, డైరెక్టర్ (కమర్షియల్) చక్రపాణి, డైరెక్టర్ (ఫైనాన్స్) కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాబాటతో పరిష్కారం



**ప్రజాపక్షం/నాంపల్లి:** ప్రజాసమస్యల పరిష్కారం లక్ష్యంగా ప్రజాబాట నిర్వహిస్తున్నట్లు ఎస్‌పిడిసిఎల్ అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో మంగళవారం రెడ్‌హిల్స్ ప్రాంతంలో నిర్వహించిన ప్రజాబాటలో డైరెక్టర్(కమర్షియల్) చక్రపాణి పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులకు తగిన సూచనలు చేశారు. అలాగే రేతిబౌలి సెక్షన్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్(ఆపరేషన్స్) డాక్టర్ ఎన్.నరసింహులు పాల్గొని విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును సమీక్షించారు.

## మహిళా శక్తి చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** పేద మహిళలకు ఇందిరా మహిళాశక్తి చీరలను పంపిణీ చేయడం జరిగింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాటూరి రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మహిళలకి అందేలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళ గ్రూప్ సభ్యులు మహేశ్వరి, యాదమ్మ, జ్యోతి, మంగమ్మ, వసుంధర, తదితరులు పాల్గొన్నారు

## గంగతెప్పోత్సవ ఆహ్వానం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** అంగరంగ వైభవంగా ఆదివారం జరిగే గంగతెప్పోత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధిత కమిటీ కోరింది. ఈ మేరకు గంగతెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్ బాబు గంగపుత్ర, ప్రధాన కార్యదర్శి పూస నరసింహ్మ బెస్త అధ్వర్యంలో కమిటీ సభ్యులు దానం నాగేందర్‌ను కలిసి ఉత్సవంలో పాల్గొనాలని ఆత్మీయ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా గంగతెప్పోత్సవ బ్యానర్ ఆవిష్కరించారు.

# బిజెపి సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయ్!

- కులగణన చేసే వరకూ వదిలిపెట్టం
- బిపి మండల్ జయంతిలో జాజుల ఫైర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జనగణనలో బిసి లెక్కలు తీయని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. బిసి కులగణన చేసేవరకు వదిలిపెట్టబోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్ గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద బిసి రిజర్వేషన్ల ఆధ్యులు బిపి మండల్ 109వ జయంతి కార్యక్రమం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ తదితర నేతలు బిపి మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం జాజుల మాట్లాడుతూ బిసి కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం బిసిలకు విద్య, రాజకీయ, ఉద్యోగాల్లో రిజర్వేషను కల్పించాలని బిపి మండల్ సిఫారసు చేసి 80 ఏళ్లు గడిచినా నేటికీ అమలు కాకపోవడం అగ్రకుల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఫీజుల స్కీంపై దీక్ష చేపట్టడం అభినందనీయమని, కానీ, బిసి కులగణన, బిసిల 42శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేయాలని సవాల్ విసిరారు. బిజెపి బిసి నేతలు బిసి కులగణన చేపట్టేలా ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసిల లెక్కలు తేలితే అదేస్థాయిలో రిజర్వేషన్లు పెంచాల్సి ఉంటదని కేంద్రం భయపడుతుందన్నారు. బిసిల అభివృద్ధి దేశాభివృద్ధిగా చూడాలని కోరారు. మధుసూదనాచారి మాట్లాడుతూ బిసి కులగణన చేపట్టకపోతే దేశవ్యాప్తంగా బిసిలు తిరుగుబడతారని హెచ్చరించారు. బిసిల పోరాటానికి బిఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో బిసి నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, కుందారం గణేశ్ చారి, కనకాల శ్యామ్ కుర్మా, మహేశ్ యాదవ్, ఉప్పరి శేఖర్ సగర, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వాయు నాణ్యత పెంచాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** యాంత్రిక రోడ్డు స్వీపర్ల సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా రోడ్డు దుమ్మును తగ్గించి, వాయు నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. ఈ మేరకు పిసిబి ప్రధాన కార్యాలయంలో క్యూర్ ప్రాంతంలో యాంత్రిక రోడ్డు స్వీపర్ల ద్వారా సిల్ట్ తొలగింపు సామర్థ్యంపై పిసిబి, ఐఐటి హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయన ఫలితాలను సంబంధిత అధికారులకు వివరించారు. పిసిబి, ఐఐటి కాన్పూర్ నిర్వహించిన అధ్యయనంలో రోడ్డు దుమ్ము పిఎం10లో సుమారు 32 శాతం, పిఎం 2.5లో 26 శాతం వరకు కారణమవుతున్నట్లు గుర్తించారు. అధ్యయనం ప్రకారం, రోడ్లపై సిల్ట్ పేరుకుపోవడం 5 నుంచి 15 గ్రాముల వరకు ఉంది. అయితే, ఇది ఆదర్శంగా 3 గ్రాముల కంటే తక్కువగా ఉండాలి. ఈ సందర్భంగా ఐఐటి హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఖురేషీ యాంత్రిక రోడ్డు స్వీపర్ల పనితీరు, వాటి నిర్వహణ విధానం, పనితీరును మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. పిసిబి చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి.రఘు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ అధ్యయనం ఎంతో ముఖ్యమైనదని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సిఎపి నోడల్ అధికారి డా.డి.ప్రసాద్, ఇఎస్ జయశ్రీ వాయు కాలుష్య మూలాల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలను వివరించారు. ఇదిలాఉండగా.. బల్దియా అదనపు కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్) రవి కిరణ్, ఎంఎంసి అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, సిఎంసి అదనపు కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి యాంత్రిక రోడ్డు స్వీపర్ల నిర్వహణలో ఎదురవుతున్న ప్రాయోగిక సమస్యలను వివరించారు. అధ్యయన ఫలితాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వారు స్వాగతిస్తూ, ఇకపై యాంత్రిక రోడ్డు స్వీపర్లలో పనితీరు ఆధారిత నిబంధనలు, ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.జిహెచ్ఎంసి, సిఎంసి, ఎంఎంసి, టిజిఐఐసి, హెచ్ఎండిఎ, సిడిఎంఎ సంస్థలకు చెందిన సుమారు 100 మంది అధికారులు పాల్గొన్నారు.

## ఫొటో జర్నలిస్టులకు చరిత్ర గమనం మార్చే శక్తి



వార్తా చిత్రాల ప్రదర్శనను తిలకించిన పొన్నాల

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** చరిత్ర గమనాన్ని మార్చే శక్తి ఫొటో జర్నలిస్టులకు ఉంటుందని మాజీ మంత్రి, పొన్నాల ఫౌండేషన్ చైర్మన్ పొన్నాల లక్ష్మయ్య అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఏర్పాటు చేసిన ఉత్తమ వార్త చిత్రాల ప్రదర్శన– 2026ను మంగళవారం పొన్నాల లక్ష్మయ్య తిలకించి, మాట్లాడారు. రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల కృషితో అద్భుతమైన ఛాయాచిత్రాల ప్రదర్శన అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, ఉపాధ్యక్షులు టి.కిశోర్ సింగ్, పి.రామ్మూర్తి, కోశాధికారి కె.అనిల్ కుమార్ పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అడ్డు

కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో అమెరికా పర్యటనకు వెళ్లే సిఎం రేవంత్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం అనుమతిని నిరాకరించి తెలంగాణ అభివృద్ధికి మోకాలడ్డు వేసిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి దేవని సతీశ్ మాదిగ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైజింగ్‌లో భాగంగా విదేశీ యూనివర్సిటీలను హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఆహ్వానిస్తే ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద విద్యార్థులు ప్రపంచంలోని పెద్ద యూనివర్సిటీల్లో చదివించవచ్చని సిఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తుండటం శుభపరిణామమన్నారు. కానీ, కేంద్రం అడ్డుకోవడం విచారకరమన్నారు. కెటిఆర్, హరీశ్‌రావు, కవిత పిల్లలు విదేశాలకు వెళ్లి చదువుకోవాలి, కానీ, పేద విద్యార్థులు వెళ్లకూడదని దళిత వర్గానికి చెందిన ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ లాంటి నేతలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఫ్యూచర్ సిటీని నిర్మించి సిఎం రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోవడం ఖాయమన్నారు. ప్రతిపక్ష నేతల చిల్లర మాటలు మాని సిఎం రేవంతన్నకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

## ఏషియన్ గేమ్స్‌కు ఎస్‌సిఆర్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) స్టార్ అథ్లెట్, ఎస్‌సిఆర్ ప్రధాన కార్యాలయంలోని స్టోర్స్ విభాగంలో జూనియర్ క్లర్క్‌గా పనిచేస్తున్న జ్యోతి యర్రాజీ 2026 ఏషియన్ గేమ్స్‌లో భారత్ తరఫున పోటీ పడనున్నారు. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ విభాగంలో భారత జట్టుకు ఆమె ఎంపికయ్యారు.జపాన్‌లోని ఐచి నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు 20వ ఏషియన్ గేమ్స్ జరగనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల్లో జ్యోతి యర్రాజీ భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు.గతంలోనూ జాతీయ క్రీడలు, ఏషియన్ గేమ్స్‌లో భారత్ తరఫున పాల్గొని దేశానికి, భారతీయ రైల్వేలకు జ్యోతి యర్రాజీ పేరు తీసుకొచ్చారు. తాజాగా మరోసారి ఏషియన్ గేమ్స్‌కు ఎంపిక కావడంపై ఎస్‌సిఆర్ అధికారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు విజయాభినందనలు తెలిపారు.

# కార్వాన్‌లో ‘సర్’ నోటీసుల పంపిణీ తనిఖీ చేసిన ఆర్‌వి.కర్ణన్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నోటీసుల పంపిణి తీరును జిహెచ్ఎంసి కమిషనర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ నెంబర్లు 94, 95లను సందర్శించిన ఆయన బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు), బిఎల్ఓ సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓ, ఈఆర్ఓలతో సమావేశమై నోటీసుల పంపిణి పురోగతిని సమీక్షించారు. ఎస్ఐఆర్ నోటీసులు ఆలస్యం లేకుండా ప్రతి ఓటరికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అలాగే అవసరమైన పత్రాలు, దరఖాస్తు ఫారాల సమర్పణపై ఓటర్లకు సరైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక నివాసితులతో మాట్లాడిన కమిషనర్, ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాధాన్యతను వివరించారు. నోటీసులో ఉన్న వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, నిర్దేశిత గడువులోపు అవసరమైన పత్రాలు, సమాచారాన్ని సమర్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## సుమంత్ కేసులో జూబ్లీహిల్స్ సిఐపై సస్పెన్షన్ వేటు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మంత్రి కొండా సురేఖ మాజీ ఒఎస్‌డి సుమంత్ వ్యవహారంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సిఐ ముత్తు యాదవ్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. కేసు నమోదు, నిందితుడిని అదుపులోకి తీసుకునే విషయంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.సుమంత్‌పై ఫిర్యాదు అందిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం జరిగిందని, కేసు నమోదైన అనంతరం ఆయనను పట్టుకునే విషయంలోనూ పోలీసులు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని ఉన్నతాధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై సమీక్ష అనంతరం సిఐ ముత్తు యాదవ్‌ను చేసినట్లు సమాచారం.సుమంత్‌పై రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదైంది. తొలుత మేడిపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, అనంతరం కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.కేసు నేపథ్యంలో సుమంత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆయన కోసం జూబ్లీహిల్స్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టగా, టాస్క్‌ఫోర్స్ కూడా మరో బృందంతో అన్వేషణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

**మూడు వారాలకే సస్పెన్షన్**

ఓ యువతితో సహజీవనం చేసి రూ.2కోట్లు దోచుకున్న ఉదంతంలో ఇటీవలే జూబ్లీహిల్స్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి సస్పెండ్‌కు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత అత్తాపూర్ డిఐగా విధులు నిర్వహిస్తున్న ముత్తు యాదవ్ సుమారు మూడు వారాల క్రితమే జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే కీలక కేసులో విధి నిర్వహణలో నిర్లక్ష్య ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురికావడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తులో మరిన్ని శాఖాపరమైన చర్యలు ఉండే అవకాశం ఉందని సమాచారం.

## పాలిటెక్నిక్ విద్యపై అధ్యయనానికి తెలంగాణ రక్షణ సేన కమిటీ ఏర్పాటు

వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్య కొనసాగింపు, దాని ఆవశ్యకతపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పలువురు విద్యావేత్తలు, పార్టీ నాయకులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేశారు. పాలిటెక్నిక్ విద్యను ప్రస్తుత విధానంలోనే కొనసాగించడం, జి.ఓ 97 అమలుతో తలెత్తే పరిణామాలు, శక్తి శాఖ పరిధిలోకి పాలిటెక్నిక్ విద్యను చేర్చితే ఎదురయ్యే పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కవిత ప్రకటించారు. విద్యారంగంలో అనుభవం ఉన్న పలువురు విద్యావేత్తలను, తెలంగాణ రక్షణ సేన నాయకులను కమిటీ సభ్యులుగా నియమించినట్లు ఆమె తెలిపారు. కమిటీ సభ్యులు సమగ్ర అధ్యయనం చేపట్టి వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆమె సూచించారు. కమిటీలో దూగుంట్ల నరేశ్ ప్రజాపతి, మోరం వీరభద్రారావు, సురభి, కొంగర ధరణి రాణి, కోట్ల మహేందర్ రెడ్డి, ఊదరి చంద్రమోహన్ గౌడ్, నడిపల్లి వెంకటేశ్వర్ రావు సభ్యులుగా ఉన్నారు.

## పాత అక్రిడిటేషన్ కార్డులకు సెప్టెంబర్ 15 వరకు గడువు

***కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు***

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గతంలో అక్రిడిటేషన్ కార్డులు పొందిన అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల పాత కార్డులను సెప్టెంబర్ 15 వరకు కొనసాగించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కొత్తగా అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి, గతంలో కార్డులు లేని వారికి ప్రస్తుత దశలో మధ్యంతర ఉపశమనం కల్పించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. అక్రిడిటేషన్ అర్హతలకు సంబంధించి ప్రభుత్వం గత ఏడాది జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ హైటెక్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, క్రియేటివ్ ఇండియా బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. కేబుల్, శాటిలైట్ చానళ్ల మధ్య వర్గీకరణపై పిటిషనర్ల తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదిస్తూ.. ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సమర్పించిన 535 మంది సభ్యుల జాబితాలో 268 మందికే గతంలో అక్రిడిటేషన్ కార్డులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వారిలో కొందరికి ఇప్పటికే కార్డులు జారీ చేశామని, కేబుల్ చానల్ కేటగిరీలో అర్హత ఉన్నవారికి నిబంధనల ప్రకారం కార్డులు ఇచ్చామని వివరించారు. అనేక మంది అసలు అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేయలేదన్నారు. పిటిషనర్ తరపు న్యాయవాది మూడు వాయిదాల తర్వాత సమస్యను ప్రస్తావించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. సమస్య ఉంటే ముందుగానే కోర్టు దృష్టికి తీసుకురావాల్సిందని పేర్కొంది. రాష్ట్రంలో దాదాపు 20 వేల మంది మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు ప్రభుత్వం తెలిపిన విషయాన్ని ప్రస్తావించిన ధర్మాసనం.. పిటిషన్లపై తుది వాదనలు వింటామని పేర్కొంటూ విచారణను సెప్టెంబర్ 15కు వాయిదా వేసింది.

## పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు

నేడు మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీ

**ప్రజాపక్షం/చార్మినార్:** మిలాద్ ఉన్ నబీ (ముహమ్మద్ ప్రవక్త జన్మదినం) సందర్భంగా బుధవారం నిర్వహించనున్న శాంతి ర్యాలీ దృష్ట్యా విస్తృత ట్రాఫిక్ ఆంక్షలు.. మళ్లింపులు విధించినట్లు హైదరాబాద్ జాయింట్ సిపి (ట్రాఫిక్) డి.జోయల్ డేవిస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని వెల్లడించారు. ఈ క్రమంలోనే ప్రధాన ర్యాలీలు సాగే మార్గాలైన.. ఫలక్‌నుమా నుంచి చార్మినార్ మీదుగా వోల్టా హోటల్ వరకు.. యాహియా పాషా దర్గా నుంచి వోల్టా హోటల్ వరకు..మక్కా మసీదు నుంచి నాంపల్లి హజ్ హౌస్ వరకు.. పత్తర్‌గట్టి నుంచి అలీజా కోట్లా వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. కావున విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సహకరించి, శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని జాయింట్ సీపీ జోయల్ కోరారు. అత్యవసర పరిస్థితులు లేదంటే ప్రయాణ సాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెం: 9010203626లో సంప్రదించాలని సూచించారు.

## ధర్నాను విజయవంతం చేయాలి: టిజిఒ అసోసియేషన్



ప్రజాపక్షం/నాంపల్లి: ఉద్యోగుల సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 27న నిర్వహించనున్న మహాధర్నాకు ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీఓ) అసోసియేషన్ పిలుపునిచ్చింది. టీజీఓ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబి కృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పిలుపు మేరకు మహాధర్నాలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని టీజీఓ అసోసియేషన్ జలమండలి యూనిట్ ప్రధాన కార్యదర్శి చంద్రజ్యోతి కోరారు.ఉద్యోగుల సమస్యలు, హక్కులు, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లేందుకు ఈ మహాధర్నా కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. ఈ మేరకు ఆయన అంబర్‌పేట్ డివిజన్‌లోని ఆకాశ్‌నగర్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించి స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్ యాదవ్, రామారావు యాదవ్, లింగారావు, మహమ్మద్ రఫీక్, యూసఫ్ బాబా, మొహమ్మద్ అమీర్, ఇబ్రహీం, రాహుల్ ముదిరాజ్, హరీష్, ఫయాజ్, అఫ్రోజ్, అధికారులు పాల్గొన్నారు.

# బిహార్‌లో ఉద్రిక్తత

- విద్యార్థులు, పోలీసులకు మధ్య ఘర్షణ
- లాఠీచార్జ్, వాటర్ కెనాన్లతో చెదరగొట్టిన పోలీసులు
- 5 కిలోమీటర్ల మార్గంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- ముఖ్యమంత్రి నివాసం ఘెరావ్‌కు విద్యార్థులు పిలుపు



**పాట్నా :** బిహార్‌లో విద్యార్థుల నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు వేలాది మంది విద్యార్థులు మంగళవారం ఆయన నివాసానికి ర్యాలీగా వెళ్లారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు, పోలీసులకు మధ్య తోపులాటలు, ఘర్షణ జరిగింది. విద్యార్థులు రాళ్లు రువ్వగా, వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. వాటర్ కేన్లను ఉపయోగించారు. నిరసనకారులలో ఎక్కువ మంది వచ్చే నెలలో బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బిపిఎస్‌సి) నిర్వహించనున్న ఉపాధ్యాయ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉన్నారు. వీరు రాత పరీక్షలను 'ప్రిలిమ్స్', 'మెయిన్స్' అనే రెండు దశల్లో కాకుండా ఒకే దశలో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ 'ముఖ్యమంత్రి నివాస ముట్టడి' (ఘెరావ్) కార్యక్రమానికి పిలుపునిచ్చారు. చాలా కాలంగా అనేక రాజకీయ, సామాజిక ఉద్యమాలకు వేదికగా నిలిచిన చారిత్రక గాంధీ మైదాన్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీలో, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ వంటి సంస్థలకు చెందిన వామపక్ష కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల ర్యాలీ నేపథ్యంలో గాంధీ మైదాన్ నుండి ముఖ్యమంత్రి నివాసం వరకు సుమారు 5 కిలోమీటర్ల మార్గంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ర్యాలీ ప్రారంభ స్థలమైన జెపి గోలంబర్ వద్ద పోలీసులు వాటర్ కెనాన్లను ప్రయోగించినప్పటికీ, నిరసనకారులు వాటికి ఎదురొడ్డి ఎంతో ఉత్సాహంగా నిరసనను కొనసాగించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన 'జెన్ జీ నిరసనల'కు మద్దతుగా గత నెలలో జరిగిన 'రాజ్ భవన్ మార్చ్' సమయంలో కనిపించిన దృశ్యాలే మరోసారి పునరావృతమయ్యాయి. నిరసనకారులు బారికేడ్లను దాటుకుని 'డాక్ బంగ్లా క్రాసింగ్'కు చేరుకున్నారు. అక్కడ పోలీసులు వారిపై లాఠీచార్జ్ చేశారు. వీటికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అక్కడ చాలా మంది ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు కూడా రువ్వారు. ఆ వీడియోలో, ఒక యువ అధికారి నిరసనకారుడిని చెంపదెబ్బ కొట్టడం కనిపించింది. మరొక క్లిప్‌లో ఒక మహిళా ఆందోళనకారిణి రోడ్డు పక్కన స్పృహ తప్పి పడిపోవడం కనిపించింది. పోలీసులు పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకుని వివిధ ప్రాంతాలకు తరలించారు, అయితే అదుపులోకి తీసుకున్న వారి సంఖ్య లేదా ఇతర వివరాలు తెలియరాలేదు. గర్దనీ బాగ్ వద్ద గత కొన్ని వారాలుగా ధర్నా చేస్తున్న ఆందోళనకారులను ఉద్దేశించి, సోమవారం నాడు బిపిఎస్‌సి పరీక్షల నియంత్రణాధికారి రాకేష్ కుమార్ సింగ్ 'ఏనుగు బజారులో నడుస్తుంటే కుక్కలు వేలకొద్దీ మొరుగుతాయి' అనే హిందీ సామెతను ప్రయోగించి వారిని కించపరిచారని ఆరోపిస్తూ, నిరసనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
సింగ్ చేసిన వ్యాఖ్యలపై ఆర్‌జెడి వర్కింగ్ ప్రెసిడెంట్ తేజస్వీ యాదవ్ వంటి ప్రతిపక్ష నాయకుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

# ఎల్‌డిఎఫ్ ఐక్యతను దెబ్బతీస్తున్న విజయన్ వ్యాఖ్యలు

- ప్రతిపక్ష ఉపనాయకుడి పదవి తిరస్కృతిపై సిపిఐ విమర్శ
- 'అంతా నేనే' అనే వైఖరి కమ్యూనిస్టు నాయకుడికి తగదు
- 'జనయుగం' వ్యాసంలో సిపిఐ సీనియర్ నేత మోకేరి విమర్శ



**తిరువనంతపురం:** కేరళ శాసనసభలో ప్రతిపక్ష ఉపనాయకుడి పదవిని వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన (ఎల్‌డిఎఫ్)లో కీలక భాగస్వామి భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ)కి ఇచ్చేందుకు ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ (మాజీ ముఖ్యమంత్రి) తిరస్కరించడంతో సిపిఐ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది.విజయన్ చేసిన వ్యాఖ్యలు ఎల్‌డిఎఫ్ ఐక్యతను దెబ్బతీసేవిగా ఉన్నాయని, కూటమి నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని సిపిఐ అధికార పత్రిక "జనయుగం"లో రాసిన ఒక వ్యాసంలో పార్టీ సీనియర్ నాయకుడు సత్యన్ మోకేరి విమర్శించారు.
సిపిఐకి ప్రతిపక్ష ఉపనాయకుడి పదవి ఇచ్చే విషయంపై వివిధ స్థాయిల్లో ఒకవైపు చర్చలు జరుగుతున్న సమయంలో విజయన్ గడిచిన శనివారం పత్రికాగోష్ఠిలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు గురయ్యాయి. ఉపనాయకుడి పదవి సిపిఐ(ఎం)కు మాత్రమే దక్కుతుందని, తమపార్టీ నాయకుడి పేరును మాత్రమే తాను శాసనసభ స్పీకర్‌కు సిఫార్సు చేస్తానని, ఈ మేరకు లేఖ రాయడం మాత్రమే మిగిలిందని విజయన్ వ్యాఖ్యానించారు. ఒకవైపు చర్చలు జరుగుతున్న సమయంలో సిపిఐ(ఎం) నాయకుడి పేరును స్పీకర్‌కు సిఫార్సు చేస్తానని చేసిన ప్రకటన వెనుక ఉన్న ప్రేరేపణ ఏమిటని మోకేరీ తన వ్యాసంలో ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకుడి ప్రకటన ఎల్‌డిఎఫ్‌ను పటిష్టం చేయడంకో సమా?ఈ విధంగా ఎల్‌డిఎఫ్‌ను బలహీనపరిచే ప్రకటన ఆయన చేయడానికి పురిగొల్పినదేమిటి? అని ప్రశ్నించారు. కూటమి రాజకీయాలలో సమాన భాగస్వామ్యం ఉండాల్సిన అవసరం ఉందని, పరస్పర గౌరవం ఉండాలని,ఇరు భాగస్వామ్యపార్టీల సైద్ధాంతిక వైఖరుల స్వతంత్రతకు గుర్తింపు ఉండాలని ఆ వ్యాసంలో రాశారు. నిర్ణయాలను చర్చలు,ఏకాభిప్రాయాల ద్వారా తీసుకోవడానికి బదులుగా ఏకపక్షంగా రుద్దకూడదన్నారు. కూటమి రాజకీయాలలో కమ్యూనిస్టులకు ఉండాల్సిన రాజకీయ పరిపక్వతను ఉన్నతస్థాయిలో నిలబెట్టడం ప్రతిపక్ష నాయకుడిలో కొరవడటం విచారించదగిన విషయమని వ్యాసంలో రాశారు.
'కేరళ శాసనసభలో ప్రతిపక్ష ఉపనాయకుడి పదవిలో ఎవరిని నియమించాలనే విషయం ఒక రాజకీయ అంశం,ప్రతిపక్ష నాయకుడు ఈ విషయాన్ని తనకు తానుగా సొంతంగా నిర్ణయించలేరు, ఈ అంశం రెండు పార్టీ జాతీయ నాయకత్వం పరిశీలనలో ఉంది, ఇరుపార్టీల మధ్యా వివిధ స్థాయిల్లో కూడా చర్చ కొనసాగుతోంది' అని మోకేరి తన వ్యాసంలో పేర్కొన్నారు. ఈ విషయంలో విజయన్ వ్యాఖ్యలు పూర్తిగా కూటమి నిబంధనలను, మర్యాదలను ఉల్లంఘించేవిగా ఉన్నాయి, కూటమి రాజకీయాలలో ఆశించదగిన రాజకీయ నైతికత కూడా లోపించిందని ఆయన వ్యాఖ్యలే ప్రతిబింబించాయి" అని వ్యాసంలో రాశారు.అనేక పార్టీలతో ఒక ఉమ్మడి రాజకీయ లక్ష్యసాధన కోసం ఒక కూటమి ఏర్పడుతుంది, అంతా నేనే నిర్ణయిస్తాను,అంతా నాదే" అనే ధోరణి కూటమి సమష్టి పనితీరుకు ఎంతమాత్రం దోహదపడదు,పైగా ఇది ఒక కమ్యూనిస్టు నాయకుడికి అస్సలు సరిపడదు అని రాశారు.
ఇదిలా ఉండగా, సిపిఐ(ఎం) నాయకుడు,మాజీ మంత్రి వి.శివన్‌కుట్టా మోకరేపై ప్రతి విమర్శలు చేశారు. కూటమిలో అంతర్గత విభేదాలను మీడియా ద్వారా బహిర్గతం చేయడం రాజకీయ మర్యాదకు వ్యతిరేకమని పేర్కొన్నారు. విజయన్ వైఖరి పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధమైనదని సమర్థించారు. మోకేరీ వ్యాసం పార్టీ ఉమ్మడి నిర్ణయం ఆధారంగా రాసినదా అనే విషయంపై వివరణ ఇవ్వాలని సిపిఐని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం కూడా విజయన్ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శించారు. ఇది ఆయన హోదాకు సరిపడినవి కాదన్నారు. సిపిఐ ఆత్మగౌరవానికి వెలకట్టే హక్కు ఏ నాయకుడికీ లేదన్నారు. ఇది వివాదాస్పద విషయమని, చర్చల నిమిత్తం దీనిని పక్కన పెట్టామన్నారు.

# భారత్‌లో పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధులు

**98 శాతం కేసులకు హెచ్1ఎన్1 వైరస్ రకమే కారణం: ఐసిఎంఆర్**

**న్యూఢిల్లీ :** భారతదేశంలో ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న శ్వాసకోశ వ్యాధులకు హెచ్1ఎన్1 వైరస్ రకమే ప్రధాన కారణమని భారత వైద్య పరిశోధన మండలి (ఐసిఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్ మంగళవారం వెల్లడించారు. తాము పరీక్షించిన ఇన్‌ఫ్లూయెంజా–ఎ కేసుల్లో దాదాపు 98 శాతం ఈ వైరస్ రకానికే చెందినవని ఆయన తెలిపారు. వైరస్‌ల వ్యాప్తిని ఎప్పటికప్పుడు కనిపెట్టేందుకు, భారతదేశం ఒక బహుళ అంచెల, రియల్ టైమ్ వ్యాధి నిఘా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఈ నిఘా వ్యవస్థ రాష్ట్ర స్థాయి డేటాను 'సమీకృత ఆరోగ్య సమాచార వేదిక' (ఐహెచ్ఐపి), 'జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం(ఎన్‌సిడిసి)తో అనుసంధానం చేస్తుందని తెలిపారు. దీనితోపాటు ఐసిఎంఆర్ నేరుగా ఆసుపత్రుల నుంచి సేకరించిన శాంపిల్స్ ద్వారా హెచ్1ఎన్1 వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల పెరుగుదలను తక్షణమే గుర్తించి, నివారణ చర్యలు తీసుకుంటుందని అన్నారు. 'దేశంలో ఏ వైరస్ ఎలా వ్యాప్తి చెందుతుందో మనకు ఎలా తెలుస్తుంది? కొవిడ్ తర్వాత, భారతదేశంలో ఏ సమయంలో ఏం జరుగుతుందో రియల్ టైమ్‌లో గుర్తించే సామర్థ్యాన్ని మనం పెంచుకున్నాం. మేము బహుళ స్థాయిల్లో నిఘా పెడతాం. మొదట ఐహెచ్ఐపి, ఎన్‌సిడిసి నిఘా ద్వారా అన్ని రాష్ట్రాల నుంచి ఇన్ఫెక్షన్ల సమాచారం వస్తుంది. దాన్ని మేము తీసుకుంటాం. వారి ల్యాబ్‌ల నుంచి వచ్చిన నివేదికలు కూడా మాకు అందుతాయి. ఇవి కాకుండా, ఈ హెచ్1ఎన్1 వైరస్ లాంటి ప్రతి సిండ్రోమ్‌లను కనిపెట్టడం కోసం, మేము దేశమంతటా 73 ల్యాబ్‌లు/ ఆసుపత్రుల ద్వారా ఐసిఎంఆర్ సెంటినెల్ నిఘాను ఏర్పాటు చేశాం. ఇది ఎన్‌సిడిసి కంటే పై స్థాయిలో జరుగుతుంది' అని భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్ తెలిపారు.

**విపరీతంగా పెరుగుతున్న కేసులు**

ఇతర శ్వాసకోశ వైరస్‌లతో పోలిస్తే హెచ్1ఎన్1 ఇన్ఫెక్షన్లు దేశవ్యాప్తంగా విపరీతంగా పెరుగుతున్నాయని రాజీవ్ బాల్ తెలిపారు. అదే సమయంలో కొవిడ్19 కేసులు స్థిరంగా తగ్గుముఖం పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 'ప్రస్తుతం శ్వాసకోశ నిఘా ప్రకారం, హెచ్1ఎన్1 (ఇన్‌ఫ్లూయెంజాఏ) ఎక్కువగా వ్యాప్తిలో ఉంది. మనుషులకు ఇన్‌ఫ్లూయెంజా–ఎ, ఇన్‌ఫ్లూయెంజా –బి అనే రెండు రకాలు వస్తాయి. ఇన్‌ఫ్లూయెంజా–ఎలో మేము ఎక్కువగా చూస్తున్నది హెచ్1ఎన్1 వైరస్. ఇది సుమారు 9798 శాతంగా ఉంది. కాగా హెచ్3ఎన్2 రకం వైరస్ కేవలం 2 నుంచి 3 శాతం మాత్రమే ఉంది. దీనితోపాటు విక్టోరియా లీనియేజ్‌కి చెందిన ఇన్‌ఫ్లూయెంజాబి కూడా వ్యాప్తిలో ఉంది. ఇందులో రెండు రకాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఒక్కటి మాత్రమే వ్యాప్తిలో ఉంది. అది కూడా అంత ఎక్కువగా లేదు. హెచ్1ఎన్1 మాత్రమే ప్రధానంగా ఎక్కువగా వ్యాప్తిస్తోంది. మూడోది సార్స్‌కోవ్2 (కొవిడ్19) కేసులు అంతకు ముందు కొద్దిగా ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పుడు అవి తగ్గుముఖం పడుతున్నాయి' అని భారత వైద్య పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ రాజీవ్ బాల్ చెప్పారు. కాగా, దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్‌ఫ్లూ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ సంఖ్య 2,300 దాటింది. ఈ ఏడాది ఢిల్లీలో ఇప్పటివరకు దాదాపు మూడు వేల ఇన్‌ఫ్లుయెంజా కేసులు నమోదయ్యాయని.. వాటిలో 2,308 హెచ్1ఎన్1 కేసులు ఉన్నాయని ఢిల్లీ వైద్యశాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ వెల్లడించారు. అయితే ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని ఆయన పేర్కొన్నారు.

# విమాన పైలట్లకు ఏడాది పొడవునా డోప్ టెస్టులు


**న్యూఢిల్లీ :** విమాన పైలట్లకు ఏడాది పొడవునా యాదృచ్ఛిక ప్రాతిపదికన డోపింగ్ పరీక్షలు నిర్వహించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. పైలట్ల మత్తు పదార్థాల పరీక్షల ప్రమాణాలను మరింత పటిష్ఠం చేసేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) సంబంధిత వర్గాలతో చర్చలు జరుపుతోందని మంత్రి మంగళవారం తెలిపారు. ప్రస్తుతం, మొత్తం పైలట్ నెట్‌వర్క్‌లో 10 శాతం మందికి (డ్రగ్ టెస్టులు) నిర్వహించాలని నిబంధనలు చెబుతున్నాయి, కానీ ఏడాది పొడవునా నిర్వహించేందుకు డిజిసిఎ సంప్రదింపులు జరుపుతోందన్నారు. దీనికి సంబంధిత వర్గాలన్నీ ఎలా స్పందిస్తాయో చూడాలన్నారు. ఫుకెట్–ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానంలో అకస్మాత్తుగా విమానం ఎత్తు కోల్పోయిన ఘటనలో, ఆ విమాన కెప్టెన్‌కు గంజాయి పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో, పైలట్లు మాదకద్రవ్యాలు వాడే అవకాశం ఉందనే విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం, పైలట్లకు డ్రగ్ టెస్టులు యాదృచ్ఛిక ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఏటా 10 శాతం పైలట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు తదితరులకు డోపింగ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుత నిబంధనలను సమీక్షించి, భవిష్యత్తు కోసం మరింత కఠినమైన విధానాన్ని తీసుకురావడానికి రెగ్యులేటర్ డిజిసిఎ ప్రస్తుతం సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరుపుతోందని నాయుడు మంగళవారం తెలిపారు. వివిధ వాణిజ్య విమానయాన సంస్థలలో 12,000 మందికి పైగా పైలట్లు ఉన్నారు. ఫుకెట్–ఢిల్లీ విమాన ప్రమాదం నేపథ్యంలో, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపి) ఆగస్టు 18న, తమ డ్రగ్ టెస్టింగ్ ఫ్రేమ్‌వర్క్ కింద ప్రస్తుతం ఉన్న మూత్ర ఆధారిత స్క్రీనింగ్‌తో పాటు అనుబంధ పద్ధతిగా నోటి ద్రవ పరీక్షను కూడా పరిగణించాలని డిజిసిఎను కోరింది. పైలట్లు, ఇతర సిబ్బందికి యాదృచ్ఛిక డ్రగ్ టెస్టింగ్‌ను ప్రస్తుత 10 శాతం నుండి 25 శాతానికి పెంచాలని కూడా ఎఫ్ఐపి కోరింది.

# ట్రస్ట్ బాధ్యతలు యువత చేపట్టాలి

- ట్రస్ట్ బాధ్యతలు యువత చేపట్టాలి
- ఊహాగానాలకు దారితీసిన కేంద్రమంత్రి గడ్కరీ వ్యాఖ్యలు
- రాజకీయంగా తప్పుకుంటున్నారన్న మీడియా వ్యాఖ్యలను తోసిపుచ్చిన మంత్రి కార్యాలయం

**నాగ్‌పూర్ :** తన ట్రస్ట్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాల బాధ్యతను యువత స్వీకరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. అయితే ఆయన వ్యాఖ్యలు ఊహాగానాలకు దారితీశాయి. కొన్ని మీడియా సంస్థలు దీనిని ఆయన ప్రజా జీవితం నుండి తప్పుకునే సంకేతంగా చిత్రీకరించగా, గడ్కరీ కార్యాలయం వాటిని త్రోసిపుచ్చింది. మంత్రి వ్యాఖ్యలకు రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదని, గిరిజన ప్రాంతాల్లో 'ఏకల్ విద్యాలయాల'ను నిర్వహిస్తున్న తన సొంత సంస్థ 'లక్ష్మణరావు మంకర్ ట్రస్ట్' కార్యకలాపాల గురించే ఆయన ప్రత్యేకంగా మాట్లాడారని పేర్కొంది. ఆ సందర్భంలో, తాను గతంలో మాదిరిగా ఎక్కువ పనిభారాన్ని మోయలేనని, మరింత బాధ్యతను స్వీకరించే అవకాశాన్ని యువతకు కల్పించాలని గడ్కరీ అన్నారు. 'ఆయన వ్యాఖ్యలు స్పష్టంగా ట్రస్ట్ నిర్వహణ, భవిష్యత్తు నాయకత్వానికి సంబంధించినవి. అయితే, కొన్ని టెలివిజన్ ఛానళ్లు ఆ ప్రకటనను అసలు సందర్భం నుండి వేరు చేసి, రాజకీయ వ్యాఖ్యగా చిత్రీకరిస్తున్నాయి' అని ఆ ప్రకటన పేర్కొంది. నాగ్‌పూర్‌లో కాటోల్‌లో జరిగిన 'ఏకలవ్య ఏకల్ విద్యాలయ శిక్షక్–పర్యేక్షక్ శిక్షణ తరగతుల' (ఉపాధ్యాయులు, పర్యవేక్షకుల శిక్షణా కార్యక్రమం) సమావేశంలో గడ్కరీ ప్రసంగించారు. ఈ సందర్భంగా, గిరిజన ప్రాంతాల్లో అనేక పాఠశాలలను నడుపుతున్న లక్ష్మణరావు మంకర్ ట్రస్ట్ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, ఆ ట్రస్ట్ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ట్రస్ట్ ప్రస్థానం, గిరిజన ప్రాంతాల్లో అది చేస్తున్న సేవల గురించి మాట్లాడుతూ, ట్రస్ట్ సామాజిక కార్యకలాపాల్లో యువత బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. యువతకు మార్గం సుగమం చేసేందుకు తాను ఇకపై క్రియాశీలక పాత్ర నుండి తప్పుకుని వెనుకకు తగ్గుతానని చెప్పారు. దశాబ్దాలుగా ట్రస్ట్ కార్యకలాపాలతో అనుబంధం ఉన్న గడ్కరీ, యువత తమవంతు కృషి చేసేందుకు వీలుగా తాను బాధ్యతల నుండి తప్పుకుంటానని తెలిపారు.

# డిఆర్‌డిఓ మిసైల్ టెక్నాలజీ బదిలీకి రాజ్‌నాథ్ ఆమోదం



**న్యూఢిల్లీ :** డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) అభివృద్ధి చేసిన అన్ని కన్వెన్షనల్ మిసైల్ సిస్టమ్స్‌ను.. ఇండియన్ ఇండస్ట్రీస్ ఫర్ ఇండీజినస్ ప్రొడక్షన్‌కు బదిలీ చేయడానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారికంగా ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. భారత రక్షణ రంగంలో స్వయం సమృద్ధిని సాధించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, స్థానిక తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రక్షణ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది. అర్హత కలిగిన భారతీయ రక్షణ కంపెనీలు ఈ అధునాతన క్షిపణులను దేశీయంగా తయారు చేసే అవకాశం లభిస్తుందని రక్షణ శాఖ తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా పెద్ద రక్షణ సంస్థలకే కాకుండా.. డిఫెన్స్ సప్లై చైన్‌లో భాగస్వామ్యులయ్యే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, ఇతర సాంకేతిక భాగస్వాములకు భారీగా అవకాశాలు లభిస్తాయని వెల్లడించింది.

**31న నేవీలో చేరనున్న ఐఎన్ఎస్ నిపుణ్..**

భారత నౌకాదళానికి మరో అదనపు శక్తి చేకూరనుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఐఎన్ఎస్ నిపుణ్ ఆగస్టు 31న, ముంబయిలోని నావల్ డాక్‌యార్డ్‌లో నావికాదళంలో చేరనుంది. ఇది దేశీయంగా రూపొందిన రెండో డైవింగ్ సపోర్ట్ వెస్సెల్ (డిఎస్‌వి). ఐఎన్ఎస్ నిపుణ్ నౌక పొడవు 118 మీటర్లు కాగా, ఇది సుమారు 8,560 టన్నుల బరువు (డిస్‌ప్లేస్‌మెంట్) కలిగి ఉంటుంది. సముద్రంపై మన నావికా సామర్థ్యాన్ని పెంచేందుకు, తీరానికి దూరంలో, లోతులో అన్వేషణ సాగించడంలో ఐఎన్ఎస్ నిపుణ్ ఉపయోగపడనుంది. భారత్ కొంతకాలంగా చెబుతున్న ఆత్మనిర్భర భారత్ లక్ష్య సాధనలో భాగంగా ఈ నౌక, 80 శాతం దేశీయ సాంకేతికతతోనే రూపొందింది. ఈ నౌకను విశాఖపట్నంలోని హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ (హెచ్ఎస్ఎల్) సంస్థ రూపొందించింది. గత జూలై 30న దీన్ని హెచ్ఎస్ఎల్ సంస్థ ఇండియన్ నేవీకి అప్పగించింది. అప్పటికే పూర్తిస్థాయి నిర్మాణం, ట్రయల్స్ పూర్తి చేసుకుంది. ప్రధానంగా సముద్ర అంతర్భాగంలో కార్యకలాపాల కోసం ఈ నౌకను రూపొందించారు. ఆధునిక డైవింగ్ సిస్టమ్‌తో దీన్ని అభివృద్ధి చేశారు. ఇది డీప్ సి శాచురేషన్ డైవింగ్ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. అందుకోసం ఓ వైపు డైవింగ్ స్టేజ్‌ను ఏర్పాటు చేశారు. ఇది నీటిపైనే తేలియాడుతుంది. కానీ, ఇందులోని డైవర్లు, ఆధునిక రోబోలు, రెస్క్యూ వెహికల్స్ వంటివి అత్యవసర పరిస్థితుల్లో సముద్రంలో డైవింగ్ చేసే సిబ్బందికి సాయం చేయగలదు. వైద్య సాయం అందించగలదు. సబ్‌మెరైన్లను రక్షించే చర్యల్లో పాల్గొని, సబ్‌మెరైన్లకు అండగా ఉంటుంది. నీటిపైన ఉంటూనే, సముద్రం లోపల సాయం అందించడంలో సాయపడుతుంది.

# 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'పై.. దేశవ్యాప్తంగా ప్రచారోద్యమం

**కేంద్ర మాజీ హోం మంత్రి పి.చిదంబరం హెచ్చరిక**

**న్యూఢిల్లీ :** లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు 2029లో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని మంగళవారం సీనియర్ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ హోం మంత్రి పి.చిదంబరం స్పష్టం చేశారు. ప్రతిపాదిత చట్టాన్ని పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో 'రాజ్యాంగ వికృతం' అని అభివర్ణించారు. దీనిపై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్త ప్రచారోద్యమాన్ని చేపడతాయని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వానికి సంబంధించిన 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' బిల్లులను పరిశీలిస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) చైర్మన్ పిపి.చౌదరి రాజ్యాంగాన్ని సవరించి, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ఇస్తే 2029లో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం సాధ్యమవుతుందని చెప్పిన మరుసటి రోజే మాజీ కేంద్ర హోం మంత్రి చిదంబరం దీనిపై స్పందించి ఒక ప్రకటన చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటనను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 2029లో ఏకకాలంలో ఎన్నికలు సాధ్యమవుతాయన్న చౌదరి ప్రకటనను తాను చదివానని చిదంబరం పేర్కొన్నారు. రాజ్యాంగ (129సవరణ) బిల్లు, 2024, కేంద్ర పాలిత చట్టాల (సవరణ) బిల్లు–2024లను పరిశీలించి, వాటిపై సూచనలు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన 31మంది సభ్యులతో కూడిన జాయింట్ పార్లమెంటరీకి చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. 'దురదృష్టవశాత్తు అతని అభిప్రాయం తప్పు. అది బిల్లులోని టెక్స్ట్‌కు విరుద్ధంగా ఉంది. ఒకవేళ బిల్లు ఆమోదం పొందినా (అది జరగడం చాలా అసంభవం)బిల్లు ప్రకారం 'అపాయింటెడ్ తేదీ' కేవలం 'సార్వత్రిక ఎన్నికల తర్వాత మాత్రమే' ఉండగలదు. 'తదుపరి సార్వత్రిక ఎన్నికలు 2029లో జరుగుతాయి. అందువల్ల, 2029లో ఏకకాల ఎన్నికలు సాధ్యం కావు. ఇది ఒక వరం' అని చిదంబరం అన్నారు.

# పంజాబ్, గుజరాత్‌లో పాఠశాలల పనితీరును పోల్చి చూడండి

**బిజెపికి ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ బహిరంగ సవాల్**

**న్యూఢిల్లీ :** పాఠశాలల పనితీరుపై ఆమ్ ఆద్మీపార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బిజెపికి బహిరంగ సవాల్ విసిరారు. పంజాబ్, గుజరాత్‌లకు చెందిన 1,000 పాఠశాలల పనితీరును పోల్చి చూడాలన్నారు. పంజాబ్ ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను దెబ్బతీసేందుకు బిజెపి మార్పులు చేసిన ఎఐ ఆధారిత వీడియోలను ఉపయోగిస్తోందని కూడా కేజ్రీవాల్ ఆరోపించారు. 'నేను బిజెపికి సవాలు విసురుతున్నాను: మీరు గుజరాత్‌లో 30 ఏళ్లుగా అధికారంలో ఉన్నారు, మేము పంజాబ్‌లో నాలుగన్నర ఏళ్లుగా అధికారంలో ఉన్నాము. నేను మీకు పంజాబ్‌లోని 1,000 పాఠశాలల జాబితాను ఇస్తాను, మీరు మాకు గుజరాత్‌లోని 1,000 పాఠశాలల జాబితాను ఇవ్వండి. మనం కలిసి ఆ పాఠశాలలను పరిశీలించి, ఏవి మెరుగ్గా ఉన్నాయో చూద్దాం' అని కేజ్రీవాల్ ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఈ పరిశీలన ప్రక్రియను మీడియా కవర్ చేయాలని కూడా ఆయన ప్రతిపాదించారు. తమ సొంత పాఠశాలలను మెరుగుపరచుకోవడం మానేసి, బిజెపి ప్రభుత్వాలు పంజాబ్‌లోని పాఠశాలలను అప్రతిష్టపాలు చేస్తున్నాయని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. 'కేవలం నాలుగన్నర ఏళ్లలోనే మేము పంజాబ్ పాఠశాలలను ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దాము. పంజాబ్‌లో సుమారు 19,700 పాఠశాలలు ఉన్నాయి, వాటిలో కేవలం 500 పాఠశాలల పని మాత్రమే ఇంకా మిగిలి ఉంది. మిగిలిన 19,200 పాఠశాలలను మేము చాలా బాగా అభివృద్ధి చేశాము. ఆ 500 పాఠశాలల్లో కూడా పనులు జరుగుతున్నాయి, రాబోయే ఒకటిన్నర నుండి రెండేళ్లలో వాటిని కూడా బాగు చేస్తాము' అని కేజ్రీవాల్ చెప్పారు. 2022లో పంజాబ్‌లో ఆప్ అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రం 28వ స్థానంలో ఉండేదని, కానీ ఇప్పుడు పరిస్థితిలో గొప్ప మార్పు వచ్చిందని ఆయన అన్నారు. తాము ఒక్కరమే పాఠశాలలను మెరుగుపరచలేదని, పంజాబ్ ప్రజలే ఆ రాష్ట్ర పాఠశాలలను మెరుగుపరిచారన్నారు. అక్కడి ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, తల్లిదండ్రులు, పిల్లలు అందరూ కలిసి వాటిని మెరుగుపరిచారని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ABR. NO. 181 OF 2026**
Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**Anees & OTHERS**
**......Opponents**
2. Syed Pash Hussain S/O Moulana Syed Aged About 73 Years Occ: Business. R/O. H.No.13-3-142, Pathak Moualla,Warangal.
4. Mohd Feroz Rahil S/O Osman Aged About 43 Years Occ: Business. R/O. H.No. 11-23-1847, LB Nagar, Warangal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR/
DEPUTY REGISTRAR OF CHITS
WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT WARANGAL**
**ABR. NO. 182 OF 2026**
Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**FEROZ RAHIL & OTHERS**
**......Opponents**
1. Mohd Feroz Rahil S/O Md.Osman Aged About 44 Years Occ: Business.R/O. H.No. 11-23-1847, LB Nagar, Warangal.
2. Mohd Arif S/O Md.Ali Aged About 37 Years Occ: Police Constable. R/O. H.No. 15-3-59/2, Rangampet, Warangal.
3. Mohd.Soyal Ahmed S/O Sadiq Ali Ahmed Aged About 29 Years Occ: Business. R/O. H.No. 11-23-1334, LB Nagar, Warangal.
4. Mohd Khaja Nadeemuddin S/O Khaja Moinuddin Aged About 37 Years Occ: Business. R/O. H.No. 11-24-224, Pochammaidan, Deshaipet Road, Warangal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR/
DEPUTY REGISTRAR OF CHITS
WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ABR. NO. 183 OF 2026**
Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**K.RAGHU & OTHERS**
**......Opponents**
1. Kathi Raghu S/O Ramulu Aged About 35 Years Occ:Pvt Employe. R/O. H.No. 1-162, Thogarrai, Duggondi, Warangal.
3. Kathi Ravi S/O Swamy Aged About 37 Years Occ: Police Constable. R/O. H.No.1-159, Thogarrai,Duggondi,Thimmampet,Warangal.
5. Nameendla Ashok kumar S/O Babu Aged About 39 Years Occ: Police Constable. R/O. H.No.14-84, Gorrekunta, Geesugonda, Warangal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR/
DEPUTY REGISTRAR OF CHITS
WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ABR. NO. 184 OF 2026**
Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**MOHD NOUSHAD ALI & OTHERS**
**......Opponents**
1. Mohd Noushad Ali S/O Bandalimir Aged About 52 Years Occ: Pvt Employee. R/O. H.No. 16-7-297, Abbanikunta, Yakubpura, Warangal.
2. Banoth Saraiah S/O Anthya Aged About 56 Years Occ:Policy service LIC-wgl.R/O. H.No. 35-2-909, Om sai colony, Jawahar colony Road, Gopalpur, Hanamkonda.
4. Mohd Khameruddin S/O Jafferaddin Aged About 38 Years Occ: Police Constable. R/O. H.No. 16-7-326, Yakubpura, Trible Welfare Residential School,Warangal.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR/
DEPUTY REGISTRAR OF CHITS
WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ABR. NO. 185 OF 2026**
Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**D.SRAVAN KUMAR & OTHERS**
**......Opponents**
1. Devunuri Sravankumar S/O Prabhakar Aged About 39 Years Occ: Business. R/O. H.No. 35-3-1374, Venkateshwara Colony, Gopalpur, Hanamkonda.
2. Meesala Mallaiah S/O Papaiah Aged About 52 Years Occ: Head Armed(SBI). R/O. H.No. 1-56, Nagasala, Mahabubanagar.
3. Kolipaka Padmalatha D/O Pochaiah Aged About 48 Years Occ: Teacher UPS Gundlasagar,Velair. R/O. H.No. 24-4-6/7, 100 feet Darga Road, Kazipet, Hanamkonda.
4. Sathigari Satya Vivechan S/O Veeraswamy Aged About 51 Years Occ: LIC Agent. R/O. H.No. 35-3-126, Venkateshwara Colony, Gopalpur, Hanamkonda.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR/
DEPUTY REGISTRAR OF CHITS
WARANGAL.**

**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR
THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**
**ABR. NO. 186 OF 2026**
Between:-
**M/s. Shriram chits (India) Pvt Ltd., Warangal-I Branch,** Rep by its Foreman cum Legal Managar,
**.....Disputant**
VERSUS
**V.BABU &OTHERS**
**......Opponents**
1. Vanga Babu S/O Laxmaiah Aged About 50 Years Occ: Agriculture. R/O. H.No. 8-55, Marripalli Gudem, Karimnagar.
2. Kamidi Sreedhar Reddy S/O Padmakar Reddy Aged About 52 Years Occ: Teacher HM ZPSS Gorleveedu. R/O. H.No. 2-4-89, Venakatram Nagar, Near Sai kiranam, Old Bus depot, Hanamkonda.
3. Yerram Malathi W/O Suraiah Aged About 52 Years Occ: Teacher ZPSS Mundrai. R/O. H.No. 10-1-60, Girmajipet, Warangal.
4. Sadula Laxmipathi S/O Ashalu Aged About 62 Years Occ: Business. R/O. H.No. 1-4-209,Govindagiri Nagar, Opp: Surekha Nursing Home,Koralla,Karimnagar.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on.**11.09.2026** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR/
DEPUTY REGISTRAR OF CHITS
WARANGAL.**

**CHANGE OF NAME**
I, **BOMMIDI AKHIL, S/o. BOMMIDI SRINU,** (old Name) H.No. 602, Majid Street, Near Majid, Bachupally, Mallmpet, Indiramma Colony, Bowrampet, Medchal-Malkajgiri Dist., Telangana State - 500043, has changed as **BOMMIDI AKHILESHWAR, S/o. BOMMIDI SRINU** (New Name) for all purposes

**BALAJI INSTITUTE OF EDUCATION**
BIE NARSAMPET
Laknepally, Narsampet, Dist: Warangal - 506 331 (TS)
(Recognised by NCTE & Affiliated to Kakatiya University)
9866078590, 7799878948, 9866050044
**NOTIFICATION FOR ADMISSION INTO B.Ed. COURSE**
Under Management Quota (Category-B) Seats for the Academic Year-2026-2027

| COLLEGE CODE | COURSE | INTAKE | CATEGORY-B SEATS |
|---|---|---|---|
| BIEN | B.Ed. | 50 | 12 |

Applications are invited from Eligible candidates for admissions in to B.Ed. in **BIOLOGICAL SCIENCES, MATHEMATICS, PHYSICAL SCIENCES, SOCIAL SCIENCES, ENGLISH, METHODOLOGIES & ORIENTAL LANGUAGES** under Category-"B" (Management Quota) Seats in the Prescribed format available in the College Office on or before **31-08-2026.** Eligibility as per TGEdcet-2026 & TGCHE Norms.
Admissions will be made as per the guidelines of TGCHE - Chairman

# ఆట ఎలా ఆడాలో మాకు బాగా తెలుసు

- ఆర్థిక ఆంక్షలు ప్రతిఘటించేందుకు సర్వసిద్ధం
- ఎకనామిక్ డీ–డే అమెరికాకు మరో ఓటమి
- చైనా–రష్యాఅంగీకరించలేదు
- ఇరాన్ ఆర్థికమంత్రి మదానీజాదే ప్రకటన
- చట్టపరిధిలో ఇరాన్‌కు సహకారం: చైనా

**టెహ్రాన్:**ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేసేందుకు అమెరికా ప్రకటించిన ఆర్థిక ఆంక్షల 'ఎకనామిక్ డీ–డే'(ఆపరేషన్ ఎకనామిక్ ఔట్‌కాస్ట్)ను ప్రతిఘటించేందుకు సర్వంసిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ ఆంక్షలు అమెరికా విదేశాంగ విధాన–యుద్ధ వైఫల్యంగా విమర్శించింది.ఈ ఎకనామిక్ డీ–డే అమెరికాకు మరో ఓటమికి దారితీస్తుందని ఇరాన్ ఆర్థికమంత్రి అలీ మదానీ జాదే అన్నారు. ఆట ఎలా ఆడాలో మాకు బాగా తెలుసు అన్నారు. చరిత్రలో ఎన్నడూలేనివిధంగా ఇరాన్‌ను ఆర్థికంగా భూస్థాపితం చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా ఆ దేశానికి ఉన్న ఆర్థిక సంబంధాలపై దాడి ప్రారంభించామని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ ఆగస్టు 24న ప్రకటించారు. 60 మంది వ్యక్తులు,సంస్థలు,నౌకలపై ఆయన ఆంక్షలు ప్రకటించారు.''తన పూర్వ అధ్యక్షుడు ఏనాటి నుండో అమలు చేయాలని భావిస్తున్న ప్రణాళికను ట్రంప్ అమలులోకి తెచ్చారు, ఇకమీదట ఇరాన్ ముప్పును అమెరికా ఎదుర్కోవడంలేదు, ఇరాన్ ముప్పును అంతం చేస్తున్నాం, ఐఆర్‌జిసి లేదా ఇరాన్ దుష్ట పాలకులకు ఏ మార్గంలోనూ నిధులు లభించకుండా 'జీరో–లీకేజ్ అప్రోచ్' అమలు చేస్తున్నాం,ఇరాన్ తరపున మనీలాండరింగ్‌కు పాల్పడే ఏ సంస్థనైనా డాలర్ వ్యవస్థ నుండి తొలగిస్తాం'' అని చెప్పారు. ఇరాన్‌కు సహకరిచేవారిపై చేసే అపూర్వదాడిగా పేర్కొన్నారు. ఐతే చైనా–రష్యా దేశాలు అమెరికా చర్యలను అంగీకరించలేదని అలీ మదానీ జాదే చెబుతూ, ఇతర దేశాలు కూడా అదేబాటలో పయనిస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తమ వాణిజ్య భాగస్వాములతో పూర్వపుస్థాయిలోనే లావాదేవీలు కొనసాగిస్తామన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ''ఈ పరిణామాలను ఎదుర్కోవడానికి ఇరాన్ సిద్ధంగా ఉంది, గతంలోనూ సిద్ధంగానే ఉంది, ఇప్పుడు దీనిని ప్రతిఘటించేందుకు రెండు సంవత్సరాల ప్రణాళిక కూడా ఉంది'' అని మదానీ జాదే చెప్పారు. ''ఇలాంటి ప్రణాళిక వస్తుందని మాకు ముందే తెలుసు, మా దగ్గర ప్రత్యామ్నాయంగా రెండో ప్రణాళిక కూడా ఉంది, మా దగ్గర మా సొంత సాధనాలు ఉన్నాయి, ఆట ఎలా ఆడాలో మాకు బాగా తెలుసు'' అన్నారు.



ఈ యుద్ధం ప్రపంచ చమురు ధరల పెరుగుదలకు దారితీసిందని, ఈ తాజా ముప్పునకు వ్యతిరేకంగా యుద్ధం కొనసాగితే పశ్చిమాసియా నుండి పూర్తిగా చమురు ఎగుమతులు నిలిపివేస్తామని అన్నారు. అదేవిధంగా అనుమతి లేకుండా హోర్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణాలు చేయవద్దని కొత్త హెచ్చరిక కూడా ఇరాన్ జారీ చేసింది. ఇరాన్‌కు వ్యతిరేకంగా యూరోపియన్ యూనియన్ అమలు చేయతలపెట్టిన ఆంక్షలను జార్జియా దేశం ఇప్పటికే తిరస్కరించింది. మరోవైపు చైనా కూడా అమెరికా చర్యలపై స్పందిస్తూ, ఇవన్నీ చట్ట విరుద్ధమైన ఏకపక్ష ఆంక్షలనీ, ఈ ఆంక్షలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేసింది. సమస్యలు పరిష్కరించడంలో ఆర్థిక ఆంక్షలు,ఒత్తిడి వ్యూహాలు ఎంత మాత్రం పనిచేయవని చైనా విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఇప్పటికే ప్రకటించారు.ఇరాన్‌తో చైనాకు ఉన్న సహకారం అంతర్జాతీయ చట్టాల పరిధిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఇరాన్ దక్షిణప్రాంతంవైపు ఉన్న జలసంధి ద్వారా ప్రపంచ అవసరాలలో ఐదూశాతం చమురు,గ్యాస్ ఉత్పత్తుల రవాణా వివిధ దేశాలకు నిత్యం వాణిజ్య నౌకల ద్వారా కొనసాగుతూ ఉండేది. కానీ ఈ ఏడాది మార్చినెల ఆరంభంలో హోర్ముజ్ జలసంధిని ఐఆర్‌జిసి దళాలు స్వాధీనం చేసుకున్న తర్వాత చమురు రవాణా స్తంభించిపోవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. దాదాపు ఆరునెలలుగా అమెరికా చేస్తున్న యుద్ధంలో 14,500 ఇరాన్ లక్ష్యాలపై సెంట్‌కామ్ బాంబు దాడులు,క్షిపణి దాడులు చేసింది. ఇరాన్ డ్రోన్ కేంద్రాలు,క్షిపణి కేంద్రాలు,నిఘా వ్యవస్థలను ధ్వంసం చేసింది. ఇరాన్‌ను కోలుకోలేని దెబ్బతీశామని, ఆ దేశ గగనతల,నౌకా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేశామని అమెరికా ప్రకటించినప్పటికీ ఇరాన్ దాడుల సామర్థ్యం సన్నగిల్లలేదు. మరోవైపు దౌత్యమార్గంలో కూడా ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను అమెరికాకు పాదాక్రాంతం చేసేందుకు ఇష్టపడలేదు. ఈ దశలో ట్రంప్ ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేసే ప్రణాళిక ప్రతిపాదించారు. ఈ చర్యల్లో భాగంగా ''ఆపరేషన్ ఎకనామిక్ ఔట్‌కాస్ట్''అమలు చర్యలను స్కాట్ బెస్సెంట్ ప్రారంభించారు.

## ప్రాదేశిక శాంతిపై ఇరాన్ నేతలతో మునీర్ చర్చలు



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ రక్షణ బలగాల ప్రధానాధిపతి ఫీల్డ్ మార్షల్ ఆసిఫ్ మునీర్ ఇరాన్ పర్యటన ఎంతో బాగా జరిగిందని ఆ దేశ రక్షణమంత్రిత్వశాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ప్రాదేశిక శాంతి,యుద్ధ పరిస్థితులు విస్తరరించకుండా చూడటం,వివాదాలను శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవడం వంటి విషయాలపై ప్రధానంగా ఇరాన్ నాయకులతో ఆసిఫ్ మునీర్ చర్చల్లో ప్రస్తావించారని తెలియజేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, స్పీకర్ ఘాలిబాఫ్,సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయీలతో ఆసిఫ్ మునీర్ చర్చలు జరిపారు.అమెరికా–ఇరాన్ మధ్య చర్చల్లో ఏర్పడిన ప్రతిష్ఠంభనను తొలగించేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని పాకిస్థాన్ రక్షణశాఖ ప్రకటించింది. ఇస్లామాబాద్ నిర్మాణాత్మక కృషిని ఇరాన్ నాయకులు ప్రశంసించారని కూడా పేర్కొంది.

## నా కుమారుడి హత్యకు ఇరాన్ యత్నం: నెతన్యాహూ



**జెరూసలెం:**నా కుమారుణ్ణి హత్య చేసేందుకు ఇరాన్ ప్రయత్నం చేసిందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ చెప్పారు.ఆయనకు యైర్,అవ్నెర్ అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిలో ఎవరిపై ఇరాన్ హత్యాయత్నం చేసిందో, ఎప్పుడు ఎక్కడ ఈ ప్రయత్నం జరిగిందో ఆయన వివరాలు చెప్పలేదు. ఈ ఇద్దరు కుమారుల్లో బాగా పేరు పొందిన యైర్ ఎక్కువకాలం మియామీలో గడిపారు. ఆయన తీవ్రవాద,మితవాద వ్యాఖ్యల ద్వారా ప్రసిద్ధి చెందారు. ప్రభుత్వ అనుకూల ఛానల్ 14కు ఇచ్చిన టెలిఫోన్ ఇంటర్వ్యూలో నెతన్యాహూ ఈ హత్యాయత్నం గురించి చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఆయన ఓడిపోయినప్పటికీ మరో ఐదు సంవత్సరాలపాటు వారి కుటుంబా ఆయన ఒప్పందం చేసుకున్నారు.

## రష్యా ప్రభుత్వ అధీనంలో కీలక ప్రైవేటు ఆస్తులు

### పుతిన్ తాత్కాలిక డిక్రీ జారీ

**మాస్కో:**కీలకమైన ప్రైవేటు ఆస్తులు, మౌలిక సదుపాయాలను రష్యా ప్రభుత్వం తాత్కాలికంగా తన అధీనంలోకి తెచ్చుకుంది. ఈ మేరకు ఆ దేశాధ్యక్షుడు పుతిన్ ఒక డిక్రీపై సంతకం చేశారు. ఐతే ఇది ఆస్తుల జాతీయాకరణ కాదు. యుద్ధ సమయంలో తాత్కాలిక ఏర్పాటు మాత్రమే. ఆస్తుల సంరక్షణే తమ లక్ష్యమని పుతిన్ ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ చెప్పారు. ఉక్రేన్ దాడులవల్ల అనేక చమురు శుద్ధి కర్మాగారాలు, కీలక ఆస్తులు ధ్వంసమయ్యాయి. ప్రైవేటు ఆస్తులు, మౌలిక సదుపాయాలపై ఉక్రేన్ డ్రోన్ దాడులు చేస్తూ తీవ్రస్థాయిలో దాడులు చేస్తూ నష్టం కలిగిస్తోంది. ఈ ఆస్తులను సంరక్షించుకోలేని పరిస్థితుల్లో ప్రభుత్వమే వాటిని తాత్కాలికంగా తన అధీనంలోకి తెచ్చుకుని దాడుల నుండి సంరక్షిస్తుంది. ఇంధన,ఇంధన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వ్యవస్థలు, లాజిస్టిక్స్,కమ్యూనికేషన్స్ వ్యవస్థలు వంటివన్నీ ఈ డిక్రీ పరిధిలోకి వస్తాయి. చాలా ఖచ్చితమైన పద్ధతులలో ఉక్రేన్ గురితప్పకుండా సుదూర ప్రాంతాలలో ఉన్న అత్యంత విలువైన రష్యా ప్రైవేటు ఆస్తులు,కీలక వ్యవస్థలపై దాడులు చేస్తూ నష్టం కలిగిస్తోంది. ఇది పుతిన్ ప్రభుత్వానికి తీవ్ర ఆందోళనకరం గా మారింది. ఈ ఉత్తర్వులవల్ల ధ్వంసమైన కీలక ప్రైవేటు ఆస్తులను సత్వరం మరమ్మతులు చేసి అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వం తీసుకువచ్చే అవకాశం ఉంది.



**పరస్పర దాడుల్లో 11 మంది మృతి**

తీవ్రరూపం దాల్చిన ఉక్రేన్–రష్యా యుద్ధంలో మంగళవారం తెల్లవారకముందే ఈ రెండు దేశాలు పరస్పర దాడులు కొనసాగించాయి. రష్యా ఆక్రమిత జపోరిఝియా ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రదేశాలపై ఉక్రేన్ చేసిన దాడుల్లో ఎనిమిది మంది మరణించారు. అదేవిధంగా ఈశాన్య సుమీ ప్రాంతంలో రష్యా చేసిన దాడుల్లో ముగ్గురు మరణించారు. జపోరిఝియాలోని హాలీడే రిజార్టులపై ఉక్రేన్ డ్రోన్ దాడులు చేసినప్పుడు ముగ్గురు పిల్లలు సహా ఎనిమిదిమంది పర్యాటకులు మరణించగా మరో 14 మంది గాయపడ్డారని క్రెమ్లిన్ నియమించిన ప్రాంతీయ అధిపతి యెవ్జెనీ బాలిట్స్కీ చెప్పారు.సుమీ ప్రాంతంలో రష్యా ఒక పౌర సదుపాయంపై దాడి చేయడంలో పెద్ద అగ్ని ప్రమాదం సంభవించింది. ఐతే సుమమీ ప్రాంతంలో ఉక్రేన్ నిల్వచేసిన డ్రోన్ గోదాములపై దాడిచేసినట్లు రష్యా రక్షణశాఖ ప్రకటించింది. కీవ్ సమీపంలో రష్యా గడచిన శుక్రవారం చేసిన భారీ దాడిలో పదిమంది మరణించారు. మరో 100 మంది గాయపడ్డారు. దీనికి ప్రతీకారంగా ఉక్రేన్ తీవ్ర దాడులు కొనసాగిస్తోంది.

## ఎకనామిక్ డీ–డేపై స్పందించని చమురు రంగం

### వారం రోజుల కనిష్ఠస్థాయికి ధరలు

**దుబాయ్:**చమురు ధరలు వారం రోజులనాటి కనిష్ఠస్థాయికి క్షీణించాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 35 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 91.82 డాలర్లకు చేరుకుంది. యుఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ కూడా 40 సెంట్లు తగ్గి బ్యారెల్ ధర 84.60 డాలర్లకు చేరుకుంది. బ్రెంట్ క్రూడాయిల్ ధర ఆగస్టు 19 తర్వాత అత్యంత కనిష్ఠస్థాయికి క్షీణించింది. అమెరికా–ఇరాన్ మధ్య సైనిక ఘర్షణలు తగ్గాయి. కానీ ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి పెరిగింది. ఎకనామిక్ డీ–డే చర్యలను చమురు వ్యాపారులు పెద్దగా పట్టించుకోవడంలేదు. ఆర్థిక ఆంక్షలకంటే యుద్ధమే అతిపెద్ద సమస్యగా చమురు రంగం భావిస్తుండటమే దీనికి కారణం.అందువల్ల ఇరాన్‌పై అమెరికా విధించిన తాజా ఆర్థిక ఆంక్షలను చమురు వ్యాపారులు పెద్దగా పట్టించుకోవడంలేదు.

**ఒక్కచుక్క ఆయిల్‌నూ ఇవ్వం**
**మొహ్సెన్ రెజాయి హెచ్చరిక**

ఇరాన్‌పై అమెరికా దిగ్బంధనం,ఆర్థిక యుద్ధం కొనసాగితే పర్షియన్ గల్ఫ్ నుండి ఒక్క చుక్క అయిల్ కూడా ఎవ్వరికీ ఇచ్చేదిలేదని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహ్సెన్ రెజాయి హెచ్చరించారు. పశ్చిమాసియాకు అమెరికా సేనలను పంపించినాగానీ, ఇస్లామిక్ వ్యతిరేక గ్రూపులతో సంబంధాలు కొనసాగించినాగానీ వారిని లక్ష్యంగా చేసుకుని ప్రాణాంతక దాడులు చేస్తామని ప్రకటించారు.ఇరాన్‌పై ఆపరేషన్ ఎకనామిక్ ఔట్‌కాస్ట్ అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఈ హెచ్చరిక వెలువడింది. ఈ ప్రణాళిక ప్రకారం ఇరాన్ ప్రజల ఆర్థిక జీవనాధారాన్ని దెబ్బతీయడమే లక్ష్యం.ఇస్లామిక్ రిపబ్లిక్‌కు సహాయంచేసే దేశాలపై దాడిగా స్కాట్ బెస్సెంట్ దీనిని పేర్కొన్నారు.''ప్రపంచ వ్యాప్తంగా ఇరాన్ ఆర్థిక సంబంధాలపై మేం దాడి చేస్తున్నాం,ఇరాన్‌లో నిరంకుశ పాలనకు తెరదించేవరకూ ఆ ప్రణాళిక ప్రకారం ఆ దేశాన్ని ఆర్థికంగా ఏకాకిని చేస్తాం'' అని బెస్సెంట్ చెప్పారు. ''ఇప్పుడు ఇరాన్ ముందు రెండే మార్గాలున్నాయి, ఒకటి పూర్వపుస్థాయిలో ఏకాకితనాన్ని అనుసరించడం లేదా నిరంకుశత్వాన్ని వదిలిపెట్టి ప్రపంచ ఆర్థిక భాగస్వామ్యంలో చేరడం'' అన్నారు.




## మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లిం సోదరులకు సిఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లిం సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే ఈ పవిత్ర దినం ముస్లింలకు ఎంతో విశిష్టమైనదని సిఎం పేర్కొన్నారు. ప్రవక్త మహ్మద్ బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, ధర్మబద్ధమైన జీవన విధానం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని అన్నారు. ఆయన సందేశాలు ప్రపంచ శాంతి, సామరస్యానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. మిలాద్ ఉన్ నబీ ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ : జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ పాలనలో బందీగా మారిన ప్రజల స్వేచ్ఛను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడే, ధర్నాలు చేసే స్వేచ్ఛ కల్పించిందని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జయ ప్రకాశ్ రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎంరేవంత్‌రెడ్డిని అమెరికా వెళ్లకుండా అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు. లండన్ వరకు వెళ్లిన ముఖ్యమంత్రిని అక్కడి నుంచి వెనక్కి రప్పించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సిఎం అమెరికా పర్యటనపై విమర్శలు చేస్తున్న బిజెపి నేతలు గతంలో ప్రధాని మోదీ పాకిస్థాన్‌కు వెళ్లిన విషయంపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా పర్యటనకు సంబంధించిన అనుమతుల వ్యవహారంలో కేంద్రం ఎందుకు అడ్డంకులు సృష్టించిందో స్పష్టం చేయాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంపై ఎలాంటి సందేహాలు అవసరం లేదన్నారు.రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నాయకత్వంలో పనిచేయాలనే నిబద్ధతతో ఉన్నారని జగ్గారెడ్డి అన్నారు.

## రాష్ట్రంలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు

### వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో యూరియా, ఇతర ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి స్పష్టం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.77 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.33 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి, 2.27 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 0.31 లక్షల మెట్రిక్ టన్నుల ఎంఒపి, 0.20 లక్షల మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి నిల్వలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో యూరియా నిల్వలు కేవలం 0.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 2.77 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయని వివరించారు.రైతులు అవసరానికి మించి ముందస్తుగా ఎరువులు బుక్ చేసుకోవడం లేదా కొనుగోలు కోసం తొందరపడాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. ప్రభుత్వం సూచించింది. ఎరువుల లభ్యత, సరఫరా, రవాణా, పంపిణీని వ్యవసాయ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రతి నిజమైన సాగుదారుడికి సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



**దశల వారిగా ఎఫ్ఎఫ్ఎస్ యాప్ అమలు :**

నిజమైన సాగుదారులకు సబ్సిడీపై ఎరువులు పారదర్శకంగా, సమానంగా, సకాలంలో అందించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్స్ యాప్‌ను రాష్ట్రంలో దశలవారీగా అమలు చేస్తున్నామని గోపి చెప్పారు. రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో పైలట్‌గా ప్రారంభించిన ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను ఈనెల 6 నుంచి మరో 10 జిల్లాలకు, 21వ తేదీ నుంచి మరో 10 జిల్లాలకు విస్తరించినట్ల వెల్లడించారు. . ప్రస్తుతం 22 జిల్లాల్లో యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయని మిగిలిన 10 జిల్లాల్లో ఈ నెలాఖరులోగా అమలు చేయనున్నామని తెలిపారు.రాష్ట్ర యూరియా యాప్ ద్వారా ఇప్పటివరకు 33.37 లక్షల మంది రైతులు 137.63 లక్షల బస్తాలు బుక్ చేసుకోగా, 123.93 లక్షల బస్తాలు కొనుగోలు చేశారు. ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా 10.17 లక్షల క్యూఆర్ కోడ్‌లు జనరేట్ కాగా, 42.34 లక్షల బస్తాలు బుక్ చేసి, 28.39 లక్షల బస్తాలు కొనుగోలు చేశారన్నారు. ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, డీలర్ల వద్ద ఉన్న నిల్వలకు మించి బుకింగ్స్ నమోదు కావడం, కొన్ని గ్రామాలు, భూముల వివరాలు యాప్‌లో కనిపించకపోవడం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర సాంకేతిక బృందాలతో సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు.

## చర్యలు తప్పవు (మొదటి పేజీ తరువాయి)

పూర్తి అంశాలను పరిశీలించి టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు నివేదిక అందించామని తెలిపారు. మీడియాలో వచ్చిన కథనాలతో పాటు గతంలో జరిగిన పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. తమ నివేదికను టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ ఎఐసిసి ఇంఛార్జ్ నటరాజన్ మీనాక్షికి పంపారని, ఎఐసిసి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి కూడా నివేదిక వెళ్తుందని తెలిపారు. కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాల మేరకే తదుపరి చర్యలు ఉంటాయని మల్లు రవి స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తీసుకునే నిర్ణయం పార్టీ నాయకులు, కార్యకర్తలకు క్రమశిక్షణపై స్పష్టమైన సందేశం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే రిపోర్టులో అన్ని విషయాలను పొందుపరిచామన్నారు. నివేదికలోని అంశాలను బహిరంగంగా వెల్లడిస్తే తనకు నోటీసులు వచ్చే అవకాశం ఉందని మల్లు రవి తెలిపారు.

## త్వరగా టెండర్లు (మొదటి పేజీ తరువాయి)

జాగ్రత్త వహించాలని సిఎం సూచించారు. మూసీ రివర్‌ఫ్రంట్‌లో భాగంగా చేపట్టే ప్రాజెక్టులకు అతి తక్కువ వడ్డీకి రుణ సదుపాయాలపై మున్సిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని, అలాగే టిడిఆర్‌లు జారీ చేసే విషయంలో కూడా ప్రతి వారం సమీక్షించాలని చెప్పారు. గండిపేట మంచిరేవుల సమీపంలోని ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తక్షణం టెండర్లు పిలవాలని సిఎం ఆదేశించారు. అలాగే, కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. సమావేశంలో హెచ్ఎండిఎ, జిహెచ్ఎంసి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఎంఆర్‌డిసిఎల్ ఎండి, జెఎండి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అర్థరహితం (మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనాలు, భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకునే విదేశాంగ శాఖ విదేశీ పర్యటనలకు అనుమతులిస్తుందని స్పష్టం చేశారు. భారత్‌పై విషం చిమ్మే, ప్రధాని మోదీని ఉగ్రవాదితో పోల్చిన న్యూయార్క్ మేయర్ మామ్దానీని కలవడానికి సిఎం రేవంత్ ప్రయత్నించారా? లేదా ? అన్నదానిపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గతంలో తమ విదేశీ పర్యటనలను కూడా విదేశాంగ శాఖ తిరస్కరించిందని, సిఎం స్థాయి వ్యక్తులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి తప్ప తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై బురద చల్లడం సరికాదన్నారు.

**సింగరేణికి పూర్వవైభవం సాధిస్తాం..**

సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని కిషన్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ. 55,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి సంస్థను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల గణన ఘోరంగా విఫలమైందని, హైదరాబాద్‌లో కనీసం 20 శాతం ఇళ్లను కూడా సర్వే చేయలేదని విమర్శించారు.

## నివేదికలే సమాధానం

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేసుకోవచ్చని ఎన్‌డిఎస్ఎ అఫిడవిట్‌లోనే స్పష్టం చేసిందని, సిడబ్ల్యూపిఆర్ఎస్ పరిశీలనలో అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలోని ఏ బ్లాక్‌లోనూ నిర్మాణపరమైన సమస్య లేదని, కాంక్రీట్ నాణ్యత కూడా బాగానే ఉందని తేలిందని హరీశ్ రావు తెలిపారు. అయినప్పటికీ రాజకీయ కక్ష కారణంగా ప్రాజెక్టును పక్కనపెట్టి, తెలంగాణకు వచ్చిన గోదావరి జలాలను వినియోగించుకోకుండా దిగువకు వదిలేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. ప్రాజెక్టును నిందిస్తూ నీటిని లిఫ్ట్ చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదిలిపెట్టడం ద్వారా తెలంగాణ రైతాంగానికి తీరని నష్టం జరిగిందన్నారు. ఏపికి నీళ్లు వదిలి తెలంగాణ రైతులకు కన్నీళ్లు మిగిల్చారన్నారు. దేశవ్యాప్తంగా జలాశయాల్లో సగటున 64.16 శాతం నీటి నిల్వలు ఉండగా, తెలంగాణలో మాత్రం కేవలం 35.6 శాతమే ఉన్నాయన్నారు. ఇది కేవలం అంకెలు కాదని, రాబోయే నీటి సంక్షోభానికి సంకేతమని హెచ్చరించారు. రాజకీయ కక్షలకు ఇది సమయం కాదని, తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడాల్సిన సమయమన్నారు. పార్టీలో అంతర్గత విభేదాలపై పెడుతున్న శ్రద్ధను ప్రాజెక్టుల నిర్వహణ, నీటి హక్కులు, రైతుల ప్రయోజనాలపై ప్రభుత్వం పెట్టాలని హరీశ్ రావు సూచించారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం విరమించి, అన్నారం, సుందిళ్ల మోటార్లు ఆన్ చేసి గోదావరి జలాలను ఎత్తిపోసి రిజర్వాయర్లు నింపి రైతుల పొలాలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు.

## తప్పుదోవ పట్టిస్తున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత ప్రయత్నాలు కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని అన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకత్వం మోదీకి లేఖ రాయడం ఇది మూడవసారని, అయితే ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదని రమేశ్ అన్నారు. 'కుల గణనపై వచ్చిన నోటిఫికేషన్‌లో 40 ప్రశ్నలు అడుగుతామని, అందులో 10వ ప్రశ్న కులానికి సంబంధించినదిగా ఉంటుందని పేర్కొన్నారు; ఇది తమకు తామే నష్టం కలిగించుకునే చర్య వంటిది, దీనివల్ల సామాజిక న్యాయం చేకూరదన్నారు. 'కుల గణన అంశంపై ప్రధానమంత్రికి కాంగ్రెస్ పార్టీ రాసిన లేఖలలో ఇది మూడవది. మొదటి లేఖను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 2023 ఏప్రిల్ 16న ప్రధాన మంత్రికి రాశారు. ఆ తర్వాత, కాంగ్రెస్ అధ్యక్షుడు 2025 మే 5న కుల గణనపైనే రెండవ లేఖను (రెండు పేజీల సుదీర్ఘ లేఖను) రాసి, నిర్మాణాత్మకమైన వాటితో సహా కొన్ని సూచనలు చేశారు' అని ఆయన చెప్పారు.

**కులగణన సరిగా జరిగినప్పుడే**
**అన్నింటినీ కచ్చితంగా అంచనా వేయగలం**

కచ్చితమైన గణాంకాలు లేకుండా భారతదేశంలో సామాజిక న్యాయ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యం కాదని, కుల గణన సరిగా జరిగినప్పుడే వివిధ కులాల సంఖ్యాపరమైన బలం, సామాజిక, ఆర్థిక స్థితిగతులను కచ్చితంగా అంచనా వేయడం సాధ్యమవుతుందని ఖర్గే, రాహుల్ తమ లేఖలో పేర్కొన్నారు. 'జనాభా గణనలో కుల వివరాలను నమోదు చేయడానికి మీ ప్రభుత్వం 'ఓపెన్ ఎండెడ్ (స్వేచ్ఛా సమాధాన) ప్రశ్న విధానాన్ని ఎంచుకుంది, ఇది తప్పుదోవ పట్టించేలా ఉంది. ఈ పద్ధతిలో, ఒక వ్యక్తి తన కులం పేరుగా ఏ పేరు చెబితే అదే నమోదు చేయబడుతుంది' అని ఆ నాయకులు మోదీకి రాసిన లేఖలో తెలిపారు. భారతదేశంలో ఒకే కులం వివిధ ప్రాంతాలలో వేర్వేరు పేర్లు, ఉపకులాలు, భాషా పరమైన వైవిధ్యాలతో పిలవబడుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, మాజీ పార్టీ చీఫ్ రాహుల్ గాంధీ ఎత్తిచూపారు. దీని వల్ల, ఒకే కులానికి చెందిన వ్యక్తులు గణన సమయంలో వేర్వేరు పేర్లతో నమోదు చేయబడితే, ఒకే కులం వేలకొద్దీ విభిన్న పేర్లుగా విడిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల లక్షలాది కుల పేర్ల జాబితా తయారవుతుందని, తద్వారా కుల గణన ద్వారా పొందిన మొత్తం సమాచారం (డేటాసెట్) నిరుపయోగంగా మారుతుందని ఖర్గే, రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. 'ఒక వర్గానికి చెందిన వాస్తవ జనాభా కచ్చితంగా నమోదు కాకపోతే, వారి స్థితిగతులపై చేసే అంచనా కూడా లోపభూయిష్టంగా ఉంటుంది. ఇది వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అట్టడుగు వర్గాలకు నష్టం కలిగిస్తుంది. అలాగే విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై ప్రభావం చూపుతుంది' అని వారు అన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా, ఈ విధానం వల్ల భారతదేశంలో ఒబిసి జనాభా ఎంత ఉందో తెలుసుకోవడం సాధ్యం కాదని, ఈ గణనలో వెనుకబడిన వర్గం అనే పదం కూడా చేర్చబడలేదు అని వారు పేర్కొన్నారు. 'దీనికి ఇప్పటికే ఒక సులభమైన పరిష్కారం ఉంది: కులాల జాబితాతో కూడిన ఒక 'డ్రాప్‌డౌన్' జాబితాను (ఎంపిక చేసుకునే జాబితాను) రూపొందించాలి. షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగల (ఎస్‌టి) గణన కోసం ఇదే పద్ధతిని అనుసరించారు. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల జాబితాలు, 'ఆంత్రోపోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' జాబితా వంటి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ జాబితాల ఆధారంగా అటువంటి జాబితాను సులభంగా తయారు చేయవచ్చు' అని ఆ ఇద్దరు నాయకులు మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ, బిహార్‌లలో నిర్వహించిన కుల సర్వేలలో కూడా ఇదే పద్ధతిని అనుసరించారని వారు గుర్తుచేశారు. ప్రస్తుత పద్ధతిలో నిర్వహిస్తున్న కుల గణనను తాము అంగీకరించమని, ప్రభుత్వం ప్రస్తుత ప్రశ్నావళిని రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదింపులు జరిపిన తర్వాత కొత్త ప్రశ్నావళిని రూపొందించాలన్నారు. దీనివల్ల ప్రతి కులం, వర్గానికి చెందిన వాస్తవ సంఖ్యలు వెల్లడవుతాయని, తద్వారా కుల గణన కచ్చితమైనదిగా, అర్థవంతమైనదిగా, ప్రయోజనకరంగా మారుతుందని ఖర్గే, రాహుల్ స్పష్టం చేశారు. వారు ఆ లేఖతో పాటు తెలంగాణ కుల సర్వే (2024), బిహార్ కుల సర్వే (2022)కు సంబంధించిన కులాల జాబితాల కాపీలను జతచేశారు.

## దేవాదుల పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

మహత్తర లక్ష్యంతో రూపుదిద్దుకున్న దేవాదుల రాష్ట్ర సాగునీటి చరిత్రలో అత్యంత కీలకమైన ప్రాజెక్టుల్లో ఒకటని పేర్కొన్నారు.దాదాపు రెండు దశాబ్దాల క్రితం చేపట్టిన ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ అసంపూర్తిగా మిగిలిపోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి దాదాపు 38 టిఎంసిల గోదావరి జలాలను ఎత్తిపోసి సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే దేవాదుల లక్ష్యమని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పంపింగ్ వ్యవస్థలను పూర్తి సామర్థ్యంతో వినియోగించి గోదావరి జలాలను గరిష్ఠంగా ఎత్తిపోసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భూసేకరణకు నిధుల కొరత లేకుండా చూస్తామని, పరిహారం రైతుల చేతికి సకాలంలో చేరేలా చర్యలు చేపడతామని ఉత్తమ్ తెలిపారు. కలెక్టర్లు, ఇంజినీర్లు సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. దేవాదుల ప్రాజెక్టును కేవలం సమీక్షించడానికే పరిమితం కాకుండా, ప్రతి కాంపోనెంట్‌ను విడివిడిగా పరిశీలించి, ఏ పని ఎక్కడ నిలిచిపోయింది? దానికి కారణమేంటి? పరిష్కారానికి ఏం చేయాలి? అనే అంశాలపై లోతుగా చర్చించినట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.ప్రధానంగా భూసేకరణ, పునరావాసం–పునరావాస ప్యాకేజీ (ఆర్ అండ్ ఆర్), అటవీ అనుమతులు, ఇతర పరిపాలనా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. భూసేకరణ ప్రక్రియ పూరై అవార్డులు ఖరారైన చోట నిధుల విడుదలలో ఒక్క రోజు కూడా జాప్యం ఉండకూడదన్నది ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల్లో భూసేకరణ తదితర అడ్డంకులను తొలగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.6,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి హామీ ఇచ్చారని, అందులో ఇప్పటికే సుమారు రూ.2,500 కోట్లు విడుదలయ్యాయని మంత్రి వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టుకు కూడా ఇటీవల భూసేకరణ కోసం నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే మిగిలిన నిధులను సైతం సమకూరుస్తామని భరోసా ఇచ్చారు.

# మూడో రోజు ఆటలో భారత్‌దే ఆధిపత్యం

## ఫాలోఆన్ అంచున శ్రీలంక



శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. బ్యాటింగ్ తరహాలోనే బౌలింగ్లోనూ సత్తా చాటింది. దాంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. పసిందు సూర్యబండార(133 బంతుల్లో 9 ఫోర్లతో 80) సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. శ్రీలంక ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది. నాలుగో రోజు ఆటలో వీలైనంత త్వరగా శ్రీలంకను ఆలౌట్ చేసి భారత్ బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. ఒక సెషన్ పాటు బ్యాటింగ్ చేసి 300 ప్లస్ లక్ష్యాన్ని శ్రీలంక ముందు ఉంచి విజయం కోసం ప్రయత్నించనుంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే.

### ఆదిలోనే దెబ్బతీసిన భారత్..

ఎనిమిది పరుగులకు రెండ్లు వికెట్ల నష్టంతో ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంకకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కామిల్ మిషారా(19)ను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. కామిందు మెండీస్‌తో కలిసి పసిందు సూర్య బండార ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 76 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 87 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. కామిందు మెండీస్(32)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 130/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

### ఆదుకున్న పసిందు, దినుషా..

ఈ సమయంలో వర్షం అంతరాయం కలిగించడంతో రెండో సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. సెకండ్ సెషన్ ఆరంభంలోనే ధనంజయ డిసిల్వా(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 137 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో సోనాల్ దినుషాతో కలిసి పసిందు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ దిశగా సాగిన పసిందును జడేజా క్లీన్ బౌల్ చేశాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్వెల్లా(0)ను సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడాడు. తొలి టెస్ట్ ఫామ్‌ను కొనసాగిస్తూ.. 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో శ్రీలంక 216/7 స్కోర్‌తో టీ బ్రేక్కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ ఆచితూచి ఆడింది. 57 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మానవ్ సుతార్ విడదీసాడు. ఈ వికెట్‌తో 20 వికెట్ల మైలు రాయి అందుకున్నాడు. లాహిరు కుమారా ఆచి తూచి ఆడగా.. సోనాల్ దినుషా తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. మరో వికెట్ పడకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడటంతో శ్రీలంక 265/8 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ముగించింది.

# కార్లసన్‌ను ఓడించిన 15 ఏళ్ల కుర్రాడు..

## 50 ఎత్తుల్లోనే అద్భుత విజయం సాధించిన వందన్


చదరంగంలో భారత కుర్రాళ్లు అసమాన విజయాలతో దూసుకెళ్తున్నారు. గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేశ్, అర్జున్ ఎరిగేసి వంటి వారు ఇప్పటికే తామేంటో నిరూపించుకోగా.. 15 ఏళ్ల వందన్ అలంకార్ సవాయ్ వీరి సరసన చేరాడు. అలా అనీ అతడేమీ తాజాగా ఏ టోర్నీలోనో విజేతగా నిలవలేదు. కానీ.. వరల్ నంబర్ 1 మాగ్నస్ కార్లసన్‌ను ఓడించి వార్తల్లో నిలిచాడీ యువ సంచలనం. పదిహేనేళ్ల భారత కుర్రాడి చేతిలో వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్లసన్ కంగుతిన్నాడు. కేవలం 50 ఎత్తుల్లోనే చెస్ దిగ్గజాన్ని చిత్తు చేశాడు వందన్ అలంకార్ సవాయ్ అనే పిల్లాడు. అయితే..ఇంతటి గొప్ప విషయాన్ని అతడు తన తల్లిదండ్రులకు కూడా చెప్పలేదు. చివరకు వాళ్లే తమ కుమారుడు కార్లసన్‌ను ఓడించిన విషయం తెలిసి ఉప్పొంగిపోయారు. చెస్.కామ్ వీక్లీ టైటిల్ మంగళవారం ఈవెంట్లో.. ఈఎల్వో రేటింగ్ 2,288 ఉన్న వందన.. లెజెండరీ ఆటగాడైన కార్ల్ పైచేయి సాధించి ఔరా అనిపించాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన వందన్.. అత్యుత్తమ ఆటగాడైన కార్లసన్ పొరపాటు చేయడంతో తాను షాకయ్యానని చెప్పాడు. అంతర్జాతీయ స్థాయిలో మాస్టర్‌గా అవతరించడమే నా లక్ష్యం. ఇప్పటికే నా వయసు వారు గ్రాండ్‌మాస్టర్లు అయ్యారు. నేను కూడా ఏదో ఒకరోజు ఆ హోదా అందుకుంటా. అప్పటివరకూ నేను చరిత్ర, రాజనీతి శాస్త్రంపై దృష్టి సారిస్తా అని వందన్ పేర్కొన్నాడు.



## మహిళ

# ప్రపంచ యుద్ధంలో మహిళల సేవలు





రెండో ప్రపంచ యుద్ధంలో మిత్రదేశాల విజయానికి సంబంధించిన చరిత్రను చెప్పినప్పుడు సాధారణంగా అలాన్ టర్నింగ్, గార్డొన్ వెల్చ్ మన్, డిల్లీ నాక్స్ వంటి అసాధారణ మేధావుల పేర్లు ముందుగా వినిపిస్తాయి. జర్మనీ ఉపయోగించిన ఎనిగ్మా సంకేతాలను ఛేదించి యుద్ధ గమనాన్నే మార్చిన వారి ప్రతిభ గురించి ప్రపంచం ఎంతో గర్వంగా చెప్పుకుంటుంది. కానీ ఆ విజయ గాథలో చాలా కాలం చరిత్ర మరచిపోయిన మరో గొప్ప అధ్యాయం ఉంది. అది వేలాది మంది మహిళలది. బ్రిటన్‌లోని బెచ్లీపార్క్‌లో పనిచేసిన సిబ్బందిలో దాదాపు 75శాతం మంది మహిళల గురించి చరిత్ర చాలా తక్కువగా ప్రస్తావిస్తుంది. 1944లో ఈ కేంద్రం అత్యున్నత స్థాయిలో పనిచేస్తున్నప్పుడు అక్కడ సుమారు పదివేల మంది విధులు నిర్వర్తించగా, వారిలో సగానికి పైగా మహిళలే ఉన్నారు. ఉన్నత కుటుంబాల యువతుల నుంచి సాధారణ కార్మికుల వరకు, విశ్వవిద్యాలయ విద్యార్థినుల నుంచి మహిళా సైనిక దళాల సభ్యుల వరకు సమాజంలోని అన్నివర్గాలకు చెందిన మహిళలు దేశరక్షణకు ఒకే లక్ష్యంతో అక్కడ చేరారు. ఎనిగ్మా సంకేతాలను ఛేదించడానికి రూపొందించిన 'బంబే' యంత్రాలను నిరంతరం నడిపింది కూడా వారే. ఈ యంత్రాలు పగలు, రాత్రి ఆగకుండా పనిచేయాల్సి ఉండేది. మహిళలు 24 గంటలు షిఫ్టుల వారీగా పనిచేస్తూ యంత్రాల అమరికలను పర్యవేక్షించేవారు. యంత్రం ఒక సంకేతాన్ని గుర్తించిన వెంటనే అది నిజంగా ఉపయోగకరమైనదా, లేకతప్పుడు హెచ్చరికనా అనే విషయాన్ని ముందుగా అంచనా వేసి, ఆ తరువాత మాత్రమే కోడ్ నిపుణులకు పంపేవారు. అంటేవారు కేవలం యంత్రాలను నడిపే సిబ్బంది కాదు, గూఢచార సమాచారాన్ని అర్థం చేసుకునే నైపుణ్యం కలిగిన విశ్లేషకులు కూడా. కొంతమంది జర్మన్ సైన్యం పంపిన సందేశాల్లో తరచుగా కనిపించే పదబంధాలను గుర్తించి కోడ్ ఛేదనకు కీలకమైన ఆధారాలను అందించగా, మరికొందరు జర్మన్, ఇటాలియన్, జపనీస్ భాషలలోని సంకేతాలను అనువదించి సైనిక సమాచారంగా మార్చేవారు. వేలాది సమాచార కార్డులను క్రమబద్ధీకరిస్తూ ప్రపంచ యుద్ధ చరిత్రలోనే అత్యంత సమగ్ర గూఢచార సమాచార డేటాబేస్‌లలో ఒకదాన్నినిర్వహించింది కూడా మహిళలే. అయితే వారి సేవలకు వెంటనే గుర్తింపు రాలేదు. 1945లో యుద్ధం ముగిసిన తరువాత వారిని ఇంటికి పంపేముందు, అధికారిక రహస్యాల చట్టం ప్రకారం బ్లెచ్లీ పార్క్‌లో చేసిన పని గురించి ఎవరికీ చెప్పకూడదని కఠినంగా ఆదేశించారు. ఫలితంగా యుద్ధ ఫలితాలను ప్రభావితం చేసిన మహిళలు తమ భర్తలకు, పిల్లలకు, స్నేహితులకు కూడా తాము ఏంచేశామో చెప్పలేకపోయారు. చాలామందితమజీవితమంతా 'నేను సాధారణ కార్యాలయంలో ఉద్యోగం చేశాను' అనే ఒక్క మాటతోనే తమ అసాధారణ సేవను దాచిపెట్టారు. వారిలో కొందరు అసలు గుర్తింపు పొందకుండానే మరణించారు. 1974లో బ్రిటిష్ ప్రభుత్వం బ్లెచ్లీ పార్క్ కార్యకలాపాల గురించి అధికారికంగా వివరాలు వెల్లడించిన తరువాతే ప్రపంచానికి ఈమహిళల పాత్ర తెలిసింది. అప్పటికి వారిలో చాలామంది వృద్ధాప్యంలోకి అడుగుపెట్టారు. తరువాత బ్లెచ్లీ పార్క్ ట్రస్ట్ ఏర్పడి ఆచరిత్రను ప్రపంచానికి పరిచయం చేయడంతో వారు దశాబ్దాల మౌనాన్ని వీడి తమ అనుభవాలను పంచుకున్నారు. ఇవిఒక గొప్పసత్యాన్ని వెలుగులోకి తెచ్చాయి. యుద్ధాలను కేవలం యుద్ధభూమిలో పోరాడిన సైనికులే గెలిపించరని, రహస్యంగా పనిచేసిన సాధారణ మనుషులు కూడా చరిత్రను మలుస్తారనీ ప్రపంచానికి రుజువు చేశాయి. బ్లెచ్లీపార్క్ మహిళలు అలాంటి అసాధారణ వీరులు. వారి మేధస్సు, క్రమశిక్షణ, నిబద్ధత రెండో ప్రపంచయుద్ధ విజయానికి బలంగా నిలిచింది. అయితే తమ దేశాన్ని రక్షించిన ఆ మహిళలకు, తాము చేసిన సేవను ప్రపంచానికి చెప్పుకునే హక్కు కూడా దశాబ్దాల పాటు దక్కకపోవడం చరిత్రలోని అత్యంత మౌనమైన త్యాగాల్లో ఒకటిగా మిగిలిపోయింది.

## ఆశను మోసిన ప్రయాణం



అది.. 1948 మే నెల. రెండో ప్రపంచ యుద్ధం ముగిసి మూడు సంవత్సరాలు గడిచినా, దాని గాయాలు ఇంకా ఇటలీ ప్రజల జీవితాల్లో సజీవంగానే ఉన్నాయి. దక్షిణ ఇటలీలోని కాలాబ్రియా ప్రాంతంలో పేదరికం ప్రతి ఇంటి తలుపు తట్టేది. అలాంటి పరిస్థితుల్లో ఇరవై ఏడు సంవత్సరాల ఎలెనా మారినో తనముగ్గురు చిన్నారులతో కలిసి ప్రతిరోజూ జీవన పోరాటం సాగించేది. ఆమెకు భర్త లేడు. యుద్ధంలో బందీగా గడిపి తిరిగి వచ్చిన అతను అనారోగ్యంతో మరణించాడు. మిగిలింది కొద్దిపాటి భూమి, ముగ్గురు పిల్లలు, ఒక గాడిద మాత్రమే. ప్రతి ఉదయం ఆ గాడిదపై జున్ను, ఆలివ్‌లు, కూరగాయలు, మూలికలు ఎక్కించి దాదాపు ఐదు మైళ్ల దూరంలో ఉన్న క్రోటోన్ మార్కెట్‌కు బయలుదేరేది ఎలెనా. చేతుల్లో రెండేళ్ల చిన్నారి సోఫియా నిద్రపోతుండగా, ఆరేళ్ల రోసా చెప్పులు లేకుండా చిరునవ్వుతో నడిచేది. నాలుగేళ్ల మార్కో తనతండ్రికి చెందిన పెద్ద బూటును ఒక కాలికి మాత్రమే తొడుక్కొని, మరో కాలితో మట్టిరోడ్డుపై నడిచేవాడు. ఇది స్థూలంగా చూస్తే, ఒకకుటుంబం మార్కెట్‌కు వెళ్లే ప్రయాణం. కానీ, లోతుగా పరిశీలిస్తే, బతుకు కోసం సాగిన నిశ్శబ్దయుద్ధం. ఆరోజుల్లో యుద్ధానంతర ఐరోపాను చిత్రీకరించడానికి వచ్చిన ఒక విదేశీ ఫొటో జర్నలిస్టు ఈదృశ్యాన్ని తన కెమెరాలో బంధించాడు. చిన్నారి సోఫియాకు కప్పిన దుప్పటి అంతర్జాతీయ సహాయ సంస్థలు పంపిణీ చేసిన వస్తువుల్లో ఒకటి. ఆ చిన్న కుటుంబం వద్ద ఉన్న ప్రతి వస్తువూ ఒక కథ చెప్పేది. ప్రతిఅడుగు ఒక పోరాటాన్ని గుర్తు చేసేది. కాలం గడిచింది. జీవనోపాధికి ఆ కుటుంబం ఉత్తర ఇటలీలోని టురిన్ ప్రాంతానికి వలస వెళ్లింది. జీవితం మారింది. పిల్లలు పెరిగారు. కానీ ఎలెనా ఆ పాత ఫొటోను జీవితాంతం జాగ్రత్తగా దాచుకుంది. అప్పుడప్పుడు దానిని చూస్తూ గాడిద వైపు చూపించి, 'మనందరినీ ముందుకు నడిపించడానికి మనకు కొన్ని పాదాలు మాత్రమే ఉన్నాయి... కానీ ఎలాగోలా అవే మనకు సరిపోయాయి' అనేదట. ఆ మాటల్లో జీవితం మొత్తం దాగి ఉంది. మనిషి వద్ద ఉన్న వనరులు ఎంత తక్కువైనా, సంకల్పం ఉంటే ముందుకు సాగడానికి అవి సరిపోతాయి.

# ప్రజా సమస్యలు పట్టించుకోని కేంద్రం

## సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ విమర్శించారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సెప్టెంబర్ 1న ఢిల్లీ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జంతర్‌మంతర్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి నిధులు లేవని చెబుతూ కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలను మాఫీ చేస్తుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న జరిగే ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో సిపిఐ జిల్లా నాయకులు అనిల్, ఆలి ఇమ్రాన్, ఫిరోజ్, ఆనంద్, రమేష్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## పరస్పర విమర్శలు, అంతర్గత కుమ్ములాటలకు

# పరిమితం కావడం దురదృష్టం

### అధికార, ప్రతిపక్ష నాయకుల తీరు సరికాదు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పరస్పర విమర్శలు, అంతర్గత కుమ్ములాటలకే పరిమితమవడం దురదృష్టకరమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశం దిడ్డి పార్థసారథి అధ్యక్షతన వరంగల్ శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో జరిగింది సమావేశంలో ముఖ్యఅతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. ప్రజలు ఎన్నో సమస్యలతో సతమతమవుతుంటే, నాయకులు మాత్రం వరంగల్ జిల్లా అభివృద్ధి విస్మరించి, వ్యక్తిగత ప్రయోజనాలు, కుర్చీలాటల కోసం పాకులాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు రోజురోజుకూ పేరుకుపోతున్నాయని, వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని విమర్శించారు. నిరుద్యోగం, రైతుల సమస్యలు, తాగునీరు, మౌలిక వసతుల కొరత వంటి తీవ్రమైన ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సింది పోయి, నాయకులు గ్రూపు రాజకీయాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే ప్రజలే తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నాయకులు తమ విభేదాలను పక్కన పెట్టి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలివుల్లా ఖాద్రి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, మేకల రవి, దండు లక్ష్మణ్ , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# ఎఐటియుసిలో చేరికలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అవుట్ సోర్సింగ్ బస్ డ్రైవర్స్ యూనియన్‌కు చెందిన 45 మంది సభ్యులు మంగళవారం ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ సమక్షంలో ఎఐటియుసిలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు గౌరవప్రదమైన వేతనాలు అందడం లేదని, సామాజిక భద్రత కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్, గ్రాట్యుటీ, సెలవులు, వైద్యఖర్చులు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి పోరాడుతుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరగనున్న ఎఐటియుసి రాష్ట్ర మహాసభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.ఎన్.రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎం.ఫయాజ్, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, అవుట్‌సోర్సింగ్ డ్రైవర్ యూనియన్ నాయకులు సాయినాథ్, స్వామి, శ్రీనివాస్, దర్బార్ సింగ్, షకీల్ పాల్గొన్నారు.




# 34 నెలల పాలనలో హామీల అమలేదీ?

## స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు, ఫీజు బకాయిలు ఎప్పుడిస్తారు?

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రశ్న

### విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై వినూత్న నిరసన



**ప్రజాపక్షం /కరీంనగర్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యార్థినులకు ఇస్తామన్న స్కూటీలు, ల్యాప్‌టాప్‌లను, రూ.5 లక్షల విద్య భరోసా కార్డును, పెండింగ్ ఫీజు బకాయిలను అధికారంలోకి వచ్చి 34 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి తన వద్ద విద్యాశాఖ పెట్టుకొని విద్యార్థుల హామీల అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాడని ఆరోపించారు. విద్యార్థులకు ఓట్లు లేవని చిన్నచూపు చూస్తున్నాడని, రాష్ట్రంలో విద్యార్థుల సమస్యల కోసం ప్రతి రోజు రోడ్డు ఎక్కుతున్నారని, సిఎం వద్ద విద్యాశాఖ ఉన్నది కమీషన్ల కోసమేనని, విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డి పతనం తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం కరీంనగర్ నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్కూటీలు, ల్యాప్‌టాప్‌లతో పాటు ఖాళీ పర్సులను ప్రదర్శిస్తూ విద్యార్థులతో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థులు వారి తల్లిదండ్రులు జేబులోంచి సర్టిఫికేట్ల కోసం కళాశాలకు ఫీజులు కట్టాల్సిన పరిస్థితి దాపురించిందని, దీంతో పర్సులు ఖాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినీలకు ఇస్తామన్న స్కూటీలు, ల్యాప్‌టాప్‌లను యువ వికాసం పేరుతో రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నాం అని చెప్పే ముఖ్యమంత్రి విద్యార్థుల హామీలను అమలు చేయకోపోవడానికి కారణం ఏంటనీ నిలదీశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఓట్లతో బుద్ధి చెప్పే రోజు తొందరలోనే ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటం ఆడకుండా విద్యా రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, బడ్జెట్‌లో 15 శాతం నిధులివ్వాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు కేవలం ప్రచారానికే పరిమితం కాకుండా వాటిని అమలు చేసి విద్యార్థుల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. తన వద్ద పెట్టుకున్న విద్యాశాఖకు న్యాయం చేయకుంటే విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించి, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని, లేనిపక్షంలో ఢిల్లీ తరహాలో ఉద్యమాన్ని తెలంగాణ గల్లీలలో విద్యార్థులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, విద్యార్థి నాయకులు నూనావత్ శ్రీనివాస్ నాయక్, జోష్ణ, సందీప్ రెడ్డి, బోయిని విష్ణు, అరవింద్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆగస్టు 23, 24 తేదీల్లో సత్తుపల్లి పట్టణంలో ఎఐటియుసి 17వ జిల్లా మహాసభలు ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతంగా జరిగాయని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు తెలిపారు. గిరిప్రసాద్ భవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజి క్లెమెంట్‌తో కలిసి శింగు నర్సింహారావు మాట్లాడారు. కార్మికుల హక్కులే లక్ష్యంగా భవిష్యత్తు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలన్నారు. శతాబ్ద కాలంగా పోరాటాలు, త్యాగాలతో కార్మిక వర్గం సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మరల పునరుద్ధరించాలన్నారు. కార్మికుల శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని కనీస వేతనం రూ. 26 వేలు అమలుకై పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గంపైనే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం అంగన్‌వాడీలకు రూ.18వేల వేతనం, మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10వేలు అమలు చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మహాసభలలో ఖమ్మం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమను ప్రోత్సహించి ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని, ఖమ్మం జిల్లా కేంద్రంగా ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని, సత్తుపల్లిలో ఆటో నగర్‌ను ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టకొట్టే సెంట్రల్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తదితర తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని శింగు నర్సింహారావు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని 21 మండలాల నుంచి ఎఐటియుసి అనుబంధ రంగాల నుండి 600 మంది కార్మిక ప్రతినిధులు హాజరయ్యారన్నారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాదె లక్ష్మి నారాయణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సీతామహాలక్ష్మి, పగడాల మల్లేష్, గొడ్డుగొర్ల శ్రీను, కోశాధికారి ఏనుగు గాంధీ, జిల్లా కార్యదర్శులు పేరబోయిన మోహన్‌రావు, నకిరికంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శివరామకృష్ణ, రామాంజనేయులు



మహాసభల సందర్భంగా ఎఐటియుసి ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని 77 మందితో నూతన కౌన్సిల్, 21 మందితో ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నట్లు శింగు నర్సింహారావు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా రావి శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తోట రామాంజనేయులు రెండవ సారి ఎన్నికయ్యారన్నారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గాదె లక్ష్మి నారాయణ, ఉప ప్రధాన కార్యదర్శిగా నిమ్మటూరి రామకృష్ణ, కోశాధికారిగా ఏనుగు గాంధీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

## టిపిసిసి సోషల్ మీడియా చైర్మన్‌గా నవీన్ పెట్టెం బాధ్యతలు స్వీకరణ



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** టిపిసిసి సోషల్ మీడియా నూతన చైర్మన్‌గా నవీన్ పెట్టెం పదవీ బాధ్యతలు స్వీకరించారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలో ఆయనతో పాటు నూతనంగా నియమితులైన సోషల్ మీడియా కన్వీనర్లు, కోఆర్డినేటర్లు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపి, టిపిసిసి మీడియా చైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయి సమస్యలను పిసిసి అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను 100 స్థానాల్లో గెలిపించి మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## తుంగభద్ర నీటి వాటాపై ప్రభుత్వ నిర్లక్ష్యం

మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తుంగభద్ర నది జలాల వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తుంగభద్ర నుంచి నీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం బోర్డుకు ఇండెంట్ పెట్టలేదని, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నీటిని వినియోగించుకుంటున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ విషయంలో ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆర్‌డిఎస్‌ను కూడా తుంగభద్ర బోర్డు పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు కోసం కర్ణాటక భూసేకరణ చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని, వరద లేని సమయంలోనే ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారని, ట్రిబ్యునల్ ముందు వాదనల కోసమే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం దీన్ని వెంటనే అడ్డుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే జై పాల్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర రైతాంగం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరుపైనే, 300 కిలోమీటర్ల మేర ప్రవహించే కృష్ణా నదిపైనే సరైన అవగాహన లేదని విమర్శించారు.

## మిడిమిడి సమాచారంతో మాట్లాడొద్దు



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనపై నగ, నగ సమాచారం ఉన్న నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని భువనగిరి ఎంపి, టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. సిఎం యూకే పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్రం అమెరికా పర్యటనకు ఇవ్వకపోవడం ఎప్పుడూ జరగలేదన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన సెమీకండక్టర్ పరిశ్రమలను గుజరాత్‌కు ఎందుకు తరలించారని ప్రశ్నించారు. మూసీ, ఆర్ఆర్ఆర్, మెట్రో అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. నీతి ఆయోగ్ ప్రకారం దేశంలో 8.7 కోట్ల మందికి విద్య, శిక్షణ లేదని, అలాంటప్పుడు వికసిత్ భారత్ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో సిఎం రేవంత్‌రెడ్డి విద్య, అభివృద్ధిపై ప్రాధాన్యం ఇస్తుంటే బిఆర్ఎస్, బిజెపినాయకులు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆ రెండు పార్టీలు తమ తమ సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు సమర్థంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

## ఫొటోగ్రాఫర్ శేఖర్‌కు అవార్డు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ ఫోటోగ్రఫీ రంగంలో 15వ హానరరీ గ్రాండ్ మాస్టర్ అవార్డును హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఫోటోగ్రాఫర్ ఎం.సి.శేఖర్ పొందారు. సృజనాత్మక ఫోటోగ్రఫీ రంగంలో విశిష్ట సేవ, అసాధారణ కళాత్మక విజయాలు, ప్రపంచ కళా ఛాయా చిత్ర సమాజానికి చేసిన కృషికి గాను ధ్యానధిత్తురాలను గుర్తిస్తూ, ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం 2026ను పురస్కరించుకుని 'టర్కీ'కి చెందిన ప్రముఖ అంతర్జాతీయ ఫోటోగ్రామ్ ఫోటో క్లబ్ ఈ సంస్థ ద్వారానికి గాను హానరరీ గ్రాండ్ మాస్టర్ ప్రతిష్ఠను ఎం.సి.శేఖర్‌కు ప్రకటించింది. సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ వ్యవస్థాపకులుగా ఉన్న ఎం.సి. శేఖర్ గత 36 సంవత్సరాలుగా సూజు కాలంతిని ఉపయోగించిది గిరిజన సంస్కృతి, జీవనశైలిని చిత్రీకరించడంలో ఆయన చేసిన విశిష్టమైన కృషికి ఇప్పటికే 1000కి పైగా అంతర్జాతీయ అవార్డులు, 170కి పైగా ఫోటోగ్రఫీ అనర్స్ పొంది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ ప్రోత్సాహం కోసం వివిధ ఉచిత ఫోటోగ్రఫీ శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఫోటో పోటీలు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాని, అసాధారణమైన గ్లోబల్ పోర్ట్‌ఫోలియోలు కలిగి, అంతర్జాతీయ ఛాయా చిత్ర రంగంలో విజయాలు మరియు ఛాయాచిత్రకళాభివృద్ధికి అందించిన విస్తృతమైన సహకారానికి గుర్తింపు గా అంతర్జాతీయ ఫోటోగ్రఫీ సంస్థలు తనకు అత్యున్నత జీవితకాల పురస్కారలను అందించినందుకు ఎం.సి. శేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

## కేంద్ర పథకాల ప్రయోజనాలు రైతులకు పూర్తిస్థాయిలో అందాలి

రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి సూచించారు.వ్యవసాయ, ఉద్యాన శాఖల మధ్య సమన్వయంతో పాటు క్షేత్రస్థాయిలో పథకాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆయన అన్నారు. మంగళవారం హైదరాబాద్ బిఆర్‌కె భవన్‌లో కమిషన్ కార్యాలయంలో కోదండరెడ్డి అధ్యక్షతన వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది . ఈ సందర్భంగా పిఎంకిసాన్, సాయిల్ హెల్త్, ఫార్మ్ మెకనైజేషన్, ఆర్‌కెవై, ఎస్‌ఎంఎ, కాటన్ మిషన్ తదితర పథకాలతో పాటు ఉద్యాన శాఖలోని వివిధ పథకాల అమలు, పురోగతిని సమీక్షించారు. కోదండరెడ్డి మాట్లాడుతూ పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా వాటి ప్రయోజనాలు వాస్తవంగా రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు ఎస్. రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బిసిల హక్కుల కోసం పోరాటాలు మరింత ముందుకు

మంత్రి పొన్నం ప్రభాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు బిపి మండల్ జయంతి సందర్భంగా రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన తరగతుల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేసి వారి అభ్యున్నతికి మార్గం చూపిన బిపి మండల్ సేవలు చిరస్మరణీయమన్నారు. బిసిలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడంలో మండల్ కమిషన్ సిఫార్సులు చారిత్రాత్మక మైలురాయిగా నిలిచాయని పేర్కొన్నారు. బిసిలు విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు పొందాలన్నదే మండల్ కమిషన్ లక్ష్యమని మంత్రి తెలిపారు. బిసిల అభివృద్ధికి రిజర్వేషన్లతో పాటు విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో బిసిల సంక్షేమం, అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ప్రజా పాలన ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బిసి యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**బిసిల హక్కుల కోసం మండల్ స్ఫూర్తితో ఉద్యమించాలి**

బిసిలకు 27 శాతం రిజర్వేషన్ల సాధనకు తొలి అడుగు వేసిన బిపి మండల్ సేవలు చిరస్మరణీయమని తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. బిపి మండల్ 108వ జయంతి సందర్భంగా బిసి కమిషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బిసిలకు ఆర్థిక, సామాజిక స్థిరత్వం వచ్చే వరకు రిజర్వేషన్లు కొనసాగాలని నిరంజన్ పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ తీర్మానం మేరకు రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం ప్రకటించిన కులగణనలో బిసి కులాల వివరాల ప్రస్తావన లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. రాష్ట్రాల వారీగా బిసి కులాల జాబితాను పొందుపరిచి, డ్రాప్‌డౌన్ విధానంలో కుల వివరాలను సేకరించాలని కేంద్రాన్ని కోరారు. కార్యక్రమంలో బిసి కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మి రంగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**జాతీయ జనగణనలో బిసి కులగణన చేర్చాలి: టిపిసిసి ఒబిసి నేతలు డిమాండ్**

జాతీయ జనగణనలో బిసి కులగణనను చేర్చాలని టిపిసిసి ఒబిసి విభాగం నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బి.పి.మండల్ 108వ జయంతిని పురస్కరించుకుని టిపిసిసి ఒబిసి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని జనాభా లెక్కల సేకరణ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ దాసరి రాజు సుబ్బరాజుకు వినతి పత్రం అందజేశారు. కులగణన ద్వారా బిసిల వాస్తవ జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు లభిస్తాయని, వాటి ఆధారంగా సంక్షేమం, విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యానికి సరైన విధానాలు రూపొందించవచ్చని నాయకులు తెలిపారు.డాక్టర్ . కేతూరి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీపీ మండల్ సేవలను స్మరించుకున్నారు. జాతీయ జనగణనలో బీసీ కులగణన చేర్చే వరకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని ఒబిసి నాయకులు స్పష్టం చేశారు.



## ఫీజులిచ్చేంత వరకు తీవ్రస్థాయిలో ఉద్యమిస్తాం

- రూ.కోట్లు వస్తున్నా.. పేదల విద్యకు బడ్జెట్ లేదంటావా?
- విద్యార్థుల కలెక్టరేట్ ముట్టడిలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** 'కోట్ల విలువైన భూములు అమ్ముతున్నారు, లక్షల కోట్లు అప్పులు తెస్తున్నారు. నెలకు రూ.20 వేల కోట్ల ఆదాయం వస్తుంది. కేంద్ర ప్రభుత్వ నిధులొస్తున్నాయి. కానీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థుల చదువుకు బడ్జెట్ లేదా? అని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ఖబడ్దార్ ఇక ఊరుకోం.. ఫీజులిచ్చేంత వరకు తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. రూ.8వేల కోట్ల పెండింగ్ ఫీజులివ్వాలని, ఫీజుల స్కీంను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్‌లు రాందేవ్ మోదీ, నిఖిల్ పటేల్ అధ్యక్షతన వందలాది మంది విద్యార్థులు హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. "ఏడాదికి ఫీజుల స్కీంకు రూ.2,500 కోట్లు అయితే, ఇందులో రూ.500 కోట్లు కేంద్ర ప్రభుత్వమే ఇస్తది. కేవలం రూ.2వేల కోట్లు ప్రభుత్వానికి ఇవ్వటానికి మనసొప్పటం లేదా?'' అని నిలదీశారు. రాష్ట్రంలో లక్షల కోట్ల అవినీతి జరుగుతుందని ఆరోపించారు. పేద విద్యార్థుల చదువుకు బడ్జెట్ లేదనటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తుంటే అగ్రకు ల పాలకులు ఓర్వలేక, ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంను ఎత్తేసే కుట్రకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ బిసి, ఎస్‌సి, ఎస్‌టి నేతలు ఫీజుల స్కీం కొనసాగించేలా, బకాయిలు చెల్లించేలా సిఎం రేవంత్ రెడ్డిపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్యమం చేస్తామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బిసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు జి.అనంతయ్య, బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్, నేతలు చిక్కుడు బాలయ్య, సంఘం నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఫీజుల బకాయి విడుదల వరకు.. బిజెపి పోరాటం కొనసాగుతుంది

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు దీక్ష విరమణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు చేపట్టిన 'ఫీజుల బకాయి – బిజెపి లడాయి' మహా నిరాహార దీక్ష మంగళవారం ముగిసింది. వైద్యుల సూచన మేరకు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్ష విరమించిన అనంతరం రామచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ బకాయిలను పూర్తిగా విడుదల చేసే వరకు బిజెపి ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల కోసం మరింత ఉధృతంగా పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ దీక్షకు రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు, యువత, విద్యాసంస్థల ప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. ప్రభుత్వ ని ర్బంధాలు, పోలీసు ఆంక్షల మధ్య కూడా దీక్ష విజయవంతమైందన్నారు. యువమోర్చా సేకరించిన ఐదు లక్షల మంది విద్యార్థుల సంతకాల పత్రాలను ఈ సందర్భంగా సమర్పించింది. డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు బిజెపి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడవద్దని, వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, ఫీజుల బకాయిలు చెల్లించడంలో జాప్యానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆర్. కృష్ణయ్య, ఎంపిలు ఈటల రాజేందర్, డి.కె. అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో కొనసాగుతున్న.. అక్రమ నిర్మాణాల కూల్చివేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను అధికారులు ముమ్మరం చేశారు. సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు మంగళవారం మూడు జోన్‌లలో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 17 అనధికార నిర్మాణాలను కూల్చివేశారు. కూల్చివేసిన నిర్మాణాల్లో శేరిలింగంపల్లి జోన్‌లో 7, కూకట్‌పల్లి జోన్‌లో 2, కుత్బుల్లాపూర్ జోన్‌లో 8 నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అదనంగా గుర్తించిన అనధికార నిర్మాణాలకు సంబంధించి 11 యుసి (అన్‌ఆథరైజ్డ్ కన్‌స్ట్రక్షన్) నోటీసులు జారీ చేశారు. మైక్యూర్, ప్రజావాణి ఫిర్యాదులు, అలాగే అధికారుల క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా మొత్తం 54 అనధికార నిర్మాణాలను గుర్తించినట్లు వెల్లడించారు. ప్రారంభ దశలోనే అక్రమ నిర్మాణాలను గుర్తించి, సకాలంలో చర్యలు తీసుకునేలా గుర్తింపు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనధికార నిర్మాణాలపై ప్రతిరోజూ క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిర్వహించాలని, భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను కమిషనర్ ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, భవన నిర్మాణ నిబంధనల అమలును మరింత బలోపేతం చేసేందుకు మూడు జోన్‌లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను సిఎంసి నిరంతరం కొనసాగించనున్నట్లు చెప్పారు.

## లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనేత హరీశ్ రావు

సెప్టెంబర్ 7లోగా జిఒ 97 రద్దు చేయకపోతే సెక్రటేరియట్ ముట్టడి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని బిఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు విమర్శించారు. జిఒ నెంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు హరీశ్ రావు మంగళవారం సంఘీభావం తెలిపారు. కళాశాల వద్దకు నేరుగా చేరుకున్న ఆయన, తానూ అదే కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థినని గుర్తు చేస్తూ, ఒక ప్రజాప్రతినిధిగానే కాక పూర్వ విద్యార్థిగా కూడా విద్యార్థులకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఐటిఐలతో కలిపి స్కిల్ యూనివర్సిటీకి అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. స్కిల్ యూనివర్సిటీ అనేది పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో నడిచే ప్రైవేటు సంస్థ అని, దానికి కేవలం మూడేళ్లు మాత్రమే ప్రభుత్వ మద్దతు లభిస్తుందని, ఆ తర్వాత అది పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుందని సంబంధిత చట్టంలోనే స్పష్టంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 113 పాలిటెక్నిక్ కళాశాలల్లో 59 ప్రభుత్వ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర జరుగుతోందని, దీనివల్ల లక్ష మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రూ.15 వేల ఫీజుతో పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసుకుని ల్యాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజనీరింగ్‌లో చేరే అవకాశం విద్యార్థులకు ఉందని, స్కిల్ యూనివర్సిటీలో విలీనమైతే ఈ అవకాశం కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులు సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే లోపు జి.ఓ 97ను రద్దు చేయాలని, లేని పక్షంలో లక్ష మంది విద్యార్థులకు అండగా బిఆర్‌ఎస్ పక్షాన పోరాటానికి సిద్ధమని, అవసరమైతే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హరీశ్ రావు హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నమని ఆరోపిస్తూ, పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## గురుకుల సీట్ల భర్తీపై బిసి కమిషన్ ఆరా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ గురుకుల సొసైటీల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయకపోవడంపై బిసి కమిషన్ స్పందించింది. సీట్ల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు నెల రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారంటూ వచ్చిన వార్తలను కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ అంశంపై 10 రోజుల్లో సమగ్ర వివరణ ఇవ్వాలని ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్ఇఐ సొసైటీ కార్యదర్శి బి. సైదులును బిసి కమిషన్ ఆదేశించింది. సీట్ల భర్తీలో అవకతవకలు జరుగుతున్నాయంటూ వచ్చిన ఆరోపణలపై కూడా వివరాలు సమర్పించాలని సూచించింది. అలాగే విద్యార్థులు, తల్లిదండ్రులకు సరైన సమాచారం అందించేందుకు ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్ఇఐ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పా టు చేయాలని కమిషన్ ఆదేశించింది. కార్యాలయాలకు వచ్చే వారికి ఖాళీ సీట్లు, భర్తీ ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించాలని సూచించింది.

## నకిలీ, షెల్ సంస్థల పేరుతో రూ.464 కోట్ల విదేశీ చెల్లింపుల వ్యవహారంలో సిఎపై కేసు

నకిలీ సంస్థలకు ఫారమ్-15సిబి ధ్రువీకరణ ఇచ్చారన్న ఆరోపణలు..

సిసిసిఎస్‌లో కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నకిలీ, షెల్ సంస్థల పేరుతో ఏకంగా రూ.464.81 కోట్లను విదేశాలకు తరలించేందుకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారన్న ఆరోపణలపై చార్టర్డ్ అకౌంటెంట్ హరి శంకర్ రెడ్డి రెనాటిపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదాయపన్ను శాఖ ధర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా ఈ కేసు నమోదైంది. ఆదాయపన్ను శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి. కృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ పి. గోపాల్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆదాయపన్ను శాఖ వివరాల ప్రకారం.. పుణేకు చెందిన క్లిక్‌విన్ టెక్నో సొల్యూషన్స్ ఎల్‌ఎల్‌పి, విశాఖపట్నానికి చెందిన స్టాక్‌పైల్ సాఫ్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేర్లతో 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.464,81,23, 130 విదేశాలకు పంపినట్లు గుర్తించారు. ఈ సంస్థలు తమ నమోదిత చిరునామాల్లో వాస్తవంగా లేవని, ముఖ్యంగా స్టాక్‌పైల్ సాఫ్‌టెక్ సొల్యూషన్స్ సంస్థ ఇచ్చిన చిరునామాలో గత కొన్నేళ్లుగా మరో సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆదాయపన్ను శాఖ విచారణలో తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విదేశాలకు నిధుల బదిలీకి అవసరమైన ఫారమ్ 15 సిబిలను సిఎ హరి శంకర్ రెడ్డి సరైన పత్రాలు, ఖాతాలు పరిశీలించకుండానే ధ్రువీకరించారని ఆదాయపన్ను శాఖ ఆరోపించింది. సంబంధిత సంస్థలు భారీగా విదేశీ చెల్లింపులు చేసినప్పటికీ ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేయలేదని ఫిర్యాదులో పేర్కొంది.ఈ నెల 18న సిఎ నివాసం, కార్యాలయంలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లభించిన పత్రాలు, ఆయన వాంగ్మూలం ఆధారంగా విదేశీ చెల్లింపుల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.తప్పుడు ధ్రువీకరణల కారణంగానే భారీ మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం దేశం నుంచి బయటకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడిందని ఆదాయపన్ను శాఖ పేర్కొంది. ఈ వ్యవహారం దేశ ఆర్థిక వ్యవస్థ, విదేశీ మారక నిల్వలపై ప్రభావం చూపే తీవ్ర అంశంగా అభివర్ణించింది. ఆదాయపన్ను శాఖ ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణల ఆధారంగా సిసిఎస్ పోలీసులు ఐపిసి 420, 193, 197, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ వ్యవహారంలో మరెవరైనా మధ్యవర్తులు, సంస్థలు భాగస్వాములుగా ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

## ఎఫ్ఐఆర్ రద్దు కేసులో ఎల్‌పిఎకు అవకాశం లేదు

క్రిమినల్ జ్యూరిస్డిక్షన్ అంశాల్లో ఇంట్రా కోర్టు అప్పీల్ చెల్లదన్న హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఫ్ఐఆర్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వచ్చిన లెటర్స్ పేటెంట్ అప్పీల్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఎఫ్ఐఆర్ రద్దు అంశం క్రిమినల్ జ్యూరిస్డిక్షన్ పరిధిలోకి వస్తుందని, ఇలాంటి వ్యవహారాల్లో లెటర్స్ పేటెంట్ కింద ఇంట్రా కోర్టు అప్పీల్ దాఖలు చేయడానికి అవకాశం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషన్‌కు పెట్టిన పేరు కంటే అందులో కోరిన ఉపశమనం, దాని ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రైవేటు భూవివాదం నేపథ్యంలో నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. భూమికి సంబంధించిన సివిల్ కేసులు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్నప్పటికీ పోలీసులు తమపై ఒత్తిడి తెస్తున్నారని వారు వాదించారు. ఆరో ప్రతివాది ఫిర్యాదు ఆధారంగా అక్రమ ప్రవేశం, ఆస్తి ధ్వంసం, దుర్భాషలు, బెదిరింపులకు సంబంధించిన ఆరోపణలతో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ కూడా దాఖలైందని ప్రభుత్వం తెలిపింది. ఎఫ్ఐఆర్ రద్దుకు సింగిల్ జడ్జి నిరాకరించడంతోపాటు చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. ఈ ఉత్తర్వులపై దాఖలైన అప్పీల్‌ను విచారించిన ధర్మాసనం.. అది నిర్వహణార్హం కాదని తేల్చి కొట్టివేసింది. పిటిషనర్‌కు చట్టప్రకారం అందుబాటులో ఉన్న ఇతర పరిహార మార్గాలపై ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని స్పష్టం చేసింది.

## ఢిల్లీలో కేజీ ఉల్లి ధర రూ.35లకే ప్రభుత్వ విక్రయం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ నగరంలో కేజీ ఉల్లిపాయలను 35 రూపాయలకే విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉల్లిపాయల ధరలు పెరగడంతో నాసిక్ నుండి ఈ నిల్వలను కొన్ని కేంద్రాలకు విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న సగటు చిల్లర వర్తకం ధరతో పోలిస్తే వినియోగదారులకు దాదాపు 36 శాతం మేరకు రాయితీ లభిస్తుంది. మొత్తం 800 టన్నుల కూరగాయల సరఫరాతో వినియోగదారులకు ఉపశమనం లభిస్తుంది. బుధవారంనాడు కాండా ఎక్స్‌ప్రెస్‌లో ఈ సరుకు ఢిల్లీకి చేరుతుంది. జాతీయ రాజధానిలో నాఫెడ్,ఎన్‌సిసిఎఫ్,కేంద్రీ భాండార్ స్టోర్స్ ద్వారా ఉల్లిపాయలను రిటైల్ మార్కెట్‌లో విక్రయిస్తున్నామని వినియోగ వ్యవహారాల విభాగం కార్యదర్శి నిధి ఖారే మంగళవారం సోషల్ మీడియా వేదికగా చెప్పారు.భారీమొత్తంలో రైల్వే ద్వారా ఉల్లిపాయలను చెన్నై,ఎర్నాకుళం, మధురై, గువహటి కేంద్రాలకు కూడా తరలిస్తున్నామని చెప్పారు. ఒక్కనెల రోజుల సమయంలోనే దేశవ్యాప్తంగా సగటున ఉల్లిపాయల రిటైల్ విక్రయం ధర 28 శాతం కంటే ఎక్కువగా పెరిగింది. ఆగస్టు 25వ తేదీ నాటికి కేజీ ఉల్లిపాయల ధర రూ. 44.72లకు చేరుకుంది. జులై 25న ఈ ధర రూ.34.80లు ఉండేది. ఏడాది క్రితం ఆగస్టు 25న ఉల్లిపాయల ధర కేజీ రూ.28.67లు ఉండేది. అంటే గణనీయస్థాయిలో 56 శాతం మేరకు ధర పెరిగింది. ప్రధాన నగరాలలో ఈ పెరుగుదల బాగా ఉంది.



## ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/చిట్యాల:** అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రజా సంక్షేమ పథకాలు చేరువవుతాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. పట్టణంలో మంగళవారం రోజున స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వార పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రజా పక్షం పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి సిఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిసిసిడి వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పందిరి గీతారమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, మున్సిపల్ కమీషనర్ గురులింగం, ఎంపిడివో జెల్లా పాండు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల్లో భాగస్వాములు కావాలి

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, మండల అధికారులు ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ పి. ఝాన్సీ అధ్యక్షతన గ్రామ పంచాయితీల అభివృద్ధి, సామర్థ్యం వృద్ధి కార్యక్రమాలపై మండల సర్పంచులు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలను నాటారు. విద్యుత్, వ్యవసాయ, అంగన్‌వాడీ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక రవాణాకు బుకింగ్‌తో సంబంధం లేకుండా వెసులుబాటు కల్పించేలా కలెక్టర్‌తో మాట్లాడుతానని సర్పంచులకు హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ ఝాన్సీ, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రాజ్యాంగ విలువల పరిరక్షణకు న్యాయవాదులు ముందుండాలి: ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి

## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఐఎఎల్ ఉద్యమాలు

**ప్రజాపక్షం/నల్లగొండ:** భారత రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు న్యాయవాదులు నిరంతరం పోరాడాలని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేపల్లి ఆదిరెడ్డి అన్నారు. ఐఎఎల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కట్ట అనంత రెడ్డి అధ్యక్షతన జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మల్లేపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం వంటి విలువలను పరిరక్షించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు.ప్రజల హక్కులు,స్వేచ్ఛలను కాపాడేందుకు న్యాయవాదులు చట్టపరంగానే కాకుండా ప్రజా ఉద్యమాల్లోనూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ఐఎఎల్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు.జూనియర్ న్యాయవాదులు వృత్తిలో స్థిరపడే వరకు ప్రభుత్వం అందిస్తున్న స్టైఫండ్‌ను గణనీయంగా పెంచాలని డిమాండ్ చేశారు.జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు,వృత్తి పరమైన శిక్షణ,న్యాయ గ్రంథాలు,డిజిటల్ వనరులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.న్యాయవాదుల కుటుంబాలకు మెరుగైన వైద్య సదుపాయాలు,ఆరోగ్య బీమా కల్పించాలని అన్నారు.న్యాయవాదులపై దాడులు,బెదిరింపులను అరికట్టేందుకు సమగ్ర రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు చురుకుగా పాల్గొని ఐఎఎల్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గుండె వెంకటేశ్వర్లు, జి. జవహర్‌లాల్, ఐఎఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన వెంకన్న, గుర్రం వెంకట్‌రెడ్డి,నజీరుద్దీన్, పందుల సైదులు,ఆవుల ప్రేమ్ సుందర్,బరిగెల వెంకటేష్,అయిలేశ్,బరిగెల నాగేష్,శివ ప్రసాద్,బుచ్చిరాములు,అరుణ్ కుమార్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## బాలసదన్,శిశుగృహాల సందర్శన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆగస్టు నెల కార్యకలాపాల షెడ్యూల్‌లో భాగంగా నల్లగొండ జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు గొల్ల మంగళవారం బాలసదన్,శిశుగృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా బాలసదన్,శిశుగృహాల్లో కొనసాగుతున్న నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు.అక్కడ ఉన్న పిల్లలకు అందిస్తున్న ఆహారం, వసతులు, ఇతర సౌకర్యాల నాణ్యతను పరిశీలించడంతో పాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. బాలసదన్‌లోని పిల్లల విద్యాభ్యాసం, వారి సంక్షేమం, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై ఆమె ఆరా తీశా రు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయనే విషయాలను తెలుసుకున్నారు. అనంతరం బాలసదన్,శిశుగృహాల్లో పనిచేస్తున్న సిబ్బందికి వివిధ చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల హక్కులు, వారి సంక్షేమం, సంరక్షణకు సంబంధించిన చట్టాలను సక్రమంగా అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. పిల్లలకు మెరుగైన వసతులు, సంరక్షణ అందేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

### నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి

# నర్సింగ్ సిబ్బంది ఆందోళన

డిప్యూటీ సూపరింటెండెంట్ నాగేశ్ తీరుపై తీవ్ర ఆరోపణలు

ప్రాథమిక వసతులు లేక నర్సుల అవస్థలు.. 14 మందికి మెమోలు ఇవ్వడంపై నిరసన జ్వాలలు



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది సమస్యలు మరోసారి భగ్గుమన్నాయి. ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించకపోగా,తమపై అనవసర ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపిస్తూ నర్సింగ్ సిబ్బంది ఆందోళనకు దిగారు. డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన తెలిపారు. మహిళా ఉద్యోగులతో అనుచితంగా,అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని ఆరోపిస్తూ నర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తాగునీరు, వాష్‌రూమ్‌లు,డ్రెస్సింగ్ రూమ్‌లు, భద్రత, పారిశుధ్యం వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా అందడం లేదని ఆరోపించారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా వాటికి నర్సింగ్ సిబ్బందినే బాధ్యులను చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. సౌకర్యాల కొరత, సెక్యూరిటీ సమస్యలు, పారిశుద్ధ్య లోపాలను ముందుగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెలలో 14 మంది మహిళా నర్సింగ్ ఆఫీసర్లకు మెమోలు జారీ చేయడం పైనా సిబ్బంది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించకుండా నర్సులపై చర్యలు తీసుకోవడం వల్ల ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వాపోయారు. నాలుగేళ్లుగా అన్నీ భరిస్తున్నాం.. ఇక భరించలేక బయటకు వచ్చాం అంటూ నర్సింగ్ సిబ్బంది తమ ఆవేదనను వ్యక్తం చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌పై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని నర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస మౌలిక వసతులు కల్పించాలని,ఉద్యోగులపై అనవసర ఒత్తిడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నర్సింగ్ సిబ్బంది ఆందోళనతో ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న పరిస్థితులపై చర్చ మొదలైంది. సిబ్బంది ఆరోపణలపై ఆసుపత్రి ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## కార్మికులను పట్టించుకోని కేంద్రం

కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి :** కేంద్ర ప్రభుత్వానికి కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదని, కార్మిక రంగాన్ని పట్టించుకోవడంలేదని కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ విమర్శించారు. అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. ఎఐటియుసి కామారెడ్డి జిల్లా నాల్గవ మహాసభలు మంగళవారం కామారెడ్డి పట్టణం లోటరీ క్లబ్‌లో జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. బాలరాజు, ఉమారాణి శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా బాల్‌రాజు జెండావిష్కరించారు. అనంతరం ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి బాలరాజు అధ్యక్షతన మహాసభలు ప్రాంభమయ్యాయి. సభలో కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో నిత్యావసర రోజు రోజుకు పెరుగుతుండడం వల్ల నిరుపేద కార్మికులు బతికే పరిస్థితులు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పని భద్రత కల్పించడం లేదని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘం ఎఐటియుసి అని ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుంటానని హామీనిచ్చారు. అనంతరం బాలరాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అంబానీ, అదానీకి కేంద్రం కట్టబెడుతోందని, బతకడానికి కనీస వేతనం లేక కార్మికుడు కార్మికుడుగానే మిగిలిపోతున్నారన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం మేల్కొకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున కార్మిక సంఘాలను కలుపుకొని దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎఐటియుసి నాలుగవ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 6 నుండి 8 వరకు కరీంనగర్ పట్టణంలో జరగనున్నాయని, 6న భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి బాలరాజ్, జిల్లా అధ్యక్షులు ఎస్ బాలరాజ్, ఉపాధ్యక్షులు దశరథ్, లక్ష్మ ణ్, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి సమరశీల పోరాటాలు



ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/నల్లగొండ :** కార్మిక హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతూ కార్మికులకు అండగా ఉంటుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు.ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.మంగళవారం నల్లగొండలో ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుంచి విముక్తి కోసం జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో కార్మిక వర్గాన్ని సంఘటితం చేసి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వతంత్ర సాధనే ధ్యేయంగా వీరోచిత పోరాటాలు చేసిన గొప్ప కార్మిక సంఘం ఎఐటియుసి అని అన్నారు. సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు జిల్లా నుంచి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీస్ రెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శి ఎండి జానీ,వి.లెనిన్,గుండె రవి, వెంకన్న, ఎం.నందం,బాసాని వెంకటయ్య, పెద్ది నాగరాజు,ఎన్ఆర్‌సిరాజు, యూసుఫ్, పాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక ర్యాలీని జయప్రదం చేయాలి : మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే ఏఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కార్యాలయంలో మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై స్పష్టమైన వైఖరితో అజెండాతో ముందుకు వెళ్తున్న ఏకైక కార్మిక సంఘం ఏఐటియుసి అన్నారు. అలాంటి సంఘం మహాసభలను జయప్రదం చేయడం ద్వారా ఈ దేశంలో రాష్ట్రంలో పరిపాలిస్తున్న పాలకుల యొక్క పనితీరును మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తు పోరాట కార్యక్రమంలో దిశా నిర్దేశం చేసే విధంగా ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ పేరుతో నల్ల చట్టాలను ముందుకు తీసుకువచ్చారని ఆ చట్టాలను రద్దు చేసే వరకు మా పోరాటం ఆగదని తీర్మానాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చామల అశోక్, గౌరవాధ్యక్షులు దంతాల రాంబాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, టైలర్స్ యూనియన్ అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్, హమాలీ యూనియన్ నాయకులు ఈటె దాసు, పరుశరాములు పాల్గొన్నారు.




## చోరీ కేసులో నిందితుల రిమాండ్

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఈనెల 21న అర్ధరాత్రి అర్వపల్లిలోని రిషిత1 వైన్‌షాప్ షట్టర్‌ను పగులగొట్టి మద్యం, నగదును దొంగతనం చేసిన కేసులో ముగ్గురు నింధితులను మంగళవారం అరెస్టు చేసి, తుంగతుర్తి కోర్టులో రిమాండ్ చేసినట్లు నాగారం సిఐ నాగేశ్వర రావు తెలిపారు. అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నింధితుల వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం అర్వపల్లిలో ఎస్ఐ మధు ఆధ్వర్యంలో జరిపిన వాహనాల తనిఖీలో టిఎస్29 ఏటిఆర్ 7294 గల హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్‌పై అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ముగ్గురు నింధితులు సిద్ధిపేట పట్టణానికి చెందిన పిన్నోజు రవి, అడివెంల గ్రామానికి చెందిన అనపర్తి దుర్గయ్య, అడివెంల గ్రామానికి చెందిన కర్నాని నరేష్‌ను పట్టుకొని విచారించగా రిషిత1 వైన్స్‌లో చేసిన దొంగతనాన్ని అంగీకరించినట్లు తెలిపారు. ముగ్గురు నింధితుల నుంచి రూ.17వేల200, 3 ఫుల్ బాటిల్స్‌ను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నింధితుడైన పాత నేరస్తుడు రవిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో 20కు పైగా కేసులు ఉన్నట్లు తెలిపారు. దొంగతనం జరిగిన 3 రోజుల్లోనే కేసును చేధించడంలో చాకచక్యంగా వ్యవహరించిన అర్వపల్లి ఎస్ఐ మధు, హెడ్ కానిస్టేబుల్స్ సుధీర్, శ్రీకాంత్, కానిస్టేబుల్స్ లింగయ్య, శ్రీను, కృష్ణ, బాలకృష్ణ, వెంకట్‌లను అభినందించారు.

## రెండు వారాల్లోగా..లొంగిపోవాలి

### జర్నలిస్ట్ తరుణ్ తేజ్‌పాల్‌కు 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ :** బాంబే హైకోర్టు విధించిన 10ఏళ్ల కఠిన కారాగార శిక్షను అనుభవించేందుకు రెండు వారాల్లోగా లొంగిపోవాలని మంగళవారం సుప్రీంకోర్టు జర్నలిస్ట్, తెహెల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌ను ఆదేశించింది. 2013నాటి అత్యాచార కేసులో ఆయనకు బాంబే హైకోర్టు కఠిన కారాగార శిక్షను విధించిన విషయం తెలిసిందే. లొంగిపోవడం నుంచి మినహాయింపును కోరుతూ తరుణ్ తేజ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. సరెండర్ సర్టిఫికెట్ దాఖలుకు లోబడి తన శిక్షను సవాల్ చేస్తూ, తరుణ్ తేజ్‌పాల్ దాఖలు చేసిన అప్పీల్‌ను సుప్రీం కోర్టు సెప్టెంబరు 22న విచారణకు జాబితా చేసింది. తెహెల్కా మాజీ సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్ 2013లో గోవాలో ఆ పత్రిక నిర్వహించిన ఒక కార్యక్రమం సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తన జూనియర్ సహోద్యోగిపై అత్యాచారం చేసినందుకు దోషిగా నిర్ధారించబడ్డాడు. దీనికి ముందు ఈ 62 ఏళ్ల జర్నలిస్ట్ తాను రాజకీయ బాధితుడినని వాదించాడు. ఐదేళ్ల క్రితం ట్రయల్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును రద్దు చేస్తూ, ఆగస్టు 6న హైకోర్టు తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా నిర్ధారించి , అతనికి 10సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. మంగళవారం జరిగిన విచారణలో, తరుణ్ తేజ్‌పాల్ తరుపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ , ఈ సంఘటన 2013నాటిదని, ఈ కేసులో ఆ జర్నలిస్ట్ గతంలో ఆరునెలలు జైలులో గడిపారని తెలిపారు. అప్పటి నుంచి తేజ్‌పాల్ పూర్తిగా బెయిల్‌పైనే ఉన్నారు. నాలుగు వారాలలోగా లొంగిపోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కోర్టు ప్రధాన అప్పీల్‌పై విచారణను ఆగస్టు 31కి వాయిదా వేయవచ్చు' అని ఆయన అన్నారు. గోవా ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, లొంగిపోవడానికి లేదా సుప్రీంకోర్టులో అప్పీల్ ,లొంగిపోవడం నుంచి మినహాయింపు కోసం దరఖాస్తు దాఖలు చేయడానికి వీలుగా హైకోర్టు అతనికి నాలుగు వారాల గడువు ఇచ్చిందని ప్రభుత్వం తెలిపింది. 'ఈ కేసులో యోగ్యత అనేది పరిగణించదగిన విషయం. ఇది తీవ్రమైన అత్యాచారానికి విధించిన పదేళ్ల కఠిన కారాగార శిక్ష' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు.మెహతా వాదనలను ఖండిస్తూ కపిల్ సిబల్ 'ఇది అత్యాచారం కాదు' అని వాదించారు. 'మీరు లొంగిపోవడానికి మీకు ఎంత సమయం కావాలి?' అని తరుణ్ తేజ్‌పాల్ తరపున హాజరైన కపిల్ సిబల్, సీనియర్ న్యాయవాది అమన్ లేఖిలను ఉద్దేశించి ధర్మాసనం ప్రశ్నించింది. లొంగిపోవడానికి తేజ్‌పాల్‌కు రెండు వారాల గడువు ఇవ్వాలని కపిల్ సిబల్ ధర్మాసనాన్ని కోరారు. తిరిగి అప్పగించండి నుంచి మినహాయింపును కోరుతూ తరుణ్ తేజ్‌పాల్ దాఖలు చేసిన దరఖాస్తును ధర్మాసనం కొట్టివేసింది. 'ఒకవేళ లొంగిపోయే ధృవీకరణ పత్రం సెప్టెంబరు 22న లేదా అంతకుముందు దాఖలు చేసినట్లయితే రిజిస్ట్రీ ఈ విషయాన్ని సెప్టెంబరులో జాబితా చేయాలని ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం తెలిపింది.

### పోలీసుల దురాగతాల ఆరోపణలపై..

## విచారణ కమిటీని పునర్‌వ్యవస్థీకరించాలి

### 'సుప్రీం'లో పిటిషన్లపై వాదనలు షురూ

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలు, పోలీసు సిబ్బందిపై జరిగిన హింస ఆరోపణలను పరిశీలించేందుకు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ఉన్నత స్థాయి కమిటీని పునర్ వ్యవస్థీకరించాలని కోరుతూ మంగళవారం సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ ప్రస్తావనకు వచ్చింది.ఈ కూర్పుపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ, పిటిషనర్లలో కొందరి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందు తన వాదనలు వినిపించారు.సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ పిటిషన్‌ను వ్యతిరేకించారు.ఈ పిటిషన్‌ను 'చాలా దురుద్దేశపూరితమైనది' అని వ్యాఖ్యానించారు. 'గౌరవనీయ న్యాయమూర్తులైన మీరు ఏర్పాటుచేసిన కమిటీని పునర్‌వ్యవస్థీకరించాలని, ఒక నిర్దిష్ట మంత్రిపై విచారణ జరిపేందుకు ఫలానా న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఉండాలని కోరుతూ ఈ అభ్యర్థన దాఖలైంది. కానీ ఇది రాజకీయ వేదిక కాదు. ఇక్కడ జరుగుతున్నది వేరే విషయం.కొందరికి ప్రతీ విషయంలోనూ ఎప్పుడూ ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంటుంది' అని మెహతా అన్నారు.అప్పుడు సిజెఐ సూర్యకాంత్ 'జడ్జీల పేర్లను ప్రస్తావించడాన్ని మేం మెచ్చుకోం' అని వ్యాఖ్యానించారు. శంకర్‌నారాయణన్ మాట్లాడుతూ తాను కేవలం దరఖాస్తును జాబితాలో చేర్చాలని మాత్రమే కోరుతున్నానని అన్నారు. 'అప్లికేషన్ జాబితాలో ఉన్నప్పటికీ, నేను పేర్లను ప్రస్తావించను. మాలో ఎవ్వరూ పేర్లను ప్రస్తావించలేదు. మేం ఆ ప్రయత్నాన్ని పక్కన పెట్టి వేరే విధానాన్ని అనుసరించాం. ఇలాంటి పనులు చేయడానికి ఒక పద్ధతి ఉంటుంది. అందువల్ల, ఆ అప్లికేషన్‌ను విచారణ జాబితాలో చేర్చాలని మాత్రమే మేం కోరుతున్నాం' అని శంకర్‌నారాయణన్ అన్నారు. కొంతమంది పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ కూడా శంకర్‌నారాయణన్ ఆందోళనను సమర్థిస్తూ ఇది పిటిషనర్ల 'ఉమ్మడి ఆందోళనను' ప్రతిబింబిస్తుందని అన్నారు. 'పనిచేయాలనుకునే వారెవరైనా మా పర్యవేక్షణలో పనిచేస్తారు. మేం ఈ విషయాన్ని ఇంకా తేల్చలేదు. మీరందరూ కమిటీకి సహాయం చేయడానికే ఉన్నారు. వారిని పనిచేయనివ్వండి, చూద్దాం' అని సిజెఐ సూర్యకాంత్ చెప్పారు.

### ఒబిసి క్రీమీలేయర్ ప్రమాణాలు

# ప్రత్యేక బెంచ్ ఏర్పాటు పరిశీలనకు 'సుప్రీం' ఒకే

**న్యూఢిల్లీ :** సివిల్ సర్వీసెస్ పరీక్ష (సిఎస్ఇ)–2025 అభ్యర్థులకు ఒబిసి క్రీమీలేయర్ నిబంధనలపై మార్చి 11న ఇచ్చిన తీర్పు వర్తిస్తుందా? లేదా? అనే విషయంపై స్పష్టత కోరుతూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్ విచారణకు ఒక ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటును పరిశీలించేందుకు మంగళవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. మార్చి 11 తీర్పుకు ముందు వర్తింపజేసిన ఒబిసి క్రీమీలేయర్ నిర్ధారణ ఆధారంగా, సిఎస్ఇ–2025 కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) సిఫార్సు చేసిన 958 మంది అభ్యర్థుల సర్వీస్ కేటాయింపుతో ముందుకు సాగేందుకు ప్రభుత్వానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ సిబ్బంది, శిక్షణ విభాగం (డిఓపిటి) ఆదేశాలు కోరుతోంది. రోజు విచారణ ప్రారంభంలో, కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఎదుట వాదనలు వినిపిస్తూ, పరిష్కరించబడిన ఒక కేసులో కొన్ని అత్యవసర ఆదేశాలు కోరుతూ డిఓపిటి ఒక అనుబంధ దరఖాస్తును దాఖలు చేసిందని, దానిని జస్టిస్ పి.ఎస్.నర్సింహా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు జాబితా చేయాల్సి ఉందని చెప్పారు. కాగా, ఒక వ్యాజ్యదారుడి తరుపున హాజరైన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే తన వాదనలు వినిపిస్తూ జస్టిస్ నరసింహ, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం మార్చి 11న ఈ ఉత్తర్వును జారీచేసిందన్నారు. న్యాయమూర్తులు ఇప్పుడు వేర్వేరు కూర్పులలో విచారణ జరుపుతున్నందున, ఈ తక్షణ అనుబంధ దరఖాస్తును అదే ధర్మాసనం విచారణ జరపాల్సి ఉంటుందని హెగ్డే వివరించారు. దీనిపై సిజెఐ సూర్యకాంత్ స్పందిస్తూ 'మనం దీని కోసం ఒక ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది' అని అన్నారు. తాను న్యాయమూర్తులతో మాట్లాడి ఆ ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వర్సెస్ రోహిత్ నాథన్ అనే కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి డిఓపిటి ఈ అభ్యర్థనను లేవనెత్తింది. ఆ కేసులో మార్చి 11న కోర్టు, ఇతర విషయాలతో పాటు ఒబిసి క్రీమిలేయర్‌ను గుర్తించడానికి సంబంధించిన సెప్టెంబరు 8, 1993 నాటి ఆఫీస్ మెమోరాండాన్ని అక్టోబర్



14, 2004 నాటి వివరణాత్మక లేఖ అధిగమించలేదని పేర్కొంది. ప్రభుత్వరంగ సంస్థలోగానీ, ప్రైవేట్ రంగంలో గానీ ఉద్యోగం చేస్తున్న తల్లిదండ్రుల జీతం లేదా ఆదాయాన్ని మాత్రమే క్రీమిలేయర్ మినహాయింపునకు నిర్ణయాత్మక ప్రమాణంగా పరిగణించరాదని కోర్టు తెలిపింది. 1993 ఆఫీస్ మెమోరాండానికి అనుగుణంగా తల్లిదండ్రుల పదవి, హోదా, వర్గంతోపాటు నిర్దేశించిన ఆదాయం/సంపద పరీక్షను కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. తాము సుప్రీంకోర్టు తీర్పుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంటూనే, ఆ తీర్పును సిఎస్ఇ–2025కు వర్తింపజేయడం వల్ల, పరీక్ష జరిగినప్పుడు అమలులో ఉన్న చట్టపరమైన స్థితిని బట్టి భిన్నంగా వ్యవహరించినప్పటికీ, ఒకే రకమైన పరిస్థితులలో ఉన్న అభ్యర్థుల పట్ల అసమాన ప్రవర్తనకు దారితీయవచ్చని ప్రభుత్వం తెలిపింది. దరఖాస్తు ప్రకారం, సిఎస్ఇ–2025 నోటిఫికేషన్ జనవరి 22, 2025న జారీచేయబడింది. ప్రిలిమినరీ పరీక్ష మార్చి 25, 2025న జరిగింది. మెయిన్ పరీక్ష ఆగస్టు 22 నుంచి 31వరకు నిర్వహించబడింది. ఐఎఎస్, ఐఎఫ్ఎస్, ఐపిఎస్, ఇతర కేంద్ర సర్వీసులలో నియామకాల కోసం 958మంది అభ్యర్థులను సిఫార్సు చేస్తూ, యుపిఎస్‌సి మార్చి 6, 2026న తుది ఫలితాలను ప్రకటించింది. కేవలం 5 రోజుల తర్వాత మార్చి 11న అత్యున్నత న్యాయస్థానంరోహిత్ నాథన్ తీర్పును వెలువరించింది.ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ (ఎల్‌బిఎస్ఎన్ఎఏ) సిఎస్ఇ–2025 బ్యాచ్ కోసం త్వరలో జరగబోయే కోర్సును , తాత్కాలికంగాఆగస్టు చివరి వారంలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రస్తావించింది.

“మాస్ మహారాజా రవితేజ హార్ట్ విన్నింగ్ బ్లాక్‌బస్టర్ ‘ఇరుముడి’. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్‌తో ఘన విజయాన్ని అందుకుని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.”



## ‘రంభ ఊర్వశి మేనక’ ట్రైలర్‌ను లాంచ్ చేసిన నాగార్జున



అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ ‘రంభ ఊర్వశి మేనక’తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో, అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. పౌరాణిక కథలు, గ్రామీణ హాస్యం, వినోదాత్మకమైన అంశాలతో అలరించనుంది. కింగ్ నాగార్జున ఈ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. సూరి(అల్లరి నరేష్) మొక్కుబడులతో భూలోకానికి దిగివచ్చిన రంభ, ఊర్వశి, మేనకలు.. తమ దివ్య శక్తులను కోల్పోవడంతో అసలు కథ మొదలవుతుంది. ముగ్గురు అప్సరసలు తన ఇంట్లో ఉండటంతో సూరికి ఎదురయ్యే ఇబ్బందులు, అతడి ప్రేయసి గొడవ, పోలీసుల విచారణ, మరోవైపు ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్న తల్లి.. ఇలా వరుస సమస్యలతో కథలో ఎంటర్‌టైన్‌మెంట్‌ని ట్రైలర్ అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ట్రైలర్‌ను దర్శకుడు చంద్ర మోహన్ చింతాడ ఆద్యంతం ఎంటర్‌టైనింగ్‌గా నడిపించారు. ముఖ్యంగా అల్లరి నరేష్, నరేష్ వికె మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి ‘ఒజి’లోని జపనీస్ డైలాగ్‌ను సరదాగా వాడిన విధానం ట్రైలర్‌కు మంచి కామెడీ ఎండింగ్ ఇచ్చింది. ట్రైలర్‌లో అల్లరి నరేష్ మరోసారి తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. సురభి కథానాయికగా నటించగా, వెన్నెల కిషోర్ ఇంద్రుడి పాత్రలో నవ్వులు పూయించారు. నరేష్ వికె కూడా అల్లరి నరేష్‌తో కలిసి వచ్చే సన్నివేశాల్లో మెప్పించారు.

## కిరణ్ అబ్బవరం మిస్టరీ పోస్టర్ !




హీరో కిరణ్ అబ్బవరం కెఎ ప్రొడక్షన్స్ బ్యానర్ స్థాపించారు. బ్యానర్‌పై ఇటీవల తిమ్మరాజుపల్లి టీవీ సినిమాను నిర్మించి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌తో కలిసి మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో అనూష్ గోరక్ డైరెక్ట్ చేస్తున్నారు. శివశంకర నాయుడుతో కలిసి కిరణ్ అబ్బవరం నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్బు, నమిత.ఎంవి, రెహమాన్, తనూజ పుట్టుస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ లో పక్షి కాళ్లను చూపిస్తూ, ‘ఇలాంటి కథను మీరు ఇప్పటిదాకా తెరపై చూడలేదు, ఇలాంటి జానర్‌ను మీరు ఊహించలేదు..’అంటూ రాసిన క్యాప్షన్ ఆసక్తి కలిగిస్తోంది. ఒక కొత్త తరహా కథను స్క్రీన్ మీద ప్రెజెంట్ చేయబోతున్నారు అనే ఇంప్రెషన్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌తో అందరిలో కలుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరల్లోడించనున్నారు. ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్ మేఘన గుమ్మడి ఆర్ట్ డైరెక్టర్ మక్కెన విజయ్ కుమార్, జీమోన్, అసోసియేట్ ప్రొడ్యూసర్ రితికేష్ గోరక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అల్లు బాలకృష్ణ, లైన్ ప్రొడ్యూసర్ వెంకట్ రాహుల్, ఎడిటర్ అఖిల్ చక్రవర్తి, మ్యూజిక్ జేసిన్ జార్జ్, కో–ప్రొడ్యూసర్స్ వినీల సాహిత్య, కుష్బు.

## ‘టాక్సిక్’ సినిమా టికెట్ ధరలు పెంపు




హైదరాబాద్, కన్నడ మాతృకలో నిర్మించి పాన్ ఇండియాగా విడుదల అవుతున్న టాక్సిక్ సినిమాకు తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచింది. 26వ తేదీన విడుదల ఉన్నందున ఒకరోజు ముందు మంగళవారం ఈ సినిమా టికెట్ ధరలను పెంచుతూ తెలంగాణ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 4 వరకు టికెట్ ధరల పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించారు. సింగిల్ స్క్రీన్‌లో రూ.50 అదనంగా వసూలుకు అనుమతి ఇచ్చారు. మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా వసూలుకు అనుమతి కల్పించారు. స్పెషల్ యేటర్లలోనూ రూ.100 అదనపు వసూలు చేసేందుకు ప్రభుత్వం సై అన్నది. 10 రోజుల పాటు టికెట్ ధరల పెంపు అమలు ఉంటుంది. రోజుకు 5 రెగ్యులర్ షోలకు పెంపు వర్తిస్తుంది. కెజిఎఫ్ హీరో యాష్ నటించిన ఈ సినిమాను తెలంగాణ లో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. సినిమా టికెట్ ధరలు పెంచినందుకు గాను చిత్ర నిర్మాణ సంస్థ కెవిఎన్ ప్రొడక్షన్స్ కోటి రూపాయలను సినిమా కార్మికుల నిధికోసం వెచ్చించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఎఫ్ డీ సి ఖాతాలో జమ చేయాలి. ఈ డబ్బును సినిమా కార్మికుల సంక్షేమం కోసం వినియోగించాలి.

## ‘మై లవ్’ ఫస్ట్ లుక్ విడుదల



జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో రూపొందుతున్న ‘మై లవ్’ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ఆడిటోరియంలో ఘనంగా విడుదల చేశారు. అదే వేదికపై జోష్ ఎంఆర్ఎస్ హైదరాబాద్ అవార్డ్స్–2026 కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ సందర్భంగా మై లవ్ హీరో సంజోష్ తగరం మాట్లాడుతూ ఎదో ఒక అమ్మాయిని ఎదో ఒక సమయంలో ఇష్టపడే ఉంటారు. మళ్ళీ ఆ అమ్మాయిని గుర్తుకు తెచ్చే సినిమా ‘మై లవ్ ’ ఇదొక ఫీల్ గుడ్ సినిమా లవ్ ఎంటర్‌టైన్‌మెంట్ డివోషనల్ కాన్సెప్ట్ తో ఇప్పటి వరకు ఎవరు టచ్ చేయని కొత్త పాయింట్‌తో ఈ సినిమా చేస్తున్నాం అన్నారు. ఈ సినిమాలో హీరో సంజోష్ తగరం, హీరోయిన్ రిషిత, పుష్ప కేశవ, రచ్చ రవి, 30 ఇయర్స్ పృథ్వి, డీజే టిల్లు ఫేమ్ మురళీధర్ గౌడ్ తనికెళ్ళ భరణి మరి కొంతమంది ప్రముఖులు ఈ సినిమాలో నటిస్తున్నారు.

## మేల్ ఆర్టిస్టులతో సూపర్ ‘కొత్త సినిమా’

### తమ్మారెడ్డి భరద్వాజ

ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సినిమా పట్టణంలోనే కాదు పల్లెపల్లెనా ఉంటుందని నిరూపిస్తూ కొత్త దర్శకుడు అజర్ లోకల్ టాలెంట్‌తో స్థానికంగా రూపొందించిన సినిమా ‘కొత్త సినిమా’. ఈ సినిమాతో వంద మంది న్యూ టాలెంట్ టాలీవుడ్‌కు పరిచయం కావడం విశేషం. సురేష్, రాకేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రానికి అజర్ స్టోరీ స్క్రీన్ ప్లే డైరెక్షన్‌తో పాటు డైలాగ్స్, ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మహమ్మద్ వాసిమ్ అక్రమ్, సాగి సుధీర్ రావు, యడండ్ల సతీష్ యాదవ్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. త్వరలో ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హైదరాబాద్‌లో ఈ సినిమా ‘వై ఇన్ హైదరాబాద్ వై నాట్ ఇన్ అవర్ ప్లేస్’ ఈవెంట్ పలువురు దర్శక నిర్మాతలు అతిథులుగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ అజర్ ఈ సినిమా టైటిల్ కొత్త సినిమా అని పెట్టడమే కాదు కొత్త ప్రయత్నం కూడా చేశాడు. అందరూ మేల్ ఆర్టిస్టులతో చేసిన మొదటి సినిమా ఇదే కావొచ్చు. ఇక్కడ సినిమా మేకింగ్ అంటే ఖర్చు, ఆర్టిస్టులు కూడా ఈజీగా దొరకరు. అందుకే అజర్ తన ఊరికి వెళ్లి, అక్కడే టాలెంట్ ఉన్న వారిని చూసుకుని, వారికి ట్రైనింగ్ ఇచ్చి, అక్కడే సినిమా రూపొందించాడు. ఖచ్చితంగా ఒక అద్భుతమైన సినిమా చేసి ఉంటాడని నమ్ముతున్నాను. ఆయనకు ఈ సినిమా మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నా అన్నారు.డిఓపి జానీ బాషా, మ్యూజిక్ డైరెక్టర్ పెద్దపల్లి రోహిత్ నటుడు రాకేష్, నటుడు సురేష్, క్రిటిక్ చల్లా శ్రీనివాస్, డైరెక్టర్ రమేష్, డైరెక్టర్ వీరశంకర్ , డైరెక్టర్ వివిఎన్ ఆదిత్య .



## ‘ఇరుముడి’ చూస్తుంటే కళ్లు చెమర్చాయి

### ‘సక్సెస్ మీట్’లో రవితేజ

మాస్ మహారాజా రవితేజ హార్ట్ విన్నింగ్ బ్లాక్‌బస్టర్ ‘ఇరుముడి’. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న విడుదలై అద్భుతమైన రెస్పాన్స్‌తో ఘన విజయాన్ని అందుకుని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ డైరెక్టర్ శివ ఈ సినిమా కోసం చాలా మంచి ఆర్టిస్ట్‌లను ఎంచుకున్నారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఆ మ్యూజిక్‌తో ఆటోమేటిక్‌గా ప్రేక్షకులకు కళ్లలో నీళ్లు వచ్చేస్తున్నాయి. మా అమ్మాయి మోక్ష కూడా ఈ సినిమా చూస్తూ కన్నీళ్లు పెట్టుకుంది. మా నిర్మాతలు రవి, నవీన్ నాకు చాలా మంచి స్నేహితులు. ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చూసి వాళ్లు పడుతున్న ఆనందం మాటల్లో చెప్పలేను. వాళ్లతో మరిన్నీ సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. కోవిడ్ తమిళ్ మలయాళ సినిమాలు ఎక్కువగా చూశాం. అవన్నీ రూటెడ్‌గా ఉండేవి. అలాంటి కంటెంట్ చూస్తున్నప్పుడు మన దగ్గర కూడా ఇలాంటి కంటెంట్ చేస్తే బాగుంటుంది కదా అనిపించేది. ‘ఇరుముడి’కి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది.ఆడియన్స్ రియాక్షన్స్ చూస్తుంటే నా కళ్ళు చెమర్చాయి. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం థియేటర్‌కి వచ్చిన వాళ్లు మళ్లీ ‘ఇరుముడి’ సినిమా చూడడానికి థియేటర్‌కి రావడం కూడా చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఈ ఆనందం మామూలుది కాదు. నాది రాతి గుండె. నాకు సాధారణంగా ఏడుపు రాదు. అలాంటిది ఈ సినిమా చూసి ఏడ్చేశాను. డైరెక్టర్ త్రినాథ్ పాత్ర, ‘ఇరుముడి’ అనే టైటిల్ చెప్పగానే నెక్స్ట్ లెవెల్ అనిపించింది. ఈ ఈ సక్సెస్ మీట్ లో డైరెక్టర్ శివ నిర్వాణ, ప్రియా భవాని శంకర్ , బేబీ నక్షత్ర , నిర్మాత రవిశంకర్ , నిర్మాత నవీన్ ఎర్నేని సాయికుమార్, అనంత శ్రీరామ్, సాశ్విక, డిఓపి విష్ణు శర్మ పాల్గొన్నారు.




## ప్రతాప రెడ్డి జీవితంపై చలన చిత్రం స్ఫూర్తిదాయకం





### మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ వైతాళికుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంపాదకుడు సురవరం ప్రతాప రెడ్డి జీవితంపై తీసిన చలన చిత్రం అందరికీ స్ఫూర్తిదాయకం అని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి సాహితి వైజయంతి ట్రస్ట్ నిర్మించిన ‘సురవరం‘ చలన చిత్ర (బయోపిక్) 2 గంటల 40 నిమిషాల ప్రివ్యూను హైదరాబాద్, బంజారా హిల్స్, ప్రసాద్ లాబ్స్‌లో మంగళవారం ప్రదర్శించారు. వి. శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ప్రముఖ సినీ దర్శకులు శేఖర్ కమ్ముల, తెలంగాణ సారస్వత పరిషద్ అధ్యక్షులు, ట్రస్ట్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివ రెడ్డి ఉపాధ్యక్షులు కొండా లక్ష్మి కాంత రెడ్డి, సన్ షైన్ హాస్పిటల్స్ డైరెక్టర్ డా. గురువారెడ్డి తదితరులు హాజరయ్యారు. చలన చిత్రం వీక్షించిన అనంతరం వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సురవరం ప్రతాప్ రెడ్డి సేవలను గౌరవిస్తూ ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, ఆయన జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించడం అభినందనీయమన్నారు. నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రజల దైన్యం, దారిద్ర్యం, ప్రాథమిక హక్కులను కూడా నోచుకోని దుస్థితి చూచి చలించి పోయి, ప్రజలకు చైతన్య పరుస్తున్న ఈ సినిమాలోని దృశ్యాలు ఆలోపింపజేసేవిగా ఉన్నాయని, తెలంగాణ ప్రజలు ప్రతిఒక్క రు ఈ చిత్రాన్ని చూసి చరిత్ర తెలుసుకోవాలన్నారు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ హైదరాబాద్ రాజ్యం అంత ఉద్యమయం, మాతృభాష తెలుగు లో చదువుకొనే అవకాశాలు లేని ఆ రోజుల్లో సురవరం ప్రతాప్ రెడ్డి తెలంగాణాను జాగృతం చేయడం వంటి దృశ్యాలు ఈ సినిమాలో నాటి పరిస్థితులను ప్రతిబింబించాయని తెలిపారు. నిజాం నాటి చరిత్ర నేటి తరం తెలుసుకునేందుకు ‘సురవరం‘ చిత్రాన్ని చూడవలసిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ‘సురవరం‘ దర్శకులు బి.ఎం.రెడ్డి, జి. హర్షవర్ధన్ రాయల్, రచయిత బి. విజయ ప్రసాద్, సురవరం కుటుంబ సభ్యులు డా. సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, సురవరం అనిల్ కుమార్ రెడ్డి, సురవరం కపిల్, సురవరం గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది

- పసుపు విలువ ఆధారిత ఉత్పత్తులతో రైతు ఆదాయం పెంచాలి
- పసుపు రైతులతో ముఖాముఖితో రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రైతుల సంక్షేమమే దేశ, రాష్ట్ర సంక్షేమమని, దేశ సౌభాగ్యానికి పునాదని రాష్ట్ర గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా అన్నారు. పసుపు సాగులో ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, బలమైన మార్కెట్ అనుసంధానంతో రైతుల ఆదాయాన్ని పెంచాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం పసుపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమక్షంలో ‘సునహరి మిట్టి అభియాన్’, మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించారు. ఉత్తమ రైతు సంఘాలకు గవర్నర్ మెమోంటోలు అందించి అభినందించారు. అనంతరం గవర్నర పసుపు రైతులనుద్దేశించి మాట్లాడారు. నిజామాబాద్‌కు పసుపు సాగులో ప్రత్యేక గుర్తింపు ఉందని గవర్నర్ అన్నారు. సారవంతమైన నేలలు, రైతుల కష్టగా ఈ ప్రాంతం దేశంలోని ప్రముఖ పసుపు ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందన్నారు. ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కావటం ఈ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిందన్నారు. పసుపు కేవలం వ్యవసాయ ఉత్పత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సాంప్రదాయం, ఆయుర్వేదం, ఆధ్యాత్మికత, నిత్య జీవితంతో ముడిపడిన విలువైన సంపద అని అన్నారు. దేశ వ్యవసాయ వారసత్వానికి పసుపు ప్రతీకగా నిలుస్తోందన్నారు. భారత్‌ను ప్రపంచంలోనే అతి పెద్ద పసుపు ఉత్పత్తిదారుగా కొనసాగించటంతో పాటు పసుపు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడమే జాతీయ పసుపు బోర్డు లక్ష్యమన్నారు. పసుపు పండించే ధర లభించటంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో భారత పసుపుకు ప్రత్యేక గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు నాణ్యత పెంపు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట కోత అనంతర నిర్వహణకై శిక్షణనందించటం అభినందనీయమన్నారు. ఎంపీ అరవింద్ మాట్లాడుతూ ఈ ప్రాంత పసుపు రైతుల నాలుగు దశాబ్దాల కలను నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు రైతులను అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. పసుపు క్వింటాలిచ్చే రేటు గతం కంటే పెరిగిందన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నగర మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేష్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానీ, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయిచైతన్య పాల్గొన్నారు.

## నిర్వహించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం చేయగా, 2025 మార్చిలో తుది నివేదిక సమర్పించినట్లు సీడబ్ల్యూసీ తెలిపింది. వర్షాకాలానికి ముందే మేడిగడ్డ బ్లాక్–7లోని గేట్లన్నింటినీ పూర్తిగా ఎత్తి ఉంచడం ద్వారా నీటి ఒత్తిడిని తగ్గించాలని నిపుణులు సూచించినట్లు ఎన్‌డీఎస్‌ఏ వెల్లడించింది. పియర్ నంబర్ 20 సమీపంలోని దెబ్బతిన్న 20, 21 గేట్లను అవసరమైతే తొలగించాలని, మిగిలిన ఆరు గేట్లను పూర్తిగా తెరిచి పటిష్టంగా బిగించాలని సూచించినట్లు పేర్కొంది. గేట్లు పూర్తిగా ఎత్తడం సాధ్యం కాకపోతే వాటిని తొలగించాలని సిఫారసు చేసినట్లు తెలిపింది. పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు కేంద్ర జల వనరుల శాఖ 2026 జూన్ 30న సాంకేతిక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసిందని సీడబ్ల్యూసీ పేర్కొంది. డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం తన బాధ్యతలను నిర్వర్తించామని, బ్యారేజీల భద్రత, మరమ్మతులపై తదుపరి చర్యలు రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ పరిధిలో ఉంటాయని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టం చేసింది. కాళేశ్వరం ద్వారా సాగునీరు, నీటి సరఫరా, ప్రాజెక్టు నిర్వహణ, నీటిని నిల్వ చేయడం లేదా విడుదల చేయడం వంటి అంశాలు రాష్ట్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలని తెలిపింది.

## గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. చిలకలగూడలో నీలగిరి ప్రసాద్ నకిలీ ఎంబిబిఎస్, బిహెచ్‌ఎంఎస్ సర్టిఫికెట్లతో జనరల్, చైల్డ్ స్పెషలిస్ట్‌గా చలామణి అవుతున్నట్లు గుర్తించారు. రాణిగంజ్‌లో అదన్ సంధాని చర్మవ్యాధుల నిపుణుడిగా, లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఎం. శ్రీనివాస్, చిలకలగూడలో పెద్దపాట్ల సదానంద్, మణికేశ్వర్‌నగర్‌లో చింతలూరి రమేష్, శివరాత్రి లింగయ్యలు ఎలాంటి అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి 5 స్టెతస్కోప్‌లు, 5 బిపి మెషిన్లు, 277 ఇంజెక్షన్లు, 933 మాత్రలు, 12 సెలైన్ బాటిళ్లు, 70 సిరంజిలు, 16 ఆయింట్‌మెంట్లు, 57 సిరప్‌లు, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్లు, రబ్బర్ స్టాంప్‌లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.అర్హతలు, గుర్తింపు పత్రాలు లేని వ్యక్తుల వద్ద వైద్యం చేయించుకోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. నకిలీ వైద్యుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఆపరేషన్‌లో సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జె. రాజశేఖర్‌తో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమెరికా నుండే భారీగా ఎల్‌పిజి దిగుమతులు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధం వల్ల రవాణా స్తంభించిపోవడంతో మనదేశం ఇప్పుడు ఎల్‌పిజి, ఎల్‌ఎన్‌జి దిగుమతులపై ఎక్కువగా అమెరికాపైనే ఆధారపడుతోంది. గడచిన రెండు నెలలుగా 73 శాతం పైగా ఎల్‌పిజి దిగుమతులు అమెరికా నుండే భారత్‌కు వస్తున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి భారత్‌కు వచ్చే ఎల్‌పిజి దిగుమతులు ఆగస్టు నెలలో 1.40 లక్షల టన్నులు మాత్రమే వచ్చాయి. ఖతార్ నుండి 60,000 టన్నులు మాత్రమే వచ్చాయి. ఇక సౌదీ అరేబియా నుండి జులై,ఆగస్టు నెలలో పూర్తిగా దిగుమతులు స్తంభించిపోయాయి. దీంతో భారతదేశం ఎక్కువగా అమెరికాపైనే గత రెండు నెలలుగా ఎక్కువగా ఆధారపడుతోంది. గడచిన కొద్ది నెలలుగా భారత్ అమెరికావైపు మళ్లిందని ముఖ్యంగా ఎల్‌పిజి విషయంలో ఈ మార్పు సంభవించిందని మోడెల్లింగ్ సీనియర్ మేనేజర్ సుమిత్ రితోలియా చెప్పారు. లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్,లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌ల దిగుమతులన్నీ భారీస్థాయిలో భారత్‌కు అమెరికా నుండే వస్తున్నాయి. అమెరికా కోరుకున్నదీ ఇదే. కెప్లర్ గణాంకాల ప్రకారం, ఆగస్టు నెలలో అమెరికా నుండి 0.62 మిలియన్ టన్నులు ఎల్‌పిజి, దిగుమతయ్యింది. జులైలో 0.89 మిలియన్ టన్నులు దిగుమతి చేసుకుంది. అంటే 73 శాతం పైగా ఎల్‌పిజి దిగుమతులు అమెరికా నుండే భారత్‌కు వచ్చాయి.

## సమర్థవంతంగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పంటల (కాంటింజెన్సీ క్రాప్) ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న సీజనల్ పరిస్థితులు, ఈ నెల 30న జరగనున్న నీట్‌పిజి ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, పర్యాటక ప్రాంతాల సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్‌లతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షా సమావేశంలో సిఎస్ మాట్లాడుతూ తక్కువ నీటితో సాగయ్యే పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యాన పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తూ పంటల వైవిధ్యీకరణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతో సహా 30కి పైగా కేంద్రాల్లో జరగనున్న నీట్‌పిజి పరీక్షలకు సంబంధించి విద్యుత్ సరఫరా, తాగునీరు, రవాణా మరియు పటిష్ట భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ టూరిజం 2047 పాలసీలో భాగంగా రాష్ట్రంలోని 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను (ఎస్‌టిఏ) గుర్తించామని, తెలంగాణ బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ సిఎస్ వాణిప్రసాద్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ సన్నద్ధం

### ఉన్నతా అధికారుల సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి మంగళవారం పౌరసరఫరాల భవన్‌లో పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర అధ్యక్షతన ఉన్నతాధికారులు సమావేశమై ధాన్యం నిల్వ, రవాణా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ కె.సురేంద్ర మోహన్, డైరెక్టర్ బి.గోపి, సెర్ప్ ముఖ్య అధికారి దివ్య దేవరాజన్ , టిజిఎస్‌డబ్ల్యూసి మెనేజింగ్ డైరెక్టర్ కొర్ర లక్ష్మి , సహకార శాఖ స్పెషల్ కమిషనర్, రాహుల్ రాజ్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్‌లు పాల్గొన్నారు. రైతుల నుంచి సేకరించనున్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గోదాములు, మార్కెట్ యార్డులు, ఇండస్ట్రియల్ షెడ్లు, ఫంక్షన్ హాళ్లు, ఓపెన్ స్పేస్‌లు, క్యాప్ స్టోరేజీలను వినియోగించకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే ఉన్న పాత నిల్వలను త్వరగా ఖాళీ చేసి కొత్త ధాన్యానికి అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, మెకానికల్ స్టాకర్ల ఏర్పాటుపై కూడా సమావేశంలో సమీక్షించారు. దీంతో కొనుగోలు ప్రక్రియ వేగవంతమై రైతుల నిరీక్షణ తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు.అలాగే ఫార్మ్ టు సైలో’ (పొలం నుంచి నేరుగా సైలో గోదాములకు) ధ్యానాన్ని తరలించే విధానంలో డిజిటల్ వెయిబ్రిడ్జీలు, శాస్త్రీయ నాణ్యత పరీక్షలు, ప్రీక్లీనింగ్ వ్యవస్థలు, గ్రెయిన్ డ్రైయర్లు, ఆటోమేటెడ్ బల్క్ సైలోలు, రైస్ మిల్లుల అనుసంధానంపై చర్చించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com